ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక



4 అణా
12-12-5

ANDHRA PATRIKA

క థా ర చ యి త ల కు మ హ ద వ కా శ ం

సంక్రాంతికి [illegible]!

డిటెక్టివ్ కథలపోటీ

★

మొదటి బ[illegible] 50/-

రెండవ బహ[illegible]

★

★ రాబోయే సంక్రాంతికి ఆంధ్ర వారపత్రిక ప్రత్యేకసంచికగా (16-1-57) వెలువడుతుంది ఈ సందర్భంలో డిటెక్టివ్ కథలపోటీ నిర్వహిస్తున్నాము. ఈ పోటీలో పాల్గొనవలెనని రచయితలను ఆహ్వానిస్తున్నాము

ప్రథమ స్థానం పొందిన కథకు రూ. 50/-,

రెండవ స్థానం పొందిన కథకు రూ. 30/- బహూకరిస్తాము

★ కథలు తెలుగు దేశానికి సంబంధించినవై వుండాలి.

★ కథ పరిమితి వార పత్రికలో నాలుగు పేజీలకు తగ్గకుండా, ఐదు పేజీలకు మించకుండా వుండాలి.

★ పోటీలో గెలిచిన కథలను సంక్రాంతి ప్రత్యేక సంచికలో ప్రకటిస్తాము కథలు డిసెంబరు 26 వ తేదీ లోగానే మా కార్యాలయానికి చేరాలి. ఆ తరవాత వచ్చిన కథలు పోటీకి స్వీకరింపబడవు రచనపై "డిటెక్టివ్ కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి

★ పోటీలో స్త్రీ పురుష రచయితలెవరైనను పాల్గొనవచ్చును. కథలపై తుదినిర్ణయం సంపాదకులదే.

★ రచయితలు ఈ మహదవకాశాన్ని వినియోగించుకొని మా ప్రయత్నం జయప్రదం చేయగలరని ఆశిస్తున్నాము.

★ సంక్రాంతి సంచికకు పంపించగోరే ప్రత్యేకవ్యాసాలు, కథలు, నాటికలు, పద్యాలు, చిత్రాలకు కూడా డిసెంబరు 26 వ తేదీయే గడువు.

సంవత్సర చందా
రు 12-0-0
విడిపత్రిక 4 అ

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 15
12-12-56

దుర్ముఖ మార్గశిర శుద్ధ దశమి బుధవారం

★ విషయానుక్రమణిక ★

ముఖచిత్రం: జానకి.

శ్రీరామ రక్ష

మొన్న డిసెంబరు 2-న శ్రీ సంజీవరెడ్డి అగ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ కాంగ్రెసు పక్షం సమావేశంలో సభాపతి స్థానానికి ఎవరిని అధికార అభ్యర్థిగా నిర్ణయించాలనే సమస్య పరిశీలనకు వచ్చింది. పార్టీ సమావేశం రెండు మూడు రోజులకు జరుగుతుందనగానే, మిగతా సభ్యులందరితో పాటు కాంగ్రెసు వృద్ధ నాయకుడు శ్రీ కాళేశ్వరరావు, ఆంధ్ర రాష్ట్ర శాసనసభ పాతస్పీకరు శ్రీ రొక్కం దొర రాజధానికి చేరుకున్నారు. సభాపతి స్థానానికి వీరు ఉభయులూ పోటీ చేయాలనే స్థిరంగా సంకల్పించుకున్నారు. ఇదివరకే సభాపతి స్థానంలో వున్న వ్యక్తిని ఎందుకు మార్చాలని కొంతమంది, ఎందుకు మార్చకూడదు, కాంగ్రెసులో చిరకాలం నుంచీ సభ్యులై ఉండి దేశసేవలో పండిపోయిన వృద్ధమూర్తి శ్రీ కాళేశ్వరరావు గారిని ఆ పదవికి ఎందుకు ఎన్నుకోకూడదు అనిమరికొంతమంది సభ్యులు తీవ్రంగా ఘర్షణ పడడంజరిగింది. పోటీ అనివార్యమై, ఎవరిని అభ్యర్థిగా నిర్ణయించాలో తెలియని స్థితి ఏర్పడ్డది. ఇలాంటి పరిస్థితులలో కాంగ్రెసు కార్యదర్శి శ్రీమన్నారయణ పెటిన భిక్షు వుండనే వున్నది. సభ్యులలో ఎక్కువమంది ఏ అభ్యర్థిని బలపరుస్తున్నారో వోట్ల ద్వారానే అంతరంగికంగా తేల్చివేయడం, ఆపిమ్మట రెండోవ్యక్తి పోటీనుంచి విరమించి గెలిచిన వ్యక్తి పేరును తానే ప్రతిపాదించడం.

ఇదే శ్రీమన్నారాయణ పెటిన వరవడి. పార్టీసమావేశంలో ఇదే జరిగింది. సభాపతి స్థానానికి అభ్యర్థివిషయంలో కాంగ్రెసు పక్షం ఏకగ్రీవాభిప్రాయానికి రాలేకపోయింది. చివరకు శ్రీ కాళేశ్వరరావు పేరును శ్రీ సాగి సూర్యనారాయణ ప్రతిపాదించగా, శ్రీ ఎం ఎస్ రాజలింగం బలపరిచారు. శ్రీ రొక్కం దొర పేరును శ్రీ టి ఎస్. వెంకటసుబ్బారెడ్డి ప్రతిపాదించగా, శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి బలపరిచారు. శ్రీ కాళేశ్వరరావుకు 91 వోట్లు, శ్రీ దొరకు 73 వోట్లు వచ్చి, శ్రీ కాళేశ్వరరావుగారు గెలిచారు. శ్రీమతి సంగం లక్ష్మీబాయి ఉప సంహరించుకోగా, ఉపసభాపతి స్థానానికి



సభాపతి శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు

తెలంగాణా శాసనసభ్యుడు శ్రీ కొండా లక్ష్మణ్ పేరును నిర్ణయించారు. నాల్గవ తేదీన శాసనసభ సమావేశమైనప్పుడు, వీరిద్దరి ఎన్నిక నూ ఖాయంచేసింది. వయోవృద్ధుడు, విశాలాంధ్ర స్థాపనకు అవిరళకృషి చేసిన శ్రీ కాళేశ్వరరావు సభాపతిగా ఎన్నిక అయినందుకు ఆంధ్రులు తప్పక హర్షిస్తారు. వీరు ఈ పదవిని సభారంజకంగా నిర్వహిస్తారని ఆశిద్దాము.

* * *

ముఖ్యమంత్రికీ, శ్రీ గోపాలరెడ్డికీ జరిగిన సమాలోచనలు ఫలించినవి. మంత్రివర్గ విస్తరణ ప్రారంభమైంది. పదమూడో మంత్రిగా మాజీ ముఖ్యమంత్రి మొన్న నవంబరు ఆఖరు తేదీన పదవీస్వీకారం చేశారు. శ్రీ గోపాలరెడ్డి రాష్ట్ర అంతరంగిక వ్యవహారాలశాఖపై అధ్వర్యం వహిస్తున్నారు. అనుభవజ్ఞులు, పరిపాలనాదక్షులు అయిన శ్రీ గోపాలరెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ అవతరణతోపాటే మంత్రివర్గంలో చేరవలసిన వారు. కారణాంతరాలవల అప్పుడు అది సంగా జరగలేదు. ఆ కారణాంతరాలన్నీ ఇప్పుడు పరిష్కారమైనవనే ఆశించవచ్చు. కాంగ్రెస్ పక్షంలో వర్గాలదోరణిని నిర్మూలించడానికే మంత్రివర్గంలో చేరామనీ, కాంగ్రెస్‌లో చీలికలు ఉండడం శ్రేయస్కరం కాదనీ శ్రీ గోపాలరెడ్డి చేసిన ప్రకటన ప్రకారంగానైనది. మాజీ ముఖ్యమంత్రి వెలిబుచ్చిన భావాలతో ప్రస్తుత ముఖ్యమంత్రికూడా ఏకీభవించక తప్పదు. వీరిద్దరిమధ్య సంపూర్ణ సామరస్యం కుదిరినట్లయితే, శ్రీ గోపాలరెడ్డిగారి చేరికతో మంత్రివర్గ విస్తరణ ప్రారంభమైందని మాత్రమే, చెప్పాలిగాని, పూర్తి అయిందని చెప్పడానికి వీల్లేదు. మంత్రివర్గం పదమూడుమంది సభ్యులతోనే వుంటుందని భావించవలసిన పనిలేదు. మంత్రివర్గాలకు పదమూడు సంఖ్య, గతి అనుభవాన్ని బట్టి, అచ్చిరాలేదనుకోవలసిన పనికూడా లేదు. మొన్నదిమీద పద్నాలుగో మంత్రి ప్రమాణస్వీకారం చేయడం జరుగుతుందని శ్రీ గోపాలరెడ్డే చెబుతున్నారు. సువిశాలమైన ఆంధ్రప్రదేశ్‌కు ఇదేమంత చెప్పుకోదగినంత పెద్ద మంత్రివర్గమేమీ కాదనే భావంతో ముఖ్యమంత్రి వున్నారు కాబటి, మంత్రుల సంఖ్య పదిహేనువరకూ పెరుగుతుంది శుభం!

* * *

ఉపమంత్రులను నియమించాలనే ఉద్దేశానికే ఉద్వాసన చెప్పినట్లు కనుపిస్తున్న ముఖ్యమంత్రి ఒక విషయం గమనించాలి. మంత్రివర్గంలో స్త్రీలెవరూ లేదన్నదే ఆ విషయం. వచ్చే ఎన్నికలలో నూటికి పదిహేనువంతులవరకూ వివిధ శాసనసభలలోను స్త్రీలకు స్థానాలు కేటాయించ దలచింది కాంగ్రెస్. మంత్రివర్గాలలోకూడా ఇంచుమించు అదేప్రకారం స్త్రీలకు స్థానాలు ఇవ్వవలసిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఆంధ్ర రాష్ట్రంలో గతసారి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ విజయసాధనకు మహిళలు అమోఘమైనపాత్ర నిర్వహించారన్నది తెలిసిన సంగతే. ఇంతేగాక, పంచవర్ష ప్రణాళికల క్రింద జరుగుతున్న వివిధసామాజికాభ్యుదయ కార్యకలాపాలలో స్త్రీలు ముందంజ వేసి, విశేష కృషి చేస్తున్నారు. అందుచేత ప్రస్తుత మంత్రివర్గంలో కనీసం ఒక మహిళకైనా స్థానం ఇవ్వడం భావ్యం.

* * *

శ్రీశైల రామేశ్వరం జాతీయ రహదారిలో కర్నూలువద్ద తుంగభద్రనదిమీద నిర్మించవలసిన రోడ్డు వంతెన విషయమై ఇప్పటికి దాదాపు రెండేళ్లనుంచీ తర్జనభర్జన జరుగుతూ వచ్చింది. నదిపై వంతెన ఏప్రదేశంలో నిర్మించాలనే మీమాంస కొన్నాళ్ళు, ఆర్థిక ఆమోదం లభ్యంగాక మరి కొన్నాళ్ళు కాలహరణం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రోడ్లశాఖ ఇంజనీరు శ్రీ గురాని ఈమధ్య పత్రికావిలేఖరులతో ముచ్చటిస్తూ, ఈవంతెన నిర్మాణానికి ఆమోదం లభ్యమైందనీ, రేపు జనవరిలో నిర్మాణ కార్యక్రమానికి ఉపక్రమించడం జరుగుతుందని

★ శ్రీ రామ రక్ష ★

ప్రకటించారు ఈ ఒక్క వంతెనే గాకుండా మహబూబ్ నగరం జిల్లా సరిహద్దులో ఇదే జాతీయ రహదారికి కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి కూడా ప్రారంభోత్సవం జరుగుతుందని వీరు తెలియజేశారు తుంగభద్ర వంతెనకు 40 లక్షలు, కృష్ణానది వంతెనకు మరో 60 లక్షలు ఖర్చవుతుంది ఇది జాతీయ రహదార్లకు సంబంధించిన విషయం కాబట్టి, ఖర్చుఅంతా కేంద్రప్రభుత్వమే భరిస్తుంది నిర్మాణ బాధ్యతమాత్రమే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానిది ఈ రెండు వంతెనల నిర్మాణం మూడు సంవత్సరాలలో పూర్తి అవుతుంది ఈ వంతెనలు ఏర్పడితే, కర్నూలునుంచి హైదరాబాదుకు నిరాటంకంగా కార్లలోనూ, ఇతర మామూలు వాహనాలలోనూ ప్రయాణంచేయడానికి వీలవుతుంది

ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా, సాంఘికంగా, పారిశ్రామికంగా శీఘ్రగతిని అభివృద్ధి చెందాలంటే వివిధ జిల్లాలమధ్యధారాళంగా సామగ్రి రవాణాకు, ప్రజల రాకపోకలకు రహదారి సౌకర్యాలు ఏర్పాటు చేయడం అత్యవసరం కర్నూలు - మహబూబ్ నగరం జిల్లాలమధ్య ప్రయాణానికి రహదారీ సౌకర్యాలు లేనట్టే, గుంటూరు - నల్గొండ జిల్లాలమధ్యా, తూర్పు పశ్చిమ గోదావరి వరంగల్లు జిల్లాల మధ్య రాకపోక సౌకర్యాలు లేవు కృష్ణా గోదావరీ నదులమీద తగినన్ని రోడ్డు వంతెనలు ఏర్పడినప్పుడే ఈ రాకపోక సౌకర్యాల అభివృద్ధి సాధ్యపడుతుంది కేంద్ర ప్రభుత్వం ఒక్క జాతీయ రహదారుల విషయంలో మాత్రమే పట్టించుకుంటుంది కాబట్టి, మిగతా రస్తాల అభివృద్ధి విషయంలో రాష్ట్రప్రభుత్వమే శ్రద్ధవహించవలసి వుంటుంది రాష్ట్రాభ్యుదయాన్ని కాంక్షించే ఏప్రభుత్వమూ ఈ రహదార్ల నిర్మాణంపట్ల అశ్రద్ధవహించ లేదు



మంత్రిగాచేరిన శ్రీ గోపాలరెడ్డి

* * *

ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ పదవిని స్వీకరించిన తర్వాత శ్రీ త్రివేదీ ప్రప్రథమంగా పర్యటించింది మహబూబ్ నగరం జిల్లాలో షాద్ నగరాన్ని, దాని సమీపంలోని కొన్ని గ్రామాలనూ గవర్నర్ చూశారు హైదరాబాదు మాజీ ముఖ్యమంత్రి శ్రీ రామకృష్ణరావు లోగడ రాష్ట్ర శాసన సభకు షాద్ నగర నియోజకవర్గంనుంచే ఎన్నికైనారు స్థానిక ప్రజలు శ్రీ త్రివేదీకి బ్రహ్మాండమైన స్వాగతం చెప్పారు. రాజ్యాంగరీత్యా తమ పదవి ప్రజలకు ప్రభుత్వానికి మధ్య పోస్టాఫీసులాంటి దన్నారు అంతమాత్రంచేత, గవర్నర్ పదవి కేవలం "పూజ్యం" లాంటిదని చెప్పలేము. ఆ పదవి నిజంగా పూజ్యమైనదే తలుచుకుంటే ఆయన మంత్రివర్గం తలపెట్టిన పనులలో ఎలాంటి జాప్యమూ జరగకుండా చూడవచ్చు

* * *

ప్రపంచ పరిస్థితులు ఆరోజు కారోజు మితిమీరి పోతున్నవి ప్రధాని నెహ్రూ వర్ణించినట్లు అవి కట్లు తప్పినట్లు పరిణమిస్తున్నవి ఏరోజు మరో మహాసంగ్రామాన్ని ప్రపంచం ఎదుర్కొనవలసి వస్తుందో తెలియకుండా వుంది అందుచేత మనం సాగిస్తున్న నిర్మాణ కార్యక్రమం 'స్పీడు' ఎక్కువ కావాలి ముఖ్యంగా నీటి పారుదల భారీ ప్రాజెక్టుల నిర్మాణం చురుకుగా సాగించుకోవాలి నిర్ణీత కాలానికి ముందుగానే వాటిని పూర్తిచేసుకోవాలి ద్వితీయ ప్రణాళిక కాలంలో ఎక్కువ పంటలు పండించేందుకు కృషి చేయాలని షాద్ నగర సభలను ఉద్బోధించిన గవర్నర్, నాగార్జున సాగరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరగకుండా చూడాలి వంశధార ప్రాజెక్టు నిర్మాణం త్వరలో ప్రారంభమయ్యేట్లు కూడాచేయాలి ఇప్పటికీ వంశధార ప్రాజెక్టు ఇలా చర్వణ ఘట్టంలోనే వుండిపోవడం శోచనీయం!

రిజర్వాయర్ గొట్టవద్ద కట్టాలా, లేక, పాశీనగరంవద్ద కట్టాలా అన్నది ఇంతకాలానికి ఒక సమస్యే కేంద్ర జల విద్యుచ్ఛక్తి సంఘం సభ్యుడు డా॥ కె ఎల్ రావు, ఆంధ్రప్రదేశ ప్రధాన ఇంజనీరు శ్రీ వెంకట కృష్ణయ్యర్ రెండు స్థలాలను స్వయంగా తనిఖీ చేసివచ్చారు గొట్టవద్ద ప్రాజెక్టునిర్మిస్తే 30 వేల ఎకరాల మాగాణిభూమి మునిగి పోతుందట అది పర్లాకిమిడిరాజాగారి ఆక్షేపణ పాశీవద్ద నిర్మిస్తే నాగార్జున సాగరం, రామపాదసాగరం లాగే, వంశధార ప్రాజెక్టుకు 'శివపాదసాగరం' అని పేరు (అక్కడ నదిమధ్య వున్న శివాలయాన్ని బట్టి) పెట్టవచ్చునట 'శివపాదసాగరం' అని పేరు పెట్టినా, 'సదాశివపాదసాగరం' అని పేరు పెట్టినా నిర్మాణకార్యక్రమానికి ఇకనైనా ఉపక్రమించడం అవసరం

4-12-56

—[భార్గవ]

దలైలామా, పాంచన్‌లామా

ఇద్దరు ప్రియతమ యాత్రికులు

ప్రస్తుతం టిబెట్ పరిపాలకుడు 14 వ దలై లామా టిబెట్‌లో దలై లామాల ఎన్నిక చాలా చిత్రంగా జరుగుతుంది

లామాలు ఆధ్యాత్మిక మత విషయాలలోనే కాక, మిగిలిన టిబెట్ పరిపాలన వ్యవహారాలన్నిటిలోను సర్వాధికారం చలాయించేవారు పాంచన్ లామాహోదా దలై లామాహోదాకంటె కొంచెం తక్కువ

లామాల నందరినీ 3 4 సంవత్సరాల వయస్సులోనే గుర్తిస్తారు తరవాత వారి పెంపకము, విద్యాభ్యాసము మొదలైనవన్నీ దలై లామాల పర్యవేక్షణలోనే జరుగుతాయి చివరికి అక్క చెల్లెలు కూడా ఆ చిన్న లామాలను చూడకూడదట! లామాలు జీవితాంతము బ్రహ్మచర్యవ్రతం అవలంబించి నిశితమైన క్రమశిక్షణ ప్రకారం నడుచుకోవలసిందే

ప్రస్తుతం టిబెట్ పరిపాలిస్తున్న 14 వ దలై లామా ఎన్నిక చాలా విచిత్రంగా జరిగింది సామాన్యంగా పూర్వపు లామాలే ముందు ముందు రాబోయే లామా ఎక్కడ పుట్టిందీ తెలియజేస్తుంటారు

కాని 13 వ లామా 1933 లో స్వర్గధామం చేరకోగానే టిబెట్‌లో ఒక పెద్ద అవాంతరం ఏర్పడింది ప్రజలంతా కొత్త లామా శీఘ్రంగా అవతరించాలని ప్రార్థించారట! దలై లామా, టిబెట్ ప్రభుత్వాధికారులు, మత గురువులు కొత్తలామా అన్వేషణకోసం బయలుదేరారు వారందరికీ కొంచెం ఈశాన్యమూలగా రంగురంగుల ఇంద్ర ధనుస్సులు, ఇంకా తదితర శుభ శకునాలు కనిపించాయి

క్రమంగా 1937 నాటికి కొత్తలామా ఉన్న చోటు పసికట్టుకున్నారు. చిట్టచివరికా పసివాడు కోకోనార్ రాష్ట్రంలో దొరికాడు. ఆపిల్లవాడి తల్లి దండ్రులు బీద రైతులు. అప్పటికా పసివాడికి రెండేళ్లు నిండాయి. అతగాడు ఆగంతుకులను చూస్తూనే 'లామా, లామా' అని కేకలు పెట్టాడట!

అదీగాక లామాగా అవతరించిన పసివాడికి కొన్ని ప్రత్యేక సాముద్రిక లక్షణాలు కూడా ఉండాలి అతని పాదాలమీద పెద్దపులి చర్మం మీది చుక్కలవంటి చుక్కలుండాలి చెవులుచాలాపొడుగ్గా ఉండాలి. మూపాల్లో శంఖముద్రలుండాలి ఇంకా ఇలాంటివే మరికొన్ని లక్షణాలుండాలి

ఆరెండేళ్ల చిన్నవాడిలో లామా లక్షణాలన్నీ కనిపించాయట. తరవాత అతన్ని టిబెట్ ముఖ్యనగరం లాసాలో ఉన్న లామాల పోతాల రాజభవనానికి తీసుకుపో



చైనా ప్రధానమంత్రి చౌ ఎన్ లై భారతదేశంలో రెండువారాల పర్యటన నిమిత్తం నవంబరు 28 వ ఢిల్లీ వచ్చినప్పుడు విమానాశ్రయంలో ఆయనను, ఆయన వెంట వచ్చిన ఉపప్రధాని హోలుంగ్‌ను భారతప్రధాని నెహ్రూ స్వాగతమిచ్చారు. బుద్ధపరినిర్వాణోత్సవాలలో పాల్గొనడానికి వచ్చిన దలైలామా, పంచన్‌లామాకూడా పై చిత్రంలో ఉన్నారు

★ ఇద్దరు ప్రియతమ యాత్రికులు ★

యారు. అప్పటినించీ అతన్ని లామాగా గౌరవించారు అతనికి యుక్తవయస్సు రాగానే టిబెట్ కంతటికీ దలైలామాగా అభిషేకించారు అతనే ఇటీవల భారతదేశం సందర్శించడానికివచ్చిన దలైలామా. ఇంతకు పూర్వం జరిగిన దలైలామాల ఎన్నికలన్నీ ఇంచుమించుగా ఇలాగే జరిగాయి

టిబెట్‌లో మొట్టమొదటి దలైలామా రాజ్యాభిషేక గాథకూడా చాలా విచిత్రమైనదే అంతకు పూర్వం లామా లాదేశంలో కేవలం మత గురువులుగానే ఉండేవారు.

18 వ శతాబ్దం చివరి భాగంలో చైనాలో కుబ్లైఖాన్ చక్రవర్తిగా ఉండేవాడు అతనే చైనాలో మొట్టమొదటి మంగోల్ చక్రవర్తి.

కుబ్లైఖాన్ అప్పటి టిబెట్ దలైలామాను చైనాదేశానికి ఆహ్వానించి అతని దగ్గర బౌద్ధధర్మదీక్ష స్వీకరించాడు గురుదక్షిణగా టిబెట్ దేశంమీద సర్వాధికారం ధారావత్తం చేశాడు ఆనాటినించీ టిబెట్ దేశంపై లామాల సార్వాధిపత్యం ప్రారంభమైంది

ఆ అధికారానికి 14 వ శతాబ్దం మధ్యభాగంలో కొంచం విఘాతం వచ్చింది మంగోల్ తెగల నిరంతర దండయాత్రలే ఈ విఘాతానికి ప్రధాన కారణం

తరవాత 14 వ శతాబ్దం ఉత్తరార్థంలో టిబెట్ బౌద్ధధర్మంలో కొన్ని సంస్కరణలు జరిగాయి ఈ సంస్కరణలు ప్రారంభించిన వ్యక్తి ట్సాంగ్ కపా ఇతడు మత గురువులెవరు మద్యపానం చెయ్యకూడదనీ వివాహం చేసుకోకుండా నిశితమైన బ్రహ్మచర్య వ్రతం అవలంబించాలనీ శాసించాడు. అంతకు పూర్వం ఎర్ర టోపీలు ధరించే మతగురువుల శాఖ ఒకటి టిబెట్‌లో బాగా వ్యాప్తిలో ఉండేది ఇతడు ఈశాఖ ప్రచారంలో ఉండరాదని శాసించాడు. అంతే గాక కొత్తగా మరి ఒక పసుపు పచ్చని టోపీలు ధరించే మతశాఖ ప్రారంభించాడు.

ఇంతవరకు టిబెట్ దేశం పరిపాలించిన 18 గురు దలైలామాలలోను, 5 వ లామా చాలా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఆ తరవాత 18 వ దలైలామాకు కూడా గొప్ప ప్రఖ్యాతి వచ్చింది టిబెట్ దేశీయులు వీరిద్దరినీ కేవలం అవతార పురుషులుగా గౌరవిస్తారు

5 వ దలైలామా లాసానగరం టిబెట్ కంతటికీ రాజధాని నగరంగా ఉండాలని నిర్ణయించాడు. దలైలామాల నివాసస్థానం పోతాల భవనం అత్యద్భుతంగా నిర్మించిన వాడుకూడా ఇతడే

6-వ దలైలామా లామాలందరికీ అప్రతిష్ఠ తీసుకువచ్చిన మహామహుడు ఇతడు వివాహం చేసుకోలేదు కాని మద్యపానం మొదలయిన కులాసా వ్యవహారాలతో కాలక్షేపం చేసేవాడు

చివరికి చైనాప్రభుత్వం ఇతణ్ణి తొలగించి వేసి ఇతనిస్థానంలో ఒక 25 ఏళ్ల యువకుణ్ణి దలైలామాగా ప్రతిష్ఠించింది దీనికి టిబెట్ జాతీయు లంగీకరించలేదు దానిమీద చైనాకు, టిబెట్‌కుమధ్యన యుద్ధంప్రారంభమైంది చివరికి టిబెట్ పూర్తిగా లొంగిపోయింది దానితో - అంటే 18-వ శతాబ్దం ప్రారంభంనాటికి టిబెట్ దేశంమీద చైనా ప్రాభవం బాగా పాతుకుపోయింది


ప్రస్తుతం టిబెట్ పరిపాలకుడు 14 వ దలైలామాకు 1952 నాటికే యుక్తవయస్సు వచ్చింది. నిజంగా ఆనాటినించీ ఇతడు టిబెట్‌పై సర్వాధిపత్యం వహించవలసిందే కాని కమ్యూనిస్టు చైనా చాలావరకు ఇతని అధికారాలన్నీ తొలగించివేసింది ప్రస్తుతం ఇతడు నామమాత్రంగానే టిబెట్ పరిపాలకుడు

టిబెట్‌లో అత్యధిక సంఖ్యాకులు బౌద్ధులు అయితే లామాలెవరూ ఇంతకు పూర్వం బుద్ధుని జన్మస్థానమైన భారతదేశం సందర్శించలేదు దలైలామా పాంచన్‌లామా లిద్దరు కలిసి బుద్ధజయంతి ఉత్సవాలలో భారతదేశం సందర్శించడం ప్రప్రథమంగా ఈమధ్యనే జరిగింది

వీరిద్దరు ఢిల్లీకివచ్చినప్పుడు భారత ప్రభుత్వము, భారతీయులు వీరికఖండస్వాగతం చేసి గౌరవించారు

త్వరలోనే వీరిద్దరు నాగార్జున కొండశిథిలాలు సందర్శింపబోతున్నారు

—శాస్త్రి



రైల్వేమంత్రి రాజీనామా

శ్రీకృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

రైల్వేమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి రాజీనామా న్యూఢిల్లీలో సంచలనం కలిగించింది ఆయన రాజీనామాకు కారణమైన రైలు ప్రమాదానికంటె రాజీనామాయే ఎక్కువ సంచలనం కలిగించింది రాజీనామా అనుకోకుండా జరిగింది ఇంతకుముందెప్పుడూ అలాంటిది జరగలేదు అందుచేత చాలమందికి ఆశ్చర్యం కలిగింది

ఈ సందర్భంలో పూర్వం డార్డనెల్స్ ప్రమాదం జరిగినప్పుడు రాజీనామా ఇచ్చిన బ్రిటిష్‌మంత్రి గుర్తువస్తాడు ఆ ప్రమాదం మూలంగానే మాంటేగ్ మహాశయుడు రాజీనామా, భారత స్వాతంత్ర్యానికి దోహదం చేసిన 1917 ఆగస్టు 4వ తేదీ ప్రకటన జరగడం సంభవించింది భారత ప్రజాస్వామ్యం ఇంకా ప్రారంభదశలోనే ఉన్నా, రాజీనామా లవసరమైన సంఘటనల నేకం అప్పుడే జరిగాయి ఉదాహరణకి, అనేకమంది ప్రజలు దారుణంగా చిత్రమరణానికి గురి అయిన కుంభమేళ ప్రమాదం కాస్త ఆత్మపరీక్ష చేసుకుంటే, దర్యాప్తుసంఘం అవసరం లేకుండానే ఆ ప్రమాదం బాధ్యత ఎవరిదో తెలిసిపోయేది

అలాగే ఢిల్లీలో కామెర్ల వ్యాధి ప్రమాదం దీన్ని దర్యాప్తు చేయడానికి ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది ఈ సంఘం విచారణచేసి, జాయింట్ వాటర్ బోర్డులోని కొందరు ఉద్యోగులపై బాధ్యత మోపుతూ నివేదిక తయారు చేసింది. ఈ వాటర్ బోర్డు రైల్వేబోర్డు లాగానే స్వతంత్ర ప్రతిపత్తి కలది. కేంద్ర ఆరోగ్యమంత్రిణి పార్లమెంటులో మాట్లాడుతూ, బాధ్యుడైన వ్యక్తిని హెచ్చరించామని చెప్పారు గాని తరవాత ఏ చర్య తీసుకోనే లేదు

'స్టేట్స్‌మన్' న్యూఢిల్లీ పత్రిక శ్రీలాల్ బహదూర్ శాస్త్రి రాజీనామాపై వ్యాఖ్యానిస్తూ "రైల్వేశాఖకూ, ఆరోగ్యశాఖకు కొందరు పోలికలు తెచ్చారు నిజానికి ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం, అసమర్థత వల్లనే కామెర్ల వ్యాధి ప్రమాదం జరిగింది కాని శ్రీ శాస్త్రి మాదిరిగా శ్రీమతి రాజకుమారి అమృత్ కౌర్ తమ బాధ్యత నంగీకరించలేదు," అని వ్రాసింది నవంబరు 27 న ఆ పత్రిక సంపాదకీయంలో "ప్రమాద బాధ్యతను అంగీకరించడం సూత్రప్రాయంగానే అయినట్లయితే, ఆసూత్రాన్ని అన్నిచోట్లా వర్తింపజెయ్యడం అవసరం ఆరోగ్యశాఖ ఈ సూత్రాన్ని గుర్తించిందా?" అని వ్రాసింది

* * *

లోక్ సభలో మొదటిసారిగా నిరుత్సాహమైన ప్రసంగాలు వినవచ్చాయి ముఖ్యంగా ఫ్రాంక్ ఆంథోనీ ప్రసంగం రైల్వే పనిలో క్రమంగా అధికమవుతున్న అలసతకు బాధ్యత నాల్గవతరగతి పనివారిదేనని ఆయన నిష్కర్షగా చెప్పివేశారు ఈ తరగతి పనివారికి ప్రభుత్వం చనువిచ్చి నెత్తినెక్కించుకోవడమే కాదు, వారంటే భయపడుతోందని కూడా ఆయన చెప్పారు తిరువాన్కూరు కాంగ్రెసు నాయకుడు శ్రీ థానుపిళ్లె, వర్గద్వేషం, దౌర్జన్యం, బాధ్యతారాహిత్యం ప్రచారం చేస్తున్న కార్మిక నాయకులను నిందించారు

రైల్వే కార్మికులలో క్రమశిక్షణ లేని మాట నిజమేనని ఒప్పుకుంటూ శ్రీ శాస్త్రి భారత ప్రభుత్వపు ఇతర శాఖలలో మాత్రం క్రమశిక్షణ ఉందా అని ప్రశ్నించి సంతృప్తి పడ్డారు దండ ప్రయోగం వల్ల క్రమశిక్షణ తీసుకురాలేమనీ, ప్రతిపక్షాలు సహాయం చేయ నిరాకరించడం వల్లనే అసలీ క్రమశిక్షణ భంగమవుతోందనీ ఆయన అన్నారు

* * *


"పెద్దవాణ్ణయి, అనుభవం గడిస్తున్న కొద్దీ నా అభిప్రాయాలు న్యాయంగా మారుతూ ఉండాలిగాని అంతగా మారలేదనే చెప్పాలి ఒకటి మాత్రం గ్రహించాను. స్వాతంత్ర్యం ఎంత మంచి సిద్ధాంతమైనా, దానికి కొన్ని పరిమితులున్నాయి కొన్ని పరిస్థితులలో మనిషి ఏం చేస్తాడూ అంటే, అది అతని అలవాట్లమీద ఆధారపడి ఉంటుంది మంచి అలవాట్లు క్రమశిక్షణ లేందేరావు మనలో చాలా మందిమి దొంగతనాలు చేయకుండానే బ్రతుకు వెళ్ళబుచ్చుతాము కాని ఎన్నో శతాబ్దాల పాటు పోలీసుభయం అనుభవించినమీదట దొంగతనం చేయకుండా ఉండడం అలవాటు చేసుకున్నాము ఇప్పుడది మనకు సహజంగానే కనిపిస్తుంది ప్రపంచం పరిపూర్ణమవుతున్న కొద్దీ నిగ్రహము నేది అవసరమవుతుంది తమకు సంబంధించినంతవరకూ మనిషి ఇష్టం వచ్చినంత స్వతంత్రంగా వ్యవహరించవచ్చు కాని ఇతరులను బాధించాలని దుర్బుద్ధి పుట్టినప్పుడు మాత్రం మనిషికి స్వాతంత్ర్యం ఉండకూడదు"

అని బెర్ట్రాండ్ రసెల్ తాజాగా వ్రాసిన (పోర్ట్రెయిట్స్ ఫ్రమ్ మెమొరీ) పుస్తకంలో ఉటంకించారు ఈయన యుద్ధవ్యతిరేకతకు జైలుశిక్ష అనుభవించిన వ్యక్తి ఆయన పుస్తకంలోంచి ఎందుకిది ఉల్లేఖించానంటే, కొన్ని సమయాల్లో దండనీతి అవసరమవుతుందని చెప్పడానికే దొంగతనం అరికట్టడానికి పోలీసు బలం అవసరం కాలేదా?

శ్రీ శాస్త్రి రాజీనామాకు స్వాతంత్ర్య

(10-పేజీ చూడండి)

మీ క్రొత్త నాణ్యాలు



1957-వ సం॥ ఏప్రిల్ 1-వ తేదీ లగాయతు.

ఇప్పుడు చెలామణీలో ఉండు నాణ్యాలు, కొత్త నాణ్యాలు—ఇవి రెండూ కొనుగోలు-అమ్మకపు బేరాలకై డబ్బు చెల్లించుకోడానికి చెలామణీ అవుతాయి. ఈ రెండు నాణ్యాలలో ఏదిచ్చినా సరే, ఎవరూ కాదు కూడదనరాదు

పరివర్తన పథకంలో ఉన్న మౌల్యానికి పైబడి మీరు ఇవ్వనూరాదు, ఇమ్మని అడగనూరాదు. మీ రిచ్చుకోవలసిన సొమ్మును ఇప్పుడు చెలామణీలో ఉండు నాణ్యాలతోనే, క్రొత్తవానితోనే, లేక మీవద్దనున్న నాణ్యాలనుబట్టి, ఆ రెంటినీ కలిపి కూడా చెల్లించుకోవచ్చు

- మీరు మీ బేరంలో ఆఖరు సారిగా సొమ్మును చెల్లించు నప్పుడే ఈ పరివర్తన పథకాన్ని చూచుకొనండి

- లెక్కలు సరిచూచుకొను సందర్భంలో మీరు ఒకరూపాయి, లేక 16 అణాలు, లేక 64 పైసలు, లేక 192 దమ్మిడీలకు 100 నయా పైసాల రేటు చొప్పున లెక్కించుకొనండి.

పరివర్తన పథకంలో సూచించినట్లు పూర్ణాంకమునకు తెచ్చు అవసరం ఆఖరుసారిగా సొమ్ము చెల్లించునప్పుడే వస్తుంది ½ నయా పైసా లేక అంతకంటే తక్కువ చిల్లరను విడిచి వేయాలి ½ నయా పైసా కంటే ఎక్కువను ఒక నయా పైసాగా లెక్కించుకోవాలి



సులభంగా జ్ఞాపకం ఉంచుకొనండి

1 రూపాయికి	...	100 నయా పైసాలు
8 అణాలకు	...	50 నయా పైసాలు
4 అణాలకు	...	25 నయా పైసాలు
3 అణాలకు	...	19 నయా పైసాలు
2 అణాలకు	...	12 నయా పైసాలు
1 అణాకు	...	6 నయా పైసాలు
½ అణాకు	...	3 నయా పైసాలు

పరివర్తన పథకము

(ఏ ఒక్క సారికైనా అచ్చుకోవలసిన సొమ్ము మౌల్యమునకైనా సరిపోతాయి)

అణాలు	పైసలు	నయా పైసలు	అణాలు	పైసలు	నయా పైసలు	అణాలు	పైసలు	నయా పైసలు	అణాలు	పైసలు	నయా పైసలు
0	3	2	4	3	27	8	3	52	12	3	77
0	6	3	4	6	28	8	6	53	12	6	78
0	9	5	4	9	30	8	9	55	12	9	80
1	0	6	5	0	31	9	0	56	13	0	81
1	3	8	5	3	33	9	3	58	13	3	83
1	6	9	5	6	34	9	6	59	13	6	84
1	9	11	5	9	36	9	9	61	13	9	86
2	0	12	6	0	37	10	0	62	14	0	87
2	3	14	6	3	39	10	3	64	14	3	89
2	6	16	6	6	41	10	6	66	14	6	91
2	9	17	6	9	42	10	9	67	14	9	92
3	0	19	7	0	44	11	0	69	15	0	94
3	3	20	7	3	45	11	3	70	15	3	95
3	6	22	7	6	47	11	6	72	15	6	97
3	9	23	7	9	48	11	9	73	15	9	98
4	0	25	8	0	50	12	0	75	16	0	100

అది మీరు వుంచుకొనండి—
అది మీకు కావలసి వస్తుంది.

★ న్యూఢిల్లీ లేఖ ★

[7 వ పేజీ తరువాయి]

పిడి తరవాత వచ్చిన రెండు పరిణామాలు కారణంగా కనిపిస్తాయి పెద్దప్రమాదమేదన్నా జరిగినపుడు మంత్రిగాని, మరొకరుగాని బాధ్యత నిరాకరించడం, ఎవరిమీదనైనా బాధ్యత వేస్తే వారిని రక్షించడానికి ప్రయత్నించడం ఒకటి కుంభమేళ గందరగోళానికి కారకులైన వారిని శిక్షించివుంటే ఇన్ని రైల్వే ప్రమాదాలు వరుసగా జరిగేవి కావేమో! స్వాతంత్ర్యం వచ్చాక, మానవ జీవితం చవకైపోయిందని, తప్పులు చేసిన వ్యక్తి పలుకుబడి గలవాడైతే తప్పించుకోవచ్చునని ఒక అభిప్రాయం బలపడింది లోక్‌సభలో ఒకరన్నట్లు (శ్రీ శాస్త్రి) రాజీనామా ఇచ్చినంతలో పరిస్థితులు సవ్యమారావు పడవు రైలుప్రమాద ఫలితంగా అందరి దుర్మరణానికి ఎవరు బాధ్యులో వారినే శిక్షించాలి

రెండో పరిణామం కార్మికులలో క్రమశిక్షణ లేకపోవడం 1947 ఆగస్టు 15 తరవాత భారత రైల్వేలకు ఏ దుర్గతి పట్టిందీ, రైల్వే కార్మికులు ఎలాపనిచేస్తున్నారు, అని దర్యాప్తుజరిపిస్తే కొన్నివిచిత్రాలు బయటపడతాయి ఢిల్లీనుంచి బయలుదేరే ఒక రైలుబండి బురదలోస్నానంచేసి వచ్చినట్లు ఉండడం నేను కళ్లారాచూశాను పారిశుద్ధ్యం అనేది వట్టి మాటగా మిగిలిపోతోంది ఎయిర్ కండిషన్ పెట్టెలకూ అదేగతి రైల్వేలలో అదివరకుకూడా అవినీతి ఉండేది కాని ఇప్పుడు జరిగినన్ని రైల్వేదొంగతనాలు అప్పుడు జరిగేవికావు ఖరీదైన వస్తువులు తరుచుగా మాయమైపోతున్నాయి మళ్ళీ ప్రత్యక్షమైనప్పుడు రైల్వేశాఖయే వాటినికొనడం జరుగుతోంది కార్మికులకు సౌకర్యాలు కలిగించడంమాత్రం జరుగుతోందిగాని, కార్మికులు తమబాధ్యతలను నెరవేర్చడం జరగడంలేదు పనిచేసే కాలం తగ్గుతోంది ఎక్కువజీతాలు, సౌకర్యాలు కావాలని ఆందోళన ఎక్కువౌతోంది రైల్వేకార్మికులకు నూటికి 25 వంతులజీతం ఎక్కువచేయాలని భారత జాతీయ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఒత్తిడిచేస్తోంది భారతరైల్వే కార్మికులకు ఈసంఘం ప్రతినిధి అట రైల్వేకార్మికులు తమవిధులు సక్రమంగా నెరవేయస్తారని ఆ సంఘం హామీ ఇస్తే ప్రభుత్వం నూటికి 25 వంతులేం ఖర్మ, 50 వంతులు జీతం ఎక్కువచేయటానికి ఒప్పుకోవచ్చు

కార్మికులకు ప్రతినిధులమనీ, సమ్మె చేయించాలన్నా, మాన్పించాలన్నా తమ చేతుల్లోఉందనీ చెప్పుకునే ట్రేడ్‌యూనియన్లు కార్మికులను అదుపులోమాత్రం ఎందుకు పెట్టలేవు? జీతంపట్ల తమవిధులను నెరవేర్చేటట్లు ఎందుకు చెయ్యలేవు? విధులు నిర్వహిస్తేగాని మిమ్మల్ని గుర్తించమని ప్రభుత్వం ట్రేడ్‌యూనియన్లను ఎందుకు ఒత్తిడిచెయ్యదో తెలియదు ఎందుకంటే విధినిర్వహణ సరిగ్గా జరగడంమీదనే ప్రణాళికలో ప్రభుత్వరంగంవిజయం ఆధారపడిఉంది.

* * *

ఉత్తరాల గల్లంతు

ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరాలనేకం బోలెడు రోజులాలస్యమవుతున్నాయా లేదా అని ఒకరడిగిన ప్రశ్నకు తంతితపాలాశాఖ ఉపమంత్రి అవుతున్నాయని జవాబిచ్చారు 'ఎక్స్‌ప్రెస్ డెలివరీ' అనే ఎర్రచీటీలను ప్రజలు ఉపయోగించకపోవడం, కవర్లమీద సరియైన చిరునామాలు లేకపోవడం, ఎక్స్‌ప్రెస్ డెలివరీ వాటిని తపాలా ఉద్యోగులు సరిగ్గా బట్వాడా చేయకపోవడం ఈ కారణాలవల్ల ఆలస్యం జరుగుతోందని ఆయన చెప్పారు. ఎర్ర చీటీలను ఉపయోగించడం అవసరమనీ, చిరునామా సరిగ్గా రాయడం అవసరమనీ ప్రజలకు నచ్చచెప్పేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఆయన తెలిపారు సరిగా పనిచెయ్యని ఉద్యోగులపై తీవ్ర చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు ఎక్స్‌ప్రెస్ డెలివరీ వస్తువులను తొందరగా పంపించేందుకు గాను, మొదటి దర్జాగా 25 తంతి ఆఫీసుల నుండి తపాలా ఆఫీసులకు అపనిమార్చామని ఆయనన్నారు ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరాలకు రంగు కవర్లను ఉపయోగించే పద్ధతి కూడా ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నామన్నారు

ఎర్రచీటీలను ఉపయోగించని నేరం, సరిగ్గా చిరునామాలు రాయని నేరం, రెండు నేరాలూ ప్రజలవి మూడో నేరం, అంటే సరిగాపని చెయ్యని నేరం తంతి తపాలా శాఖ వారిది

కాని కొన్ని ఉదాహరణలు చెబుతాను ఈస్టరన్ కోర్టు పోస్టాఫీసులో పోస్టుచేసిన ఒక ఉత్తరం 'కాపిటల్' అనే కలకత్తా వారపత్రికకు ఇంతవరకూ చేరలేదు. ఆంధ్ర పత్రిక సంపాదకులు తమ న్యూఢిల్లీ విలేఖరికి వ్రాసిన ఉత్తరాలకు, ఇంగ్లండునుంచి వరుణ్ కృష్ణ అనే అతను న్యూఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్ నం 15/1 ఇంటిలో ఉంటున్న తన తండ్రికి వ్రాసిన ఎయిర్ మెయిల్ ఉత్తరానికి ఇదే అవస్థ పట్టింది అదే చిరునామాకు పారిస్‌నుంచి జూన్ 21 న పోస్టుచేసిన ఖరీదైన పుస్తకాల రిజిస్టర్డు పార్సెలు, జర్మనీనుంచి జూలై 19 న పోస్టుచేసిన ఒక పటం ఇంతవరకూ చేరలేదు వాటి అతీగతీ లేదు చిరునామాలు సరిగా లేక కాదు; ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరాలు కావు గనక ఎర్ర చీటీలు లేకనూ కాదు మరి ఎవరిదంటారు నేరం? ★

ఇనుమడించిన ప్రేమ

"ఒరేయి నాన్నగారొచ్చార్రా" అనగా మా అన్నయ్య పిల్చాడు నన్ను వెనకగదిలో వున్న నేను ఒక్క అంగలో సావిట్లోకివచ్చి నాన్నగార్ని పరామర్శించాను "ఇదేనా రావటం నాన్నా మెయిలు లేటా ?"

"ఔనురా, మెయిలు గంటలేటు"

"కాళ్లు కడుక్కో నాన్నా, నీళ్ళు తెస్తా" అంటూ అన్నయ్య బాత్‌రూమ్ లోకి వెళ్ళబోయాడు

"స్నానం చెయ్యాలిరా" అంటూ తన సంచీలోంచి టవళ్ళు తీసి ఒకటి కట్టుకుని రెండోది భుజాలమీద వేసుకుని కిటికీలో వున్న సబ్బుపెట్టెని పట్టుకుని బాత్‌రూమ్ లోకి వెళ్తూ "బాగా చదువుతున్నావోయ్ శంకరం" అని అన్నయ్య పక్కనున్న శంకరాన్ని నవ్వుతూ ప్రశ్నించారు శంకరం చిరునవ్వునవ్వి "యేదో చదువుతున్నానండి" అని వూరుకున్నాడు

క్రిందటి సంవత్సరమే శంకరంతో పరిచయం అయింది శంకరం అన్నయ్య క్లాసుమేటు అప్పుడప్పుడు మా రూమ్‌కి వస్తూంటాడు క్రిందటిసారి మా నాన్నగారు వచ్చినప్పుడు అతన్ని చూశారు అందుచేతనే ఆయన శంకరాన్ని అంత చనువుగా పిలిచారు

నాన్నగారు స్నానంచేసి, బట్టలు వేసుకొనే సరికి "హోటల్కి వెళదాం, రా, నాన్నా, కాఫీ తాగుదాం" అన్నా నేను "ఓ యస్," అంటూ నాన్నగారు బయల్దేరారు 'రండీ శంకరంగారు' అని శంకరాన్ని కూడా పిల్చాను నలుగురం హోటల్కి బయల్దేరాం హోటల్నుంచి తిరిగి వస్తూంటే "మహారాణీపేట వెళదాం, రండ్రా" అన్నారు నాన్నగారు తొందరగా ఎందుకని అడగబోయి వూరుకున్నాడన్నయ్య నేనుండబట్టలేక అడిగేశాను, "ఇప్పుడు మహారాణీ పేటెందుకు నాన్నా ?

"కృష్ణారావు గారని నా స్నేహితుడొకాయనున్నాడు ఆయన్ని అర్జంటుగా కలుసుకోవాలి" అని సమాధానమిచ్చారు. నాన్నగారు "అయితే నువ్వు వెళ్లి రాకూడదు ? మేముకూడా వస్తే బాగుంటుందా" అని తనసంకోచాన్ని వెలిబుచ్చాడు అన్నయ్య "మహారాజులా వుంటుంది నాతో రండి" అని మా ముగ్గుర్నీ వెనకేసుకుని టాక్సీని కేకేశారు నాన్నగారు

మహారాణీ పేట కృష్ణారావుగారి భవనం ముందు టాక్సీహారన్ కొట్టి ఆగింది మేం గేటు దగ్గర వెళ్లే టప్పటికి కృష్ణారావుగారు మాకు స్వాగతం చెప్పారు సావడిలో పొందికగా అమర్చబడిన కుర్చీలలో మేము ఆసీనులమయ్యాము మా రాకకి కృష్ణారావుగారు ఆశ్చర్య పడినట్లుకనపడలేదు 'ఏమిటి విశేషం' అని కూడా అడగలేదు కృష్ణారావుగారు, నాన్నగారు వారి దారిని వారు మాట్లాడుకు పోతున్నారు మా ప్రక్కనే కృష్ణారావు గారి తాలూకు ఎవరో పెద్ద మనుష్యులు ముగ్గురు కూర్చుని మా వంక అదేపనిగా చూస్తూన్నారు ఒకరిద్దరు ఆడవారు కూడా మా వంక తొంగి చూచి వెళ్లారు ఇంతలో కాఫీ ఫలహారాలు మాయెదుట టేబిల్ మీద వుంచబడ్డాయి అందర్రం వాటిని సేవించాము కాఫీ కప్పు

శర్మ

కింద పెడుతూ కొంచెము సంశయిస్తూ "ఆలస్యం ఎందుకు దప్పన రమ్మనండి అని కృష్ణారావు గారిని అడిగారు నాన్న" ఆ భాష మాకు అర్థం కాలేదు కృష్ణారావుగారు 'ఆల్ రైట్' అంటూ లోపలికి వెళ్ళి వచ్చారు ఆయన వెనకాలే ఒక అమ్మాయి కూడా తలవంచుకుని నెమ్మదిగా వచ్చి మాకు యెదురుగా కొంత దూరములో వున్న ఒక కుర్చీ మీద కూర్చుంది వ్యవహారం నాకు అర్థమై పోయింది అన్నయ్యకు కూడా అర్థమైయ్యే వుండవచ్చు నాకేసి అదోలా చూశాడు అటుకేసి చూడమన్నట్లు నేను చిలిపిగా చూశాను అన్నయ్య అంటీ అంటనట్టు చూశాడు ఆ అమ్మాయికేసి అన్నయ్య ఏమనుకుంటున్నాడో అని నేను వాడి మొఖంలోకి చూశా ఏదో ఆలోచనలో పడ్డాడు నాకు కాబోయే వదినగారిని నేను వూహించుకుంటూన్నాను. తేరి పారి చూశాం ఆఅమ్మాయికేసి ఆ అమ్మాయి తనలో తాను చిన్నగా నవ్వుకుంటూంది మా అన్నయ్యను చూసే అని నేను అనుకుంటూన్నాను వాడూ అలాగే అనుకుని మరో మారు చూశాడు కాదు అన్నయ్య కేసి కాదు శంకరాన్నివును చూచి నవ్వుతూంది అతను ఆ అమ్మాయి వైపు అదోలా చూచి నవ్వుతున్నాడు మా యిద్దరి వంటి మీద తేళ్లు, జెర్రులు పాకుతున్నాయి ఇంతలో నాన్నగారు, కృష్ణారావు గారు వీధి అరుగు మీదకి వెళ్లారు అన్నయ్య చిరాగ్గా ఒక్క అంగలో బయటికి వెళ్ళిపోయాడు వాడి వెనకాలే నేను వెళ్లాను శంకరం నెమ్మదిగా వెనకా ముందూ అంతా కలయ చూస్తూ వచ్చాడు అరుగు మీదికి నాన్నగారు అన్నయ్య కేసి తిరిగి "పిల్ల నచ్చిందిరా? యిక నీ జేతరువాయి" అనేశారు అన్నయ్యవద్దని చెప్పబోయాడు కాని అక్కడ చెప్పలేక పోయాడు "తర్వాత చెప్తా నాన్నా" అని మొఖం ముడిచాడు అన్నయ్యకూ నాకూ కూడా శంకరం మీద లోలోపల అనేక విధాల అనుమానం కలిగింది పిక నులిమేదామా అన్నట్టుగా చూస్తున్నాడు అన్నయ్య శంకరం కేసి శంకరం ఎవరివైపూ చూడలేదు ఇంటి లోపలికి తన దృష్టిని పోనిస్తున్నాడు ఇంతలో కృష్ణారావుగారు "ఒరే శంకరం, లోపలికి వెళ్ళి కనుక్కురారా," అని ఆజ్ఞాపించారు శంకరాన్ని శంకరం రెండు అంగల్లో లోపలికి వెళ్ళాడు ఆవేశంతో కూడిన మా దృక్కులు శూన్యంగా మారాయి "శంకరం కృష్ణారావుగారికెలా తెలుసు నాన్నా," అని ప్రశ్నించాను నాన్నగార్ని "ఓరివెర్రిబాగులాడా, అతను కృష్ణారావుగారి అబ్బాయి"

ఒక్కమాటుగా అన్నయ్యకీ నాకూ స్పృహ తప్పినంత పనైంది అన్నయ్యలో అమిత మైన చైతన్యం కనిపించింది నోరు విప్పి ఏదో చెప్పబోయాడు మళ్లీ ఎందుకులే అని వూరుకున్నాడు ఇంతలో లోపల నుంచి శంకరం చిరునవ్వుతో వచ్చి కృష్ణారావుగారి వేపు తిరిగి తల నిలువుగా వూపాడు అతడు అన్నయ్య కిప్పుడు దేవుడులా కనపడుతున్నాడు "బావ" అని శంకరం మా అన్నయ్యని తన మనసారా ఒక్క మారవేశాడు అందరం శంకరంవైపు తిరిగాము ★

★ ఆయువు పట్టు ★

అసలు ఆలోచనలు రావటం పూర్తిగా మానివేసినది బుర్ర మొద్దుబారిపోతున్నది చ భ

డిటెక్టివు వాలిగారి పరిస్థితి మహాఘోరంగా తయారయింది నోటమాట లేదు బుర్రలో ఆలోచనలు వేసవికాలంలో నీళ్లు ఇంకిపోయినట్లే ఇంకిపోతున్నాయి..

ఉన్నట్టుండి వాలిగారు చిన్నగా ఈల కొట్టి పెద్దగా నవ్వారు, ఓ చిరునవ్వు

గతచరిత్రలో ఏనాడైన ప్రఖ్యాత డిటెక్టివు శ్రీ వాలిచుట్టకాల్చింది అచుట్ట పొగలోకి గంభీరంగాచూస్తూ, చుట్టపీకల కేసు (Case) మీద, ఒకటి, రెండుసార్లు కనీసం దృష్టి సారించంది, పొరపాటునైనా, సరదాకైనా, ఆలోచనలు వచ్చాయా!

డిటెక్టివువాలి మరుక్షణంలో కోటు జేబులో చేయిపెట్టారు – చుట్టలుకేసు అసలుకేసే లేదు. అన్నిజేబులు త్వరత్వరగా వెదికారు కనిపించలా. డ్రాయరు చూచారు అల్మైర షెల్ఫు. పడకగది పందిరిమంచం వంటగది.. ఎక్కడగాలించినా లేదు

డిటెక్టివు వాలి కళ్లుతిరిగిపోతున్నాయి గుండెలు బద్దలౌతున్నాయి

“అనంత తేజస్సుతో దేదీప్యమానంగా రాత్రి వరకు వెలిగిన వాలిగారి ప్రతిభ ఒక్క క్షణంలో వాలిపోయింది సర్వకాలాలలో కళకళలాడుతూ గంభీరకాంతుల్ని వెదజల్లే వారిముఖారవిందం ముడుచుకుపోయి ముడతలు పడ్డది ఆలోచనాలోకాన్ని ఆకళించుకొని, అహర్నిశలు అక్కడే తిష్టవేసి, వాలి ఒక్క చుట్టముక్క, దానిపైపై లేకపోయేసరికి ఆలోకానికే ex-మెంబరై కూర్చున్నాడు విచారంగా!

అతిచాకచక్యంతో అపరాధ పరిశోధనలు జరిపే, మహామేధావి, డిటెక్టివు జాతికే పితృతుల్యులైన, వాలి గార్ని చూడామన్నట్లు “వాలి ప్రధాన శిష్యరేణువు” “తస్కరజాతి పరిశోధక” శ్రీ అశ్వత్థామ వేంచేశాడు

చిరంజీవి అశ్వత్థామను చూస్తూనే చిన్నగా కళ్ళ నీళ్లుపెట్టుకొని నిశ్శబ్దంగా విలపించారు వాలి తన దురదృష్టాన్ని గూర్చి తనివి తీరా వినిపించారు

తనకు జీవితంలో, తలచని, ఆశించని కష్టం వచ్చిందన్నారు రెండు నిలువులా క్రుంగిపోవటానికి వుద్యుక్తులవుతూ—

“నాయినా అశ్వత్థామా! ఒక్క చిన్న కోరిక, మరేంలేదు నేను ఈడిటెక్టివు లోకంనుండి రాలిపోతున్నాను, కాపాడగలితే నీవే! నాచుట్టలకేసు ఎక్కడుందో పరిశోధించిపెట్టు నీకు కృతజ్ఞుణ్నిగా వుంటాను” అన్నారు

అశ్వత్థామ ముఖ కవళికలు క్షణక్షణానికి వివర్ణమై పోతున్నాయి సినిమాలో బొమ్మలా అశ్వత్థామ ముఖారవిందం. వీశె అముదం తాగినట్లు మారిపోయింది.

“మీరంతగా నాకు చెప్పాలా గురూజీ, అంత సమర్థత వుంటే, మీ చుట్టపీకల కేసును వెతికి ఏప్పుడో యివ్వకపోయానా! కాని మౌనంగా నసిగి, సన్నగా గొణిగాడు

ఈపలుకులతో పంచ ప్రాణాలు వాటి పొదులు తప్పుకొనే పరిస్థితికొచ్చినయ్ ప్రఖ్యాత డిటెక్టివ్ శ్రీ వాలిగారికి మాట్లాడే స్థితినుండి మౌనావస్థకు జారిపోయాడు “అదేం” అన్నట్లు చూశాడు అశ్వత్థామకేసి

”నాకు పరసనల్ సెక్రటరి మిస్ సురేఖ గారు ప్రక్కనలేంది బుర్రపని చెయ్యదు. అసలు మిస్ సురేఖ రెండు కళ్లలోకి లోతుగా చూడంది ఆలోచనలే రావు” ప్రక్కకు చూస్తూ పలికాడు చిరంజీవి

కొద్ది క్షణాలు, డిటెక్టివ్ వాలి, చిరంజీవి డిటెక్టివ్ అశ్వత్థామ పెద్ద మొత్తంలో విచారించారు

అంతలో బయట కారుహారను, “బుర్” మంది అశ్వత్థామ, ఆనందంతో హాయిగా నవ్వి గర్వంగా వాలికేసి చూసి “మిస్ సురేఖ” అంటూ బయటకు “తుర్” మన్నాడు

వాలి కష్టాలు కట్టకడపటి కొచ్చినట్లు కలలు కన్నాడు

మరుక్షణంలో “కష్టాలు కట్టలు కట్టుకొస్తాయి కాదనలేం! తృప్తిగా మిస్ సురేఖ కళ్లల్లోకి చూసే భాగ్యం లేదు ఆమె కుడి కన్ను వాచిపోయిందిట కట్టుకట్టుకొంది ఆపరేషన్ చేయాల్సి వస్తుందేమోనని అనుమానంగా వుంది అంటూ ఆ సహాయకను సూచించాడు అశ్వత్థామ, సురేఖా సమేతుడై లోపలికొస్తూ!

వాలి హృదయం పూర్తిగా క్రుంగిపోయే ప్రయత్నంలో వుంది

అకస్మాత్తుగా మెరపులాంటి ఆలోచన తట్టింది మిస్ సురేఖ నిలుచున్న పళంగా గావుకేక పెట్టింది దగ్గరలో వున్న అశ్వత్థామ కర్ణపుటాలలో కసుక్కున కక్కేసింది దాన్ని కాస్త ఆవిడియాను అదిరిపడి, అశ్వత్థామ, “ఆల్ రైట్,” అంటూ ఫోను డయలు తిప్పాడు

“హంతకనాశన” డిటెక్టివ్ హనుమంత గార్ని పిలిచి సంగతి సందర్భాలు వివరించి, తక్షణ సహాయానికి తగు జాగ్రత్తలతో రమ్మని చెప్పాడు

“హనుమంతం వాలిగారికి వాటిల్లిన అవాంతరానికి విచారించి, మరికొంత విచారాన్ని మాటల్లో కలిపేసి గొంతుతో వినిపించారు తుదిమాటల్లో తన భూతఅద్దం కనపడలేదని, అది లేనిది తనకిది సాధ్యం కాదని తన ఇబ్బంది వెల్లడించారు”

“పోనీ మరో చుట్టపీలకేసు కొనుక్కుంటే పోతుందిగా అంటూ తేల్చేశాడు”

“అబ్బే లాభంలేదు ఆయన పచ్చరంగు కేసే కావాలి మీ భూతద్దంమాదిరే” అశ్వ

(55 వ పేజీ చూడండి)

ఆ పెళ్ళికూతురెవరు?

ప్రసాద్ గొంతుక వినగానే ముగ్గురు వాలికలు పరుగెత్తారు. కాంతం అక్కయ్యల కంటె ముందుగా ప్రసాద్‌ని కలుసుకోవాలని, పూలమొక్కలను తప్పించుకుంటూ, తోటలోంచి బయలుదేరింది. ఆ తొందరలో పాపం ముందుకు పడిపోయింది. 'ఏం దెబ్బ తగిలిందా?' అంటూ ప్రసాద్ కాంతాన్ని లేవదీశాడు. మీరు 'నాకున్నంతసేపూ నా కెప్పుడూ దెబ్బలు తగలవు' అన్నది కాంతం.

కాంతాన్ని ఒక్క ముద్దు పెట్టుకొని, తన దగ్గరగా కూర్చో బెట్టుకొని అడిగాడు 'మీ అక్కలు కూడా వస్తారా మనతో షికారుకి?' ఇంతలో లలిత, కమల వచ్చి, 'ఓ తప్పనిసరిగా వస్తాం' అన్నారు. 'మావయ్యతో షికారుకెళ్దామా?' అని కాంతం, లక్ష్మిని అడిగింది. 'సరే' అన్నాదామె.

ప్రసాద్ వెంట అక్కచెల్లెళ్లు వస్తున్న దృశ్యాన్ని, కిటికీలోంచి చూశాడు అచ్యుతరావు. 'మాచావూ దారిపొడుగునా అతన్ని విడువకుండా, అతనిచుట్టూ తిరుగుతూ, గెంతుతూ సంతోషంగా యెలా వెళ్తున్నారో?' అన్నాడు లక్ష్మితో. వాళ్ళు ఎవరికివారు, విడిపోవలసి వచ్చినప్పుడు వారి హృదయాలు ఎలాఉంటాయో?' అన్నాడు.

"వారు విడిపోవడం గురించి ఇప్పుడే ఆలోచిస్తున్నారేమండీ?" అని ప్రశ్నించింది భర్తని క్రీగంట చూస్తూ లక్ష్మి.

"ఇప్పుడేయేమిటి? మన అమ్మాయిల్ని ఎంతకాలం మనింట్లో దాయగలం? అందుకే నిన్ను తెలివితక్కువ దద్దమ్మ అన్నానిది [illegible]. ఆమాత్రం ఆలోచించకుండానే అమ్మాయిల్ని ప్రసాద్‌తో పంపిస్తున్నానా? షికారుకి?"

"మీరు కొంటెగా మాట్లాడకండి. వాళ్ళ స్వభావం మీకు తెలియదు. వాళ్ళని మనం యెంతైనా నమ్మొచ్చు. అజన్మాంతం బ్రహ్మచారిణులుగా ఉండమంటే, ఉండగలరు, తెలుసా?"

"[illegible]! ప్రసాద్‌తో వాళ్లు స్నేహంగా తిరిగినంతకాలం పెళ్లిచేసుకోరు."

"ఐతే ప్రసాద్ ముగ్గుర్నీ పెళ్లిచేసికొంటాడంటారా?" "బాగుంది. అలాగని గాదు నే ననేది. పెద్దమ్మాయి లలితని ప్రసాద్‌కిచ్చి పెళ్లిచేద్దాం. తరువాత తక్కిన ఇద్దరిని గురించి ఆలోచిద్దాం."

ఐతే, అటుల్నుండి రాగానే, లలితని అడుగుదాం."

భోజనానంతరం మీ చిన్నాన్న రమ్మంటున్నాడనీ, లక్ష్మి, లలితని పిలిచింది. లలిత వచ్చింది. 'లలితా! మీ పిన్నీ, నేనూ, మీ వివాహం గురించి ఆలోచిస్తున్నాం. మీ ముగ్గురూ ప్రసాద్‌తో సరదాగా తిరుగుతున్నారు. మీలో ఎవరో ఒకరాతన్ని పెళ్లి చేసికొంటా రనుకుంటాను. నీ ఉద్దేశం యేంటి' అని అడిగాడు అచ్యుతరావు. 'నిజమే చిన్నాన్నా! మీ ఇష్టం యెలా ఉంటే అలాగే చెయ్యండి. ఐతే, కమలనీ, కాంతాన్నీ పిల్చుకొస్తానని వెళ్లింది. అచ్యుతరావు మరల లలితనిపిల్చి, ఇలాగా అన్నాడు. "అమ్మాయి! నీవు అందరికంటే అపెద్దదానివికదా? నీ అభిప్రాయం చెప్పు." తరువాత వాళ్ళని అడగొచ్చు.

"మీరు చెప్పింది, యేది కాదన్నాను చిన్నాన్నా? మీరు ఎవర్ని పెళ్లి చేసుకోమని చెప్తారో అతన్నే నేను పెళ్లి చేసికొంటా. మాలో ఎవరో, ఒకరం ప్రసాద్‌ని పెళ్లి చేసికొంటాం. వారి అభిప్రాయాల్ని నేనెలా చెప్పేది? మీ బుద్ధికి ఎలా తోస్తే, అలా చేయండి."

"బాగా చెప్పావమ్మా!" అన్నాడు అచ్యుతరావు "సరే రేపు మాట్లాడుదాం, అందరంకలసి, నీవు యీలోపున, మీ చెల్లెండ్రతో ఆలోచించు" అని చెప్పాడు అచ్యుతరావు.

లలిత రాగానే, కమల, కాంతం, వచ్చి అడిగారు. 'ఏం తప్పుచేశావు. చిన్నాన్న నిన్ను పిలిపించారు' అని. 'ఏం తప్పులేదు. తప్పు అంతా రైటయిందనే,' అన్నది లలిత.

"ఏదో విషయం చెబుదూ," అన్నది కాంతం.

"మమ్మల్ని అనుమానంతో చంపకు," అన్నది కమల.

"సంతోషవార్త! మరేమీలేదు; ప్రసాద్, పెళ్లి చేసుకోబోతున్నాడు," అన్నది లలిత.

"ఎవర్ని, ఎవర్ని? ఎవరా అదృష్టవంతురాలు?" అన్నది కాంతం.

"మనం ఇక అతనితో ఆడుకోకూడదా?" అన్నది కమల దీనంగా, లలితవైపు చూస్తూ.

"అప్పుడూ మనల్ని ఆడించడానికి తీసికెళ్తాడా?"

"నేను చెప్పేవరకు, ఓ నిముషం ఆగండి. కమల! కాంతం! ప్రసాద్ పెళ్లి చేసుకోబోతున్నాడు. అయినా మనల్ని, షికారుకి తీసుకువెళ్తుంటాడు. సరేనా?" అన్నది లలిత.

"సరే అంతాబాగానే ఉంది. అతను ఎవర్ని చేసికొన్నా బాధలేదు. మనతో ఉంటాడంటున్నావుగా. కాని ఆ పెళ్ళికూతురెవరో చెప్పవూ?" అనడిగింది కాంతం.

"మన ముగ్గురిలో ఎవరో ఒకరు," అన్నది లలిత.

'మనలో ఒకరమా? ఎంత చిత్రంగా ఉంది,' అని సంతోషంతో లలిత చేతులు పట్టుకగెంతింది, కాంతం. మరలా, ఓ నిమిషం నిశ్శబ్దంగా ఊరుకొని తలవంచుకొని, మరల చూచి అడిగింది అక్కయ్యని, "మనలో ఎవరిని?"అని.

"అదే ఇప్పుడు మనం ఆలోచించవలసిన ప్రశ్న. నీఉద్దేశం యేమిటి?" అన్నది లలిత.

చర్చ ప్రారంభించారు. ప్రతి ఒక్కరినీ, తక్కిన యిద్దరూ కలిసి, నీవే అర్హురాలవని చెప్పడం మొదలు పెట్టారు. నిన్నే ప్రసాద్ ప్రేమిస్తున్నాడంటే, నిన్నేనని, ఒకరొక్కరు అనడం ప్రారంభించారు. "ఈ విషయం మనలో తేలదు. చిన్నాన్నా, పిన్నీ ఉన్నారుగా, వాళ్ళే తేలుస్తారు" అన్నది లలిత.

"ఆ...హా...!... ప్రసాద్ ఇష్టం. మనలో ఎవరు నచ్చితే వాళ్ళనే చేసుకొంటాడేం," అన్నది కమల.

"ఓహో నీవు మా కంటే అందంగా ఉన్నావుకదూ. హాయిగా పాడగలవుకూడా, ప్రసాద్ నిన్నే చేసికొంటాడులే," అన్నది కాంతం.

"నీకేం గాబరా పడవక్కర్లేదులే. ప్రసాద్ నిన్నే చేసుకొంటాడు. [illegible]

పాలమరశెట్టి సాంబమూర్తి

* వనితలకు విజ్ఞప్తి *

ముగ్గుల పోటీ! — **బహుమతి రూ. 20/-**

★

వ్యాసాల పోటీ! — **బహుమతి రూ. 20/-**

* సంక్రాంతికి మరొక ఆకర్షణ *

ముగ్గుల పండగ సంక్రాంతి వస్తోంది. ఆనాడు తెలుగుదేశంలో తెల్లవారేసరికల్లా ఇంటింటి ముంగిటా ముత్యాల ముగ్గులు, ముగ్గుల మధ్య బంతిపువ్వులు తురిమిన గొబ్బిళ్లు ప్రత్యక్షమవుతాయి. తెలుగు పడుచులకు ముగ్గులు పెట్టటం ఉగ్గుతో పెట్టిన విద్య.

ఈసారి ఆంధ్ర వారపత్రిక సంక్రాంతి ప్రత్యేక సంచికలో వనితలకు ముగ్గుల పోటీ నిర్వహింపదలిచాము. అన్నిటికంటే ఉత్తమమైన ముగ్గుచిత్రానికి రూ. 20/- బహూకరిస్తాము. స్త్రీలు మాత్రమే ఈ పోటీలో పాల్గొనాలి.

శుభ్రమైన దళసరి డ్రాయింగు కాగితం (10 × 8 అంగుళాలు) మీాద, తుడుపులు గిడుపులు లేకుండా నీటుగా చిత్రించాలి. ఆ బొమ్మను బ్లాకు చేయడానికి వీలుగా ఇండియన్ ఇంక్‌తో మాత్రమే వేసిపంపాలి. ముగ్గుల బొమ్మలు మా కార్యాలయానికి డిసెంబరు 26 వ తేదీలోగానే చేరాలి.

ముగ్గు ఎలా వేయాలో చిన్న వివరణ కూడా వ్రాసి పంపితే అది చూచి నేర్చుకోదలచిన వారికి సహాయకారిగా ఉంటుంది. అవసరమైతే ఆ వివరణలో కూడా చిన్న సైజు బొమ్మలు వేయవచ్చు.

* * *

*సంక్రాంతి ముగ్గుల పండగే కాదు; ముస్తాబుల పండగ కూడాను. ఆడవారికి అలంకరణ ప్రియత్వం సహజం. పాతకాలపు అలంకరణ పద్ధతులుపోయి, కొత్త కొత్త ఫేషన్లు వస్తున్నాయి

"స్త్రీలు: అలంకరణ; పాత కొత్తల పరిశీలన" అనే విషయంపై రాబోయే సంక్రాంతి సంచికలో వ్యాసాల పోటీ నిర్వహిస్తున్నాము. ఈ పోటీలో కూడా స్త్రీలు మాత్రమే పాల్గొనాలి. విషయాన్ని సమగ్రంగా చర్చిస్తూ, వారపత్రికలో రెండు పేజీలకు తగ్గకుండా మూడు పేజీలకు మించకుండా వ్యాసం వ్రాయాలి. వ్యాసాలకు కూడా డిసెంబరు 26 వ తేదీయే గడువు.

ఉత్తమ వ్యాసానికి రూ 20/- బహూకరిస్తాము. పోటీలో తుది నిర్ణయం సంపాదకులదే.

రచయిత్రులు మా సంకల్పం జయప్రదం కావడానికి తోడ్పడతారని మా నమ్మిక.

★ ఆ పెళ్లికూతు రెవరు? ★

లేనపుడు ఎన్నిసార్లు ముద్దుపెటుకోలేదు నిన్ను? తెలియనట్టుమాట్లాడతావు!" అన్నది కాంతంతో లలిత.

"అతడు తప్పనిసరిగా పెద్దక్కయ్యనే పెళ్లి చేసుకొంటాడు. ఎందుకా! నీవు మాకంటే, పెద్దదానివి, తెలివైన దానివి. పొడవైన దానివి. అన్నిట్లోనూ పెద్దదానివే. ఏం నువ్వేం బాధపడక్కరలేదులే", అన్నది కాంతం.

"ఎందుకు మనలో మనకీ కొట్లాట? మనలో పెద్దవాడు చిన్నాన్నున్నాడు. అతనిమీాదే ఈ భారం వేస్తే బాగుండదా?" అన్నది లలిత

"చాలా బాగుంది." అన్నది కమల. "ఇదిచాల ఉత్తమమైన అభిప్రాయం. ఊరకనే వేళాకోలానికలా అన్నాం" అన్నది కాంతం. "కాగా మనలో నీవే కదూ పెద్దదానివి? అందుచేత, తప్పనిసరిగా ప్రసాద్ నిన్నే వరిస్తాడు కాకపోతే పిన్ని ఉన్నదిగదూ! మొదట పెద్దదానికి పెళ్లవాలని చెప్పేందుకు?"

"సరే కాంతం. నే నతన్ని పెళ్ళిచేసుకో నని ఒట్టు పెట్టుకుంటున్నాను. ఇక మీ ఇద్దరూ కలసి ఆలోచించుకోండి మీ విషయం," అన్నది లలిత నిస్పృహతో.

"అక్కా! అక్కా!" అని కాంతం, తన సందిటను లలితను పట్టుకొని, "నేను నీకు అపచారం చేశాను. నీ మనస్సును బాధ పెట్టాను. నీ వింతగా కలత చెందుతావను కోలేదు. దయ ఉంచి నన్ను క్షమించు. నేను నీ చెల్లెల్ని గానూ?" అని బిగ్గరగా విలపించ ప్రారంభించింది.

"నీవేం తప్పు చెయ్యలేదు. నేనేం బాధ పడడం కూడా లేదు, కాంతం. నిజంగా నేను బాధపడడంలేదు," అన్నది లలిత, కాంతన్ని ఆప్యాయంగా కౌగలించుకొని. "ఏదో విధంగా మనం, ఓ నిర్ణయానికి రావాలి. ఏం కమల? మనలో ఎవరం అతన్ని పెళ్లిచేసికొన్నా, తక్కిన ఇద్దరం అతణ్ణి సోదరుడిలా ప్రేమిస్తాం. అలా కాక, మనలో మనం కొట్లాడుకుంటే, ఏ అదృష్టవంతురాలో అతడిని కాజేస్తుంది అప్పుడు మన పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంటుంది. ఏం?" అన్నది లలిత.

"అప్పుడు చాలా భయంకరంగా ఉంటుంది," అన్నది కమల "చిన్నాన్న యేంచెప్తే అది వింటానని ప్రమాణం చేస్తాను. అక్కయ్య చెప్పిన సలహా చాల బాగుంది," అన్నది కాంతం.

2

మరునాడు అందరూ కలిశారు. 'ఏం మీలో మీరు ఆలోచించుకున్నారా?' అన్నాడు అచ్యుతరావు.

"అక్కయ్య సలహానే మేం పాటిస్తున్నాం. తుది నిర్ణయం మీరు చెప్పినట్లే," అన్నది కాంతం

"నేను గాదుగా ప్రసాద్‌ని పెళ్ళిచేసుకునేది," అన్నాడు అచ్యుతరావు భార్యవైపుచూస్తూ చిరునవ్వుతో. "నాకంటే నీకే అతనిగురించి ఎక్కువగా తెలుసును. నీ అభిప్రాయం చెబితే, సూత్రప్రాయంగా, నా అనుమతి తెలియజేస్తాను, యేం? లేకపోతే ప్రసాద్‌ని మనతో చర్చకు పిలుద్దామా?" అన్నాడు అచ్యుతరావు లక్ష్మితో.

"నాకు భయం వేస్తోంది. అతనొస్తే మేం మాట్లాడలేం," అన్నది కమల.

"కమల, కాంతం, పెళ్లీడు ఇంకా, కావలసినంత టైముంది వాళ్ళకిప్పుడేం ఈడు మించిపోయిందా? ముందు లలితకు వివాహం చేయకూడదూ?" అన్నది లక్ష్మి.

"నేనూ అదే అనుకుంటున్నాను. ముందుగా చెప్పలేదూ కమలా?" అని ప్రశ్నించింది, కాంతం.

"నేను పెద్దదాన్నన్న కారణంతో, మీకు అన్యాయం జరుగుతుంటే, సహించను. మీ అర్హతలను కాదనడానికి నాకేం హక్కుంది?" అన్నది లలిత.

"మాశావాతిగాదా! భలే! మంచి ఆలోచన తట్టిందినాకు" అన్నాడు అచ్యుతరావు; భార్యతో.

"అవును మీ ఆలోచన నాకు తెలుసును. ముగ్గుర్నీ ప్రసాద్‌కిచ్చి పెళ్ళిచేద్దాం అని," అన్నది లక్ష్మి.

"అవును నీలాంటి పెంకిపిల్లలైతే అలాగే మరి అంగుకే నిన్ను తెలివితక్కువదద్దమ్మ! అన్నాను అమ్మాయిలు! విన్నారా! మీలో ఎవర్నీ బాధపెట్టదల్చుకోలేదు నేనూ బాధపడను లాటరీవేద్దాం, ఎవరికి అదృష్టం ఉంటే వారే ప్రసాద్‌ని పెళ్లి చేసుకొంటారు," అన్నాడు అచ్యుతరావు.

"మంచి ఆలోచనే. దాని కెవ్వరూ కాదనరు," అన్నది కమల.

మరునాడుదయం చిన్న వెండిపెట్టె తెచ్చాడు అచ్యుతరావు ఎవరిపేరు వారు వ్రాసి తెమ్మన్నాడు, ఆ ముగురమ్మాయిలూ ని ఎవరిపేరు వారు వ్రాశారు. లలితను పెట్టె తెమ్మని అచ్యుతరావు చెప్పాడు. లలిత పెట్టె తీసుకవచ్చింది. మూడు పేర్లూ జాగ్రత్తగా చదివి చూచి, మడతపెట్టి ఆ వెండిపెట్టెలో పెట్టాడు అచ్యుతరావు ఆ మూడు కాగితాల్లో, యేకాగితాన్ని ప్రసాద్ కళ్లు మూసుకొని తీస్తాడో, ఆ పేరు గల అమ్మాయిని అతడు వివాహమాడాలని నిర్ణయించారు. కాని ప్రసాద్ ఊళ్ళోకి వెళ్ళి రాలేదు సరే భోజనాలైనతరువాత తీయిద్దాం. ఇంతలో అతడూవస్తాడని భోజనాలకి లేచారు.

భోజనానంతరం అంతా వచ్చారు. మళ్లీ పెట్టె తెచ్చారు. టేబిలుపై పెట్టె ఉన్నది. ఎత్తయిన కుర్చీలో ప్రసాద్ కూర్చున్నాడు. ఎదురుగా మూడు కుర్చీలు, ప్రక్కల రెండు కుర్చీలూ వేశారు ప్రక్క కుర్చీలో, లక్ష్మి, అచ్యుతరావులు కూర్చున్నారు. ఎదురుగా లలిత, కమల కూర్చున్నారు.

"కాంతం ఏదీ?" అన్నది లక్ష్మి. "కాంతం ఎక్కడుంది?" అన్నాడు అచ్యుతరావు "కాంతం ఏదీ" అన్నారు అంతా గొల్లుమని.

పాపం ప్రసాద్ ముఖం వెలవెలపోయింది. లలిత కమల పరుగెత్తుకెళ్లారు, చెల్లెల్ని వెతకడానికి ఇంటివెనక, నూతిదగ్గర, గదులలో, వంటవసారాలో, అంతటా చూశారు. కాంతం కనబడలేదు. చివరికి కమల చూసింది. మెయిన్‌హాల్లోనే బీరువాప్రక్కను ఏడుస్తూ కూర్చుంది కాంతం.

ఆ పెళ్లికూతు రెవరు?

"కాంతం! రా! రా! అందరూ నీ కోసం చూస్తున్నారు. ఇదా ఏడవడానికి సమయం? నీవు అదృష్టవంతురాలివి కావని నీకేం తెలుసు? ఏదీ ఒకసారి నవ్వు," అన్నది కమల కాంతం కన్నీళ్లు తుడుస్తూ.

"ఏంలేదు. చాలిలికి తలనొప్పిగా ఉందట," అన్నది కమల.

"నాకు తెలుసును. తలనొప్పి కాదు. లాటరీనొప్పి, అది," అన్నది లక్ష్మి.

సరే లాటరీ ప్రారంభించడన్నారు. ప్రసాద్ కళ్లకు దట్టంగా గుడ్డతో కట్టారు. ప్రసాద్ వెండిపెట్టెలోనించి ఒక కాగితం తీసి దగ్గరలో కూర్చున్న అచ్యుతరావు కందించాడు. ప్రసాద్ కళ్లకుకట్టిన గుడ్డ విప్పారు ఆ కాగితంలో, "కాంతం" అని ఉంది! అక్కడ కూర్చున్నవాళ్ళంతా ఆ పేరు చదివారు. కాంతం అదృష్టవంతురాలని అంతా ఆశీర్వదించారు.

ఆ కాగితం మళ్ళీ ఆ పెట్టెలోనే ఉంచి, దాచమని అచ్యుతరావు ఆ వెండిపెట్టెను కాంతం చేతికిచ్చాడు. కాంతం భద్రపరచింది.

పెళ్లయిన రెండేళ్ల తరువాత ఒకనాడు తమ పెళ్లి విషయాలనుగూర్చి ముచ్చటిస్తూ, "లాటరీలో నీపేరు తీయడం ఎంత అదృష్టం కాంతం? నేను నీకోసం. నీవు నాకోసం పుట్టాం! యేం కాంతం? అలా కాకపోతే, దయామయుడైన దేవుడు లాటరీలో నీ పేరెందుకుతీయించాడు చెప్పు?" అన్నాడు ప్రసాద్.

"దేవుడు నిజంగా దయగలవాడే, మనలో ఒకరం అతన్ని తెలివితో ఆకర్షించినంత కాలం" అన్నది కాంతం.

"ఏమిటి నీ అభిప్రాయం కాంతం? దేవుడిదయకు మన ప్రాబల్యానికి ఏమి సంబంధం?" అన్నాడు ప్రసాద్.

"అది మన వెండిపెట్టె నడిగండి అదే చెప్తుంది!"

ఇంటికి రాగానే, వెండిపెట్టె తీసి జాగ్రతగా పరిశీలించమని, కాంతం చూపించింది కాగితాల్ని ఒక్కొక్కటిగా తీస్తూ అన్ని కాగితాలమీదా, "కాంతం" అనే ఉన్నది. మూడు కాగితాలూ ఒక్కలాగే ఉన్నాయి!

"ఓహో! కొంటె పిల్లా! నీవు జేసిన పన్నాగమా? అని దగ్గరకు తీసికొని కౌగలించి ముద్దుపెట్టుకున్నాడు ప్రసాద్.

"గెలవవలసిన బహుమానం మీకే ఐనపుడు ఏం పెద్ద ఘనకార్యం చెయ్యక్కర్లేదు", అన్నది కాంతం. ★

ఇంటిదొంగలు

రామ్మూర్తి ఆఫీసు వెళ్ళగానే వాకిటి తలుపు గడియవేసి నేరుగా పెట్టెలుండే గదిలోకి వెళ్ళింది సీతమ్మ. ఓపిగ్గా పెట్టె ముందుకు లాక్కుని మూత తీసి లోపలుండే చీరలన్నీ దొంతర్లుగా పెట్టి అడుగునుండే పెద్ద కవరు బయటకు తీసింది. కవరులోంచి బయటి కనుపడే నోట్లను చూస్తూ ఆమె కళ్లు ఆనందంతో మెరిసి పోయాయి. ఒక్కొక్క కాగితాన్నే పరిశీలనగా చూస్తూ లెక్క పెడుతోంది సీతమ్మ. ఆఖరు నోటు ఇవతలకు తీసి సంతోషంగా నిట్టూర్పుతూ "ముప్ఫైఅయిదు" అంటూ గొణిగింది నెమ్మదిగా. మళ్ళీ వాటిని కవరులో పెట్టి జాగ్రత్తగా ఓ చీర మడతలో పెట్టి పెట్టెకు తాళం వేస్తూ ఆలోచనలో పడ్డది ఆమె. ఈ డబ్బుతో భర్తకు తెలీకుండా, తెలిసినా అసలు విషయం బయట పడకుండా ఏమి కొందామా, అని.

ఈమధ్య పది రోజుల క్రిందట సీతమ్మ, రామ్మూర్తి, బెజవాడలోని సీతమ్మ మేనత్త కూతురి పెండ్లికి వెళ్లొచ్చారు. పెళ్ళిలో కాస్త ఏమరుపాటుగా వున్న వాళ్ల పెట్టెల మీద అడపాతడపా కాస్త తన హస్తవాసి చూపించింది సీతమ్మ అసలాగుణం ఆమెకు చిన్నప్పట్నుంచీ వుంది. తండ్రి చనిపోయిన తర్వాత చిన్నాయన దగ్గర పెరిగింది. ఆ రోజుల్లోనే ఈవిద్యలో పూర్తి ప్రావీణ్యం సంపాదించింది ఎంతవరకంటే చివరకు వాళమ్మ చీరల్లోకూడా జాకెట్లకని దొంగతనంగా బట్ట కత్తిరించేది. తండ్రి లేకపోవటంవల్లా, ఒక్కగానొక్క కూతురవటం వల్లా పైగా కొద్దో, గొప్పో, తనకూ కూడా ఆ విద్యలో ప్రవేశం వుండటంవల్ల సీతమ్మ తల్లి ఆమె నేమీ అనేదికాదు. అలా అలా ఆ దొంగతనం ఆమెకు అలవాటయి అవలీలగా నేర్పు సంపాదించింది. అత్తారింటి కొచ్చిం తర్వాతకూడా సీతమ్మలో ఏమీ మార్పు రాలేదు సరిగదా, మగడల జేబుల్లో చిల్లరా, ఆడబిడ్డల పెట్టెల్లో సామానూ ఆక్షేపణ లేకుండా సవరించటం మొదలెటింది. కొద్ది రోజుల్లోనే అందువల్ల గుట్టుగా వుండే కాపురంలో చిన్న చిన్న తుఫాను రేపుతూ శాంతికి భంగం కలగటం ప్రారంభించగానే రామ్మూర్తి తెలివిగా తెనాలి ట్రాన్స్ఫరు చేయించుకుని వేరే కాపురం పెట్టాడు. వేరే కాపురమయితే పెట్టాడుగాని ఆమె చేత ఆ దుర్గుణం మాన్పించలేక పోయినాడు శతవిధాల ప్రయత్నించి చివరకు విసిగి వేసారి ఎవరి కర్మ వారిదని వదిలేసి వూరుకున్నాడు రామ్మూర్తి. అప్పటికీ సాధ్యమైనంత వరకూ ఎక్కడికీ ఇంకో వూరికంటూ తీసికెళ్లటం మానేశాడు. ఇక పోతే బెజవాడకు తప్పనిసరి అయింది. ఒక్కగానొక్క మరదలుంటే పెండ్లికి పిల్చుకురాలేదని భార్య తిట్టు బంధువులంతా ఆడపోసుకుంటారనే ఆత్మాభిమానంతో తీసికెళ్లాడు. తీసికెళ్లాడే గాని పరువు ఎక్కడ పోతుందోనని లోలోపల అతను పడ్డ బాధ ఆ భగవంతునికే తెలియాలి. ఊరి కొచ్చిన తర్వాత భార్య పెట్టె సోదా చేద్దామని అనకొనికూడా, ఆమె నోటికి జడిసీ, ఇరుగుపొరుగులో తలవంపులుగా వుంటుందనీ సర్దుకుని వూరుకున్నాడు రామ్మూర్తి. ఇన్నాళ్లకు ఈ రోజుకు వీలు చిక్కింది సీతమ్మకు డబ్బు లెక్క పెట్టుకోటానికి.

పవని నిర్మలప్రభావతి

ఆలోచనలో మునిగి కాస్సేపు అలా పడుకుందామని చాప వేసుకుని పడుకుందో లేదో వీధి వాకిటి తలుపు ధన్ ధనా శబ్దమయింది "ఇంత ఎండలో ఏ దచ్చినాళ్లు వచ్చారా?" అని గొణుక్కుంటూ లేచి వెళ్లి తలుపు తీసింది. ఎదురుగా భర్తను చూచి ఆశ్చర్యపోయింది సీతమ్మ రామ్మూర్తి లోపలికి వస్తూ 'వేణు సాయంత్రం నాలుగు గంటల బండికి వస్తున్నాడట ... నేనాఫీసుకు శెలవు పెట్టి వచ్చాను" అన్నాడు అతని ముఖంలో తమ్ముడొస్తాడనే సంతోషం ప్రతిబింబిస్తోంది.

"వేణు ఒక్కడేనా ?...మీ కెలా తెలిసింది ?" సీతమ్మ నెమ్మదిగా అడిగింది.

"కాదు రాధ కూడా. ఇదుగో టెలిగ్రాము," రామ్మూర్తి టెలిగ్రాం కాగితం చూపిస్తూ అన్నాడు.

"అలాగా," ముభావంగా ఇంట్లోకి దారి తీసింది సీతమ్మ.

"వంట పెందలాడే కానియ్. నేనలా బజారో పనిచూచుకుని రైల్వే స్టేషనుకు వెళ్ళి వాళ్లను తీసుకువస్తా" రామ్మూర్తి పైపంచె దులుపుకుంటూ మళ్ళీ వీధిలోకి వెళ్ళాడు.

సాయంత్రం ఐదు గంటలకు ఇంటి కొచ్చారు వేణు, రాధ, రామ్మూర్తి. సామాను లోపల పెడుతున్నాడు రామ్మూర్తి. ఆప్యాయంగా కాళ్లకు నీళ్లు తెచ్చి ఇచ్చింది సీతమ్మ. కుశలప్రశ్నలయాక తీరిగ్గా వాకిట్లో కుర్చీలో కూర్చుని ముచ్చటాడుకుంటున్నారు అన్నదమ్ములు. పెరట్లో తులసికోట అరుగుమీద కబుర్లలోకి దిగారు తోడికోడళ్లు.

"నీ పెళ్లి తర్వాత మళ్ళీ మనం కలుసుకోనే లేదమ్మాయ్" అంది సీతమ్మ పక్కనే వున్న రాధ చిన్నగా నవ్వుతూ "ఏదక్కయ్యా! ఆయనకు తీరికేది? ఇప్పుడయినా ఎటూ ట్రాన్స్ఫరయింది కాబట్టి, మళ్ళీ ఎప్పుడు చూస్తామో, ఏమిటోనని ఇలా బయల్దేరాంగాని లేకపోతే, ఎప్పుడో, ఏమిటో" అంది.

"ఈ మధ్య సొమ్ము లేమైనా చేయించుకున్నావేమిటి?" అంది సీతమ్మ రాధ చేతుల కున్న బంగారుగాజుల వైపు పరీక్షగా చూస్తూ.

"ఆఁ! ఈ గాజులుమాత్రం చేయించుకున్నానక్కయ్యా! అదీనూ మామయ్య ఇచ్చిన భూమిమీద ఏదో ఓ వందరూపాయలు మక్తా వస్తే, ఊరికుంటే వృధాగా ఖర్చవుతుందని గాజులు చేయించుకున్నా"

"అవున్లే ఏదో ఒక వస్తువు ఏర్పడితేనే మంచిది వృధాగా పోయేదానికంటే" సీతమ్మ మెదడులో మళ్ళీ తన ముప్ఫై అయిదు రూపాయలూ తళుక్కున మెరిశాయి ఒక్కసారిగా.

"బొత్తిగా మమ్మల్ని మరచిపోయారు తోడికోడళ్లిద్దరూ...మాకేమైనా భోజనాలు పెడతారా?" నవ్వుతూ రామ్మూర్తి లోపలికొస్తూ అన్న మాటలు విని అక్కణ్ణుంచి లేచారు తోడికోడళ్లు.

* * *

మూడు రోజుల తర్వాత ఆ రోజు సాయంత్రం తెలవారు ఝామున రైలుకు తప్పకుండా వెళ్ళిపోవాలని అన్నయ్యతో చెప్పేశాడు వేణు. హైస్కూలు టీచరు వుద్యోగంలోని కష్టసుఖాలు అనుభవించక పోయినా తెలుసుకో గలిగిన రామ్మూర్తి అడ్డం చెప్పలేక పోయాడు ఘట్టిగా. రాధ



★ ఇంటిదొంగలు ★

ఈమాట సీతమ్మతో అనంగానే లోలోపల సగం ఖర్చు తగ్గిందని సంతోషించినా పైకి "అయినా ఇదేం, రావటం, ఇదేం పోవటం అమ్మాయ్ పట్టుమని పదిరోజులేనా వుండక" అంది ఆప్యాయంగా.

"ఈ సారివస్తే వుంటాంలే అక్కయ్యా నీతృప్తిదీరా" నవ్వుతూ అంది రాధ.

సాయంత్రం వేణు, రాధ, రామ్మూర్తి, సీతమ్మ బజారుకని బయల్దేరారు రాధ తన మామయ్య ఇచ్చిన డబ్బుతో ఓ చీర కొంటానంది.

"మీమామయ్య దగ్గర అంత డబ్బు ఎందుకు తీసుకున్నావ్" అంటూ గొణిగాడు వేణు

రాధ ఏమీ పలకలేదు.

అన్ని షాపులూ తిరిగి చివరకు నలభై రూపాయలకు ఓ పట్టుచీర కొన్నది రాధ. రాధకు పెట్టి పంపించడానికి రామ్మూర్తి సీతమ్మ ఓ ఇరవై రూపాయలకు ఇంకో చీర కొన్నారు నలుగురూ చీకటిపడి ఇలు చేరారు. రాత్రంతా అన్నదమ్ములు ఒకరి కష్టసుఖాలు ఒకరి చెప్పుకుంటూ పొద్దుపుచ్చారు మిద్దెమీద ఆరుబైట:

"ఒదినె అనుకుంటే, ఒదినను మించిన మనిషి రాధ" అన్నాడు వేణు మెల్లిదిగా.

"ఆ!" అంటూ కొన్నెపు కొయ్యబారిపోయాడు రామ్మూర్తి.

"సాయంత్రం ఆ చీరె డబ్బు వాళ్ళ మామయ్యిచ్చిందని నాకు నమ్మకంలేదు, అన్నయ్యా! ఏం చెప్పకోను సిగ్గుచేటు," బరువుగా నిట్టూర్పుతూ అన్నాడు వేణు.

ఆశ్చర్యపోతూ రామ్మూర్తి అతని వైపు చూచాడు. అరమరికలులేని అన్నదమ్ములు అలా ఒకరివైపు ఒకరు క్షణంసేపు చూచుకున్నారు.

"ఇంతకూ మన ఖర్మరా! వేణూ! మనం పూర్వజన్మలో చేసినపాపానికి ప్రతిఫలంగా ఈ ఇంటి దొంగల్ని మనపాలిటబడేసి మనల్ని చంపుతున్నాడు భగవంతుడు." ఓదార్పుగా అంటూ వేణు వైపు చూచాడు రామ్మూర్తి.

ఏదో ఆలోచిస్తూ తలవంచుకున్నాడు వేణు భారంగా.

ఇంట్లో పిచ్చాపాటి మాటాడుకుంటూ నిద్రలో పడ్డారు ఇంటి కోడళ్ళిద్దరూ.

తెలవారు ఝామున బండి ఎక్కుతూ "వెళ్ళోస్తా మక్కయ్యా" అంది రాధ.

"వెళ్ళొస్తానమ్మ ఒదినా" అన్నాడు వేణు.

సాగనంపటానికి రామ్మూర్తి బయల్దేరాడు.

"ఏం రావటమో, ఏం వెళ్ళటమో! ఇదిగో అని నాలుగు రోజులైనా వుండలే" అంది సీతమ్మ గడప నానుకుని నిల్చొని.

ఇప్పటికే ఎంతకు వర మయిందోనని మనస్సులో అంచనా వేసుకుంటున్న వేణు వెనక్కి తిరిగి "ఈసారి మళ్ళీ తీరిక చూచుకు వస్తాలే వదినా" అన్నాడు.

బండి సాగింది. హఠాత్తుగా కోటు జేబులో చెయ్యి పెట్టుకొన్న వేణు "అరె" అంటూ ఆశ్చర్యపోయాడు జేబులోని అయిదు రూపాయల నోటు మాయమయింది. ఎవరిపనో మరి...బండిలో ముందు కూర్చొని వున్న రామ్మూర్తి వెనక్కి తిరిగి.

"ఏమిటి" అన్నాడు.

అన్నయ్యకు వినపడింకే అని నాలుక కర్చుకున్నాడు వేణు

"ఏమీ లేదు, టైం ఆయిపోతున్నదని" అన్నాడు ధోరణి మార్చుతూ.

"ఫర్వాలేదులేరా! ఇంకా పదిహేను నిముషాలుంది. అదో సేమను కూడా వచ్చేసింది" రామ్మూర్తి తాపీగా అన్నాడు. ★

బుడుగు! చిచ్చుల పిడుగు



ఈ పెద్దవాళ్లున్నారే వీళ్ళకి చాలా సంగతులు తెలీవు. అస్సలు ప్రపంచకంలో వాళ్లొక్కళ్లే పెద్దవాళ్లనుకుంటారు. మనం పెద్ద వాళ్ళం అని చెప్పినా వినరు పైగా నవ్వుతారు. అంతేకాదు మన్ని అందరి ముందరా అనుమానం చేస్తారు.

మొన్న నేను బాబాయి వరస గురించి పెద్ద వాళ్లతో మాట్లాడుతున్నానా అంతట్లోకీ మా అమ్మవచ్చేసి 'బాబ్బ సుకుందుగాని దామ్మా బుడుగూ' అని రెక్క పట్టుకుని బర బరా లాక్కుపోయింది. అది అనుమానం చెయ్యడంకాదూ. నేను హాచ్చర్య పడిపోయేశాను.

ఎవళ్ళైనా నన్ను కనక అనుమానంచేస్తే నాకు ముందస్తుగా హాచ్చర్యం వేసేస్తుంది ఆనక, కోపం వచ్చేస్తుంది. మా అమ్మా బామ్మా మరీను. "బుడుగూ బొబ్బ పోచుకుందుగాని లా అమ్మ" అనీ "బువ్వ పెత్తనా బుడుగూ" అనీ అంటారు. నేను వ్రదిసార్లు చెప్పాను. చిన్న వెధవలికీ, చితక వెధవలికీ చెప్పినట్టు అలా బొబ్బా, బువ్వా అని నాతో అనొద్దని.

స్నానానికి లేవరా అనీ, భోం పెట్టుతాను రారా అని పిలవాలని చెప్తానా, వాళ్ళు నవ్వేస్తారు. ఒక్కోసారి ఇంటికి పెద్దాళ్లొచినపుడు కూడా నన్ను కుర్రాణ్ణి కింద కట్టేసి అనుమానం చేస్తారు

నా వైస్సు గురించీ అంతే. నాకు ఇపుడు ఏళేళ్లా.

ఎవళ్ళైనా అడిగితే మా అమ్మెమో ఆరేళ్ళండీ అని అబద్ధం ఆడేస్తుంది. మా బామ్మేమో యెబ్బే. యేదీ నాలుగు వెళ్లింది గాని అయిదోయేడాది యింకా రాందే అని డబాయిస్తుంది.

బాబాయి ఒక్కడే బెష్టు. నాకు కనీసం పృదేళ్లుంటాయని చెప్తాడు లోకులతో.

లోకులంటే కాకులు. ఇలా అని బామ్మ అంటుంది. బాబాయి ఫ్రెండ్లందర్నీ బామ్మ కాకుల్లా ఎండలో తిరుగుతారని కోప్పడుతుంది. అందుకు.

ఇందాకల చెపుతున్నది అనుమానం చెయ్యడం గురించి కాదూ?

ఏం, మరీ అమ్మ అవేళ అలా నన్ను రెక్కట్టుకు తీసుకుపోయిందా. నాకు ఒళ్లు మండిపోయింది. 'ఇన్సల్టు' అన్నాను (ఇన్సల్టు అన్నా కూడా అనుమానం చెయ్యడమేట ఇది ఇంగ్లీషు బాబాయి ఈ మాటని బామ్మ కోప్పడేప్పుడు అంటాడు.)

అమ్మ నవ్వడం మొదలెట్టింది. నాకు బలేకోపం వచ్చేసింది. బొబ్బ పోచుకోను అన్నాను వెక్కిరిస్తూ. అపుడు అమ్మకి కోపం వచ్చేసింది. వచ్చేసి ఉత్తి బొబ్బా అల్లా మార్చేసి, తలంటి పోసేస్తానుండు అంది. అని నిజంగా తలంటి పోసేసింది. (అప్పుడు నాకు భోడికుండు ఉంటేనుకో)

నేను అప్పటికి ఏడిచినా, ఆ తరవాత, అమ్మ ఇంకోసారి గసురుకున్నపుడు అమ్మని కోప్పడేశాను. ఎవళ్లు మాత్రం ఊరుకుంటారు కోప్పడక. మహా మహా చిన్నవాళ్లే ఊరుకోరు. ఊరుకుంటే ఇంకా లోకువ కట్టేస్తారు. లోకువ కట్టడం అంటే, అర్థం తెలుసుగా. నాకు తెలీదు.

మా అమ్మ ఒక్కోసారి కోపంగా ఉన్నప్పుడు నాన్నని ముందస్తుగా గసురుతుంది. తరవాత, కొంచెం ఏడుస్తుంది. అదన్నమాట.

యేం. ఇందాకా తలంటికిముందు యేదో చెప్తున్నానుగదూ బాబాయి వరస గురించి? నేను పెద్దవాణ్ణి అవుతున్నకొద్దీ గ్నాపకం గబగబ రావటం లేదు.

బాబాయి వరస ఏమిటంటే, అసలు బాబాయి, సీత ఒక వరసగా కూచుని చదువుకోరు. నేనూ మా (పెవేటు మేష్టరూ ఎదురుగా కూర్చుంటాం. వీళ్లు అలాగా కూర్చోరు. అందికే బామ్మ వాళ్ళ వరస బాగులేదంది. నేనూ అలాగే అనుకున్నా.

అనుకుని బాబాయి గదిలోకివెళ్లి, మీ వరస బావులేదని నా అభి(ప్రాయం అని చెప్పేశా.

యేడిశావులేవోయ్ బోడివెధవా బోడి అభి(పాయం నువ్వూను అనేశాడు బాబాయి అనేసి నా గుండుమీద ఓ టెంకిజెల్ల వుచ్చుకున్నాడు సీత పకపకా నవ్వేసింది.

బాబాయికి అసలు నేనంటే కృతిగ్నత లేదు కృతిగ్నత అంటే, ఏమిటంటే—

మీ బాబాయి ఓ కాలేజీ పిల్లాడనుకో. ఆడపిల్లల కాలేజీలో చదివే ఓ అమ్మాయి బావుంటుందనుకో. (మనక్కాదు. మీ బాబాయికి) అది రెండుజడలు వేసుకుంటుందనుకో. అది మా వీధిలోంచే కాలేజీకి వెళ్ళాలి రోజూ.

మా బాబాయి ఆవేళకే ఎదురుగుండా మొగకాలేజీవేపు వెళ్తాడు. అప్పుడుచూసి నవ్వుతాడు కళ్ళజోడులోంచి అంటే కళ్ల జోడులోంచి నవ్వడు చూస్తాడన్నమాట. యేంఒక్కసారి వంటఅవలేదనుకో కలకత్తా మెయిలులాగ బాబాయి లేటు అవుతాడు. ఆ జడల పిల్ల మాత్రం చప్పునే వచ్చేస్తుంది. అప్పుడు బాబాయి దాన్ని చూడ్డం ఎలా? వీధరుగుమీద కూర్చుంటే, నాన్న ఏరా ఇక్కడ కూర్చున్నావు అంటాడు అమ్మ కూడా నవ్వుతుంది అప్పుడు బాబాయి సిగ్గుపడతాడు అందుకని, యేమిటంటే, నన్ను వీధరుగుమీద ఉండమంటాడు. ఆ పిల్ల వస్తున్నపుడు పరిగెత్తుకువచ్చి చెప్తే తను వచ్చేస్తానన్నమాట



ఇది చాలాకష్టం ఇప్పుడు కొన్ని కార్లున్నాయనుకో అవి ముందరవేపూ వెనకాతలవేపూ ఒక్కలాగే ఉంటాయి. అందుకని దూరంనించిచూస్తే అలాటి కార్లు ఇటు వస్తున్నాయో అటు పోతున్నాయో గబుక్కున తెలీదు

ఈ జడలమ్మాయీ అంతే రెండు జడలు కదూ ఓటి ముందరకీ, ఓటి వెనక్కీ వేసుకుంటుంది. అందుకని వొస్తోందో పోతోందో తెలీదు దూరానికి.

యిలా ఓరోజున నేను కష్టపడిచూస్తూ అరుగుమీద కూచున్నా యింతట్లోకి ఆపిల్ల రైయ్‌మని రైలుబండిలా వచ్చేస్తోంది. నేను లోపలికెళ్లి బాబాయికి చెప్పి పిల్చుకొచ్చేసరికి ఇలుదాటిపోతుంది కదాఅని, ఆపిల్లనే ముందుపిల్చి కొంచెం అక్కడే ఉండు అని చెప్పి లోపలికెళ్లా.

బాబాయి రాడే. రోడ్డుమీద నించుందీ, రా బాబాయ్ అని చెప్పినా రాలేదు. పైగా అరవకు బోడి వెధవా అని టెంకిజెల్ల కొట్టాడు.

ఇదే కృతిగ్నత లేదంటే అర్థం.

యేం. ఆవేళా అలా బోడివెధవా అన్నాడా. మొన్ననూ, మీవరస బాగు లేదంటే, బోడి అభి(పాయం అని మళ్లీ అన్నాడా.


బాబాయి అలా నాది బోడిఅభి(పాయం అనడానికి నాకు బోడిగుండు ఉండడమే కదా ఫలితం అనుకున్నాను ఫలితం అంటే కారణం. అంటే నాకు తెలుసు.



ఈ అభి(పాయం నాదికాదూ బామ్మదికే అని చెప్పేద్దామనుకున్నాను కాని, ఏం లాభం? నాకు కొంచెం పిలకేనాఉంది. బామ్మకి పిలకకూడా లేదు. అందుకని ఊరుకున్నాను.

అయినా కోపంవచ్చేసింది. ఈ అన్నింటికీ ఈ బోడిగుండూ పిలకాయేకదా ఫలితం అనుకుని, వెంటనే నాన్న కోటుజేబులోంచి ఓ కాణీ తీసుకుని, నా బండీ

★ బుడుగు! చిచ్చుల పిడుగు! ★



కొరడా (నిర్ఘుంకొరడా తెలుసునా?) పట్టుకుని రండ్రుమని వెళ్ళిపోయాను. ఎక్కడికి?

మెడ్రాసు క్రాపింగుషాపు అని ఓటుంది పక్క వీధి చివర.

మాది ఇదివరకు మెడ్రాసేగా. దసరాకి వెళ్ళాంలే పదిరోజులున్నాం

అక్కడికెళ్ళి, నాకు అర్జెంటుగా మెడ్రాసు క్రాపింగుషాపు చెయ్యమన్నాను.

వాడు రండి అని మర్యాద చెయ్యలేదు. పైగా మీ నాన్నని అడిగిరమ్మన్నాడు. ఇలాటివాట్లో నాన్న ఎప్పుడూ అమ్మ పార్టీయే. అందుకనే అడగలేదనుకో.

మా నాన్నంతవాడు వాడూ, నాఅంతవాడు నేనూ. అందుకని ఫరవాలేదూ మెడ్రాసు క్రాపింగుషాపు చేసెయ్యి అన్నాడు

వాడు ఓలా నవ్వాడు. అలా నవ్వితే నాకు కోపం వస్తుంది. నీకే నాసరే.

అక్కడికీ నా దగ్గిర డబ్బు లేదనుకుంటునాడేమోనని, కాణీ చూపించాను. ఇవ్వలేదనుకో ముందుస్తుగా డబ్బు ఇవ్వకూడదు. పెద్దవాళ్ళివ్వరు.

కాణీ చూపించినా వాడు మెడ్రాసు క్రాపింగుషాపు చెయ్యనన్నాడు.

యిలాగా నీది గుండుకదా అన్నాడు. అందుకే అర్జెంటుగా చెయ్యాలి అన్నాను నే.

నువ్వు యక్కపోతే కొరడాతో కొశేస్తా చెను వాడు చెయ్యలేను. అందుకని వన్నా టిప్పుకుని పరిగెత్తుకుని మా యింటి ఝెళుసన కొచ్చేశా.

వాడూ నఫీసుగానే పరిగెడతాడు నా అంత నఫీసు కాడనుకో.

అయినా పట్టేస్తాడని అనుమానం కలిగింది.

అప్పుడు యింకో రోడ్డొంచి గుర్రబ్బళ్ళ చోటు కెళ్ళాను.

నాకు తెలిసినవాళ్ళుంటారేమో చూద్దామని. తెలిసినవాళ్ళు కన్న విశేషం. తెలిసిన వాళ్ళు నేను పిలిస్తే బండీకట్టరు.

అక్కడ ఒక్కడే కొత్తవాడున్నాడు.

మా యింటికి రావోయ్ అని బండి కట్టించేసుకుని రండయ్మని ఇంటికెళిపోయి, పెరట్లోకెళ్ళిపోయి జాంచెట్టెక్కి పోయాను.

తరవాత పెద్దవాళ్ళందరూ ఒకళ్ళకొకళ్ళు ప్రవేట్లు చెప్పేసుకున్నారు.

చివరికి నాన్నొచ్చి బాబాయికి గట్టిగా ప్రవేటు చెప్పేశాడు.

క్రాపింగు అందుకి కోపం పోయేలా డబ్బులిచ్చాను. అంతేకాకుండా బాబాయి వెంటనే ఓసారి క్రాపింగు చేయించుకోవాలన్నాడు బొమ్మకూడా అంతే కావాలంది

బాబాయి ఒద్దన్నాడు. పెద్దషాపుకెళ్తే కాని ఫాషన్‌గా చెయ్యరన్నాడు.

పోనీ ఇప్పుడు కొంచెం క్రాపింగు చేయించుమని అనక పెద్దషాపుకి వెళ్ళమంది బొమ్మ. అప్పుడేమో ఆ పెద్దషాపుకి, ఈ బండీమీద వెళ్ళొచ్చునన్నాడు నాన్న.

కాని బండివాడు క్రాపింగుఅయ్యేదాకా ఉండనన్నాడు. అంతట్లోకి క్రాపింగుషాపు వాడు అస్సలు నేను క్రాపింగ్ చెయ్యను పొమ్మనాను.

అప్పుడేమో వాళ్ళిద్దరూ నేస్తాలయిపోయారు. క్రాపింగుషాపింగువాడు, బండీవాడి గుర్రబ్బండిలో ఎక్కిపోయాడు. ఇద్దరూ ఆ బండిలో వెళ్ళిపోయారు.

ఆ వేళ, మా యింట్లో అందరూ కలిపి ఒక్కసారి నాగుండుమీద ప్రవేటు చెప్పేశారన్నమాట. ★

(ఇంకావుంది)



"త్వరగా రంటారేటి? ఈ యింటోనే ఎల్లారండి. గుండూ అనీ ఉం
పెద్దోళ్ళు బేరం ఆడతారనిసొప్పి బండి కట్టించుకొచ్చా"

గాఢానురాగం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతి శాస్త్రి

గత సంచిక తరవాయి

3

అంతవరకు కాంచనమాల కథ చెప్పిన అపరాజిత ఒక క్షణం సేపేదో ఆలోచించి ఉస్సూరుమని దీర్ఘ నిశ్వాసం విడిచిపెట్టింది.

రత్నావళి దూరం దూరంగా కామ దేవాయతనంలో ధ్వనించే కళ్యాణ తూర్యాల ధ్వని విని అదిరిపడింది:

"అప్పుడే స్వామి కళ్యాణం ప్రారంభమైనట్లుందే!

ఇంకా ఈ కథ ఎంతసేపు పడుతుందో?"

అని ఆత్రంగా అడిగింది

"ఎంతో సేపా! నువ్వు మధ్య మధ్యన అడ్డు ప్రశ్నలు వెయ్యకపోతే అరగడియ సేపు పట్టదు. ఇంతకీ నీకీ కథ విన సొంపుగా లేదా?"

అని అపరాజిత రత్నావళి వైపొక చిరునవ్వు రేక విసిరింది.

"లేకేమి ఆ కాంచనమాల కూడా నాలాంటి దురదృష్టవంతురాలు లాగే కనిపిస్తోంది.... సరే దానికేమిగాని ఆ తర్వాతేమైంది?"

అని అడిగి కాంచనమాల ఎంతో ఆత్రంగా అపరాజిత వైపు చూసింది అపరాజిత మళ్ళీ మిగిలిన కథ అందుకుంది:

"పాపం! కాంచనమాలకు చంద్రవర్మ విశాలా నగరానికి వెళ్ళిపోవడం ఎంతైనా మనఃక్లేశం కలిగించింది. అతడు విశాలానగరానికి బయలుదేరి వెళ్ళిపోతూంటే కనుచూపు మేర వరకు ఆమె అతిదెక్కిపోయే అశ్వం వైపు నిశ్చలంగా రెప్ప వాల్చకుండా చూచింది. ఆ సమయంలో నేనామె పక్కనే నిలుచున్నాను. ఆ అశ్వం కనుచూపు మేర దాటి పోగానే ఆమె కళ్ళలోని వెలుగొక్క మారుగా అదృశ్యమై పోయింది!

చంద్రవర్మ విశాల నగరానికి వెళ్ళిపోవడానికి కారణం తన తండ్రి చండవర్మేనని కాంచనమాల గ్రహించి వేసింది. చంద్రవర్మ చండవర్మ మాట కాదు రాడు లేక తలవంచుకొని విశాలా నగరానికి వెళ్ళిపోతే— మరి కాంచనమాల ఏమి చెయ్య గలదు?

అటు పిమ్మట ఇంచుమించుగా ఒకమాసం గడిచిపోయింది.

విక్రమవర్మ తనపట్టు విడవలేదు. కాంచనమాలను తప్ప మరెవరినీ వివాహమాడనని ఆ వివాహం కాని పక్షంలో ఆ జన్మ బ్రహ్మచారిగానే ఉండిపోతాననీ శపథం పట్టాడు.

ఐశ్వర్యాధికారాలలో విక్రమవర్మ తండ్రి చండవర్మకన్న గొప్పవాడని నేనిదివరకే సూచించాను. పైగా కాంచనమాల తలికి ఆ సంబంధం అన్ని విధాలా నచ్చింది కూడాను. నెమ్మదిగా ఆమె భర్తను కూడా ఒప్పించింది. ఇంక కాంచనమాలే మిగిలింది. కాని ఆమె క్రమక్రమంగా దారిలోకి రాకపోదని తలికి గట్టినమ్మకం! అయితే కాంచనమాల ధోరణి చూస్తే ఆమె కేమీ పాలుపోలేదు.

ఒకనాడు దివదీపాల వేళ కాంచనమాల భవంతిలోపల గదిలో ఒక మూల పరధ్యానంగా కూర్చుంది. ఆ గది అంతా బాగా చీకటిగా ఉంది. నేనప్పుడే ఆ గదిలోకి వెళ్లాను ఎందుచేతనో పరిచారిక లెవరు అక్కడ దీపం పెట్టలేదు. కాంచనమాల ఏదో ఆలోచిస్తోంది ఆమె ధోరణి పరికిస్తే నిశ్చలంగా దేనివైపో చూస్తున్నట్టు కనబడింది. ఆ సమయంలో కాంచనమాల ఆ గది కంతటికీ అప్పుడే వెలిగించిన కర్పూర దీపంలా కనిపించింది ఆమె అలాగ చీకటిలో ఏకాకిగా పడి ఉండడం చూస్తే నా కడుపు తరుక్కుపోయింది:

ఒక దీపం వెలిగించి ఆ గదిలోకి తీసుకు వెళ్లాను అంతలోనే ఆమె తల్లి కూడా అక్కడికి వచ్చింది. నెమ్మదిగా కుమార్తె పక్కన కూర్చుని తల నిమిరింది:

"కాంచనమాలా! మీ నాయనగారు నేను చెప్పిన సంబంధం నిశ్చయం చేదామనుకుంటున్నారమ్మా!"

అని నిదానంగా కాంచనమాల వైపు చూచింది.

కాంచనమాల మాట్లాడలేదు. తల్లి మళ్ళీ అందుకుంది.

"ఇదిగో! చూడమ్మా! వాళ్ళన్ని విధాలా మనకన్నా చాలా గొప్పవాళ్లు. నీకలాంటి సంబంధం వచ్చిందంటే అదంతా నీవు పూర్వజన్మంలో చేసుకున్న పూజా ఫలితమే అనుకో! అదీగాక నీవు చూశావో లేదో గాని విక్రమవర్మ కూడా చక్కగానే ఉంటాడు. అన్ని విధాలా మనకెకే తగిన సంబంధం. నీవీ సంబంధం చేసుకుంటే బాగా సుఖపడతావు. నా మాట వినమ్మా!"

అని చాలా చాలా నచ్చజెప్పింది. కాంచనమాల ఆ మాటలన్నీ విని తల వంచుకుని కూర్చుంది. అంతేగాని అవుననిగాని కాదనిగాని మాట్లాడలేదు కొంతసేపటికేదో సమాధానం చెప్పబోయి గొంతు సవరించుకుంది.

ఆ పైన నే నందుకున్నాను:

"అమ్మా! కాంచనమాల చిన్నపిల్ల. నోరు విడిచి ఏమని మాట్లాడుతుంది? అమ్మాయికేది మంచి సంబంధమో మీకు మాత్రం తెలియదు గనకనా? ప్రత్యేకంగా అడగడ మెందుకు? మనస్సులో ఉన్నదేదో పైకి చెప్పడానికి సిగ్గుపడుతూందేమో!" అని కాంచనమాలకేసి చూచాను. ఆ నా మాటలువిని కాంచనమాల కొరకొరలాడుతూ చూసింది.

"అయితే ఇది నీకిష్టమేనన్నమాట! మీ నాయనగారితో అలాగని చెబుతాను సరేనా?" అని కాంచనమాల తల్లి లేచి నిలబడింది అంతలోనే చండవర్మ అక్కడికి వచ్చాడు. జిజ్ఞాసా దృష్టితో భార్యవైపు చూచాడు కాంచనమాల తల్లి చండవర్మను చూస్తూనే సమాధానం చెప్పింది.

"లోలోపల ఇష్టపడినా పైకి చెప్పడానికెందుకో సిగ్గుపడుతూన్నట్టుంది. అయినా సుకుమారి, మోహము తెలియని చిన్నపిల్ల దానికేం తెలుసును!"

అని అంటే అంటనట్టుగా చప్పరించి వేసింది. తరవాత చండవర్మ భార్యతో కలిసి అక్కడినించి వెళ్లిపోయాడు.

ఆ తరవాత చండవర్మ ఆ సంబంధమే స్థిరపరిచాడు. సంబంధం స్థిరపడిన తరవాత నాలుగైదు రోజులలో కాంచనమాలా విక్రమవర్మలిద్దరికీ ఎంతో వైభవంగా వివాహం జరిగిపోయింది.

౪

కాంచనమాలకు వివాహమైన అయిదా

గాఢానురాగం

మూసాలలో అత్తవారింటికి వెళ్ళిపోయింది. చిన్నప్పటినించీ పెంచిన మమకారంకొద్దీ నేను కూడా కాంచనమాలతో కలిసి ఆమె అత్తవారింటికి వెళ్ళాను.

చండవర్మ కాంచనమాల వివాహానికి చంద్రవర్మను అంటీ అంటనట్టుగా పిలిచాడు. అందుచేత చంద్రవర్మ కాంచనమాల వివాహానికి రానేలేదు. అతడు రాకపోవడం ఒక విధంగా మంచిదే అయిందిగాని అందుచేత కాంచనమాల ముఖంలో కేవలం ముభావంతప్ప మరేమీ కనిపించలేదు.

విక్రమవర్మకు కాంచనమాలా చంద్రవర్మల పరస్పరానురాగవ్యవహారం స్పష్టంగా తెలిసిందో లేదో నాకు తెలియదు ఏదైనా కొంచెం చూచాయగా తెలిస్తే తెలిసిఉండవచ్చునని నా నమ్మిక.

ఏది ఏమైనా అతనికి కాంచనమాలమీద కలిగిన అనురాగం అపారం! అతి డొక్క నిమిషమైనా ఆమెను విడిచిపెట్టి ఉండలేకపోయేవాడు!"

అని అపరాజిత అంతలో ఏదో జ్ఞాపకం వచ్చి హఠాత్తుగా అంతటితో తన కథ ఆపివేసింది.

రత్నావళికి క్రమక్రమంగా కథ మీద ఆసక్తి పెరిగింది. అందుచేత ఎంతో ఆత్రంగా అడిగింది:

'హఠాత్తుగా కథ ఆపివేశావే! ఆతరవాత ఏం జరిగింది'

అపరాజిత మళ్ళీ అందుకుంది:

"రత్నావళీ! వివాహమైన కొంతకాలందాకా మగవారంతరు భార్యలంటే వల్లమాలిన మమకారం చూపిస్తారు. కాని తరవాత తరవాత మగవారికి 'భార్య'అంటే గడ్డిపోచకన్నా తేలికైపోతుంది ఆమె ఎంతటి అందకత్తెకానీ! ఎంతటి అనురాగంతోనైనా కాళ్ళావేళ్ళాపడి పెళ్ళాడనీ. అదేమి పాపమోగాని భార్యఅంటే అంత తేలికైపోతుంది!

కాంచనమాలా చంద్రవర్మల అనురాగం విక్రమవర్మకు కొంచెం తెలిసింటే అనుకుందాము. అయినా అతడామె నెప్పుడు కిందనడవనిచ్చేవాడే కాదు!

వివాహమయ్యాక ఇంచుమించుగా ఒక ఏడాది గడిచిపోయింది అయినా కాంచనమాలమీద విక్రమవర్మ అనురాగం అణువంతైనా తగ్గిపోలేదు.

అతడామెకెన్నెన్నో అలంకారాలు, అందమైనచీరలు బహూకరించేవాడు. ఆమె నడిస్తేనే పాదాలు కందిపోతాయేమో అన్నట్టు మాట్లాడేవాడు. ఆమె మనస్సులో

ఏమి కావాలనుకున్నా అవి అమరునాడే ఆమెఒళ్ళో వచ్చిపడేవి. విక్రమవర్మ కాంచనమాలపై అంతటి ఆప్యాయత కనబరిచేవాడు:

ఇక కాంచనమాల సంగతి వివాహమైన చాలాకాలందాకా ఆమె ధోరణి ఏమీ మారలేదు. కాని భర్త విక్రమవర్మ ఆదరాభిమానాలు చూరగొన్నకొద్దీ ఆమె ధోరణి కొంతవరకు మారింది

నేనాధోరణికెంతో సంతోషించాను. క్రమంగా ఆమె పెదవులపై చిరునవ్వులపూత ప్రారంభించింది

కొందరు యువతులెలాగఉన్నా సౌందర్యవతులుగానే కనిపిస్తారు విషణ్ణ వదనంతో వెలవెలబోతున్నా కాంచనమాలకది ఒక ప్రత్యేకాలంకారంగానే కనిపించేది. ఎంతో బెంగటిలి కృశించిపోయినా ఒక్కరవ్వ చిరునవ్వు మెరిసేసరికి కాంచనమాల ముఖసౌందర్యం వేయినుశుగు లినుమడించేది!

కొంతకాలంపాటు చంద్రవర్మకోసం కుమిలికృశించినా క్రమక్రమంగా కాంచనమాల ఆ విషయంఅంతా మరిచిపోయి స్తిమితపడగలదనీ, కాంచనమాలా విక్రమవర్మల అన్యోన్యత క్రమక్రమంగా వృద్ధి పొందగలదనీ అనుకున్నాను. అది చాలావరకు నేననుకున్నట్టే జరిగింది. కాంచనమాల అత్తింటివారు పుట్టింటివారు ధారానగరవాసులే కనక కాంచనమాల తల్లిదండ్రులుకూడా అప్పుడప్పుడామెను చూచి వెడుతూండేవారు. కాంచనమాల కూడా అడపాదడపా పుట్టింటికి వెళ్ళివస్తూండేది.

ఆతరవాత కొంతకాలానికొక చిన్న సంఘటన జరిగింది. ఒకనాడు చంద్రవర్మ విశాలా నగరాన్నించి కాంచనమాలను చూడాలనే కుతూహలంతో ఆమె అత్తవారింటికి వచ్చాడు.

నేనాసమయంలో కాంచనమాలతో ఏదో పిచ్చాపాటీ మాటాడుతున్నాను.

చంద్రవర్మను చూసీ చూడడంతో కాంచనమాల తటాలునలేచి నిలబడింది. అత్యన్నంతో ఆప్యాయంగా ఆదరించింది. ఆ సమయంలో ఆమె ముఖం చూచితీరాలి! ఒక్కసారిగా ఆమెకళ్ళు వేయికర్పూర దీపాలు వెలిగినట్లుగా తళతళా మెరిసిపోయాయి ఆమెశరీరంలో అంతటా ఏదో అపూర్వమైన ఆనంద చైతన్యం ప్రవహించినట్లయింది. కొంచెం కుశల ప్రశ్నాదికం జరిగిన తరవాత కాంచనమాల వ్యంగ్యంగా అడిగింది:

"ఇన్నాళ్ళకి! నేను కొంచెం జ్ఞాపకం వచ్చానన్నమాట! పోనీ అదే పదివేలు!"

ఆ మాటతో చంద్రవర్మ అదిరిపడ్డాడు:

"అదేమిటి! అలాగ మాట్లాడుతున్నావు?"

"ఏం!"

"నేను నిన్ను మరిచిపోవడ మేమిటి?"

"మరిచిపోకపోతే నా వివాహానికెందుకు రాలేదో!"

"నీ మనస్సు నొప్పించడం ఇష్టం లేక!"

"ఓహో! అలాగా! ఒకవేళ నా మీదగాని కోపం వచ్చిందేమోనని అనుకున్నాను"

"ముద్దు నీ మీద కోపం ఎందుకు?"

"అయితే ఈ కోపం అంతా ఎవరి మీద?"

గాఢానురాగం

ఆ ప్రశ్న విని చంద్రవర్మ గుండెలలో ఉన్న ఊపిరి అంతా ఒక్కమారుగా విడిచి పెట్టాడు:

"కాంచనమాలా! ఎవరిమీద కోపపడితే ఏం లాభం! నేను నీ వివాహానికి రావడం మీ నాయనగారికే ఇష్టం లేదు. అది నీకు మాత్రం తెలియదా?"

ఆ మాటతో కాంచనమాల తల వంచుకుంది:

"పోనీలే! ఇన్నాళ్లకయినా నా మీద కొంచెం జాలికలిగింది."

అని చంద్రవర్మ విశాలాపురం వెళ్ళినప్పటి నించీ జరిగిన విశేషాలన్నీ గుచ్చి గుచ్చి అడిగింది.

నేను వారిద్దరికీ కొంచెం సమీపంలో ఉండి ఏవేవో గృహకృత్యాలు నిర్వర్తిస్తూ వారి ధోరణి అంతా ఒక కంట కనిపెట్టి చూస్తూనే ఉన్నాను. వారేవో అనేక విషయాలను గురించి ఎంతో ఉల్లాసంగా మాట్లాడుకున్నారు. వారి మాటలలో ఎన్నెన్నో చిత్ర విచిత్ర విషయాలు దొర్లిపోయాయి! ఒక్కొక్కప్పుడు వారి సంభాషణ కొక దారితెన్నూ ఉన్నట్టే కనబడలేదు. నీవెప్పుడైనా ఇద్దరుపసిపిల్లలుమాట్లాడుకునే ధోరణి విన్నావో లేదో! కాంచనమాలా చంద్రవర్మ లిద్దరి ప్రసంగాలు సరిగా ఆ విధంగానే ఒక తుద మొదలు లేకుండా ఎంతో సేపుసాగిపోయాయి వారిద్దరు ఆ సమయంలో ఎంత ఆప్యాయంగా మాట్లాడుకొన్నారు!

అప్పటికి సూర్యాస్తమయం అయింది. మరి కొంత సేపటికి విక్రమవర్మ, వృద్ధులైన అతనితల్లిదండ్రులు అక్కడికి వచ్చారు. విక్రమవర్మ చంద్రవర్మ నెంతో ఆదరించి గౌరవించాడు. చంద్రవర్మ యెడల అతడు కనబరిచిన ఆదరాభిమానాలు చూస్తే నాకే ఆశ్చర్యారం వేసింది. విక్రమవర్మ చంద్రవర్మనింకా నాలుగైదు రోజుల వరకు తమ ఇంట ఉండవలసిందని బలవంత పెట్టాడు. కాని చంద్రవర్మ అక్కడ ఒకటి రెండు రోజులకంటె ఎక్కువ ఉండలేదు. ఆ తరవాత అతడు మేనమామ చండవర్మ భవంతికి వెళ్ళి అక్కడ రెండుమూడు రోజులుండి తిరిగి విశాలాపురం వెళ్లిపోయాడు. విశాలాపురానికి వెళ్ళిపోయేముందు మళ్లీ ఒక సారి వచ్చి కాంచనమాలను చూచి మరీ వెళ్లాడు.

అటు పిమ్మట నాలుగైదు మాసాలలో

కాంచనమాల బాగా చిక్కి శల్యమై పోయింది. కారణమేమో ఎవరికీ తెలియ లేదు. ఆ రోజుల్లో విక్రమవర్మ ఆమెనొక నిమిషమైనా విడిచిపెట్టకుండా కంటికి రెప్పలా కనిపెట్టుకుని ఉండేవాడు. ఎందరెందరినో ధారానగర రాజవైద్యులను పిలిపించి కాంచనమాలకనేకవిధాలుగా వైద్యాలు చేయించాడు. ఏ వైద్యం చేసినా కాంచనమాల నాలుగు రోజులపాటారోగ్యంగా ఉన్నట్టు కనబడేది. ఆ తరవాత అదేవ్యాధి మళ్లీ మొదటికి వచ్చేది.

కాంచనమాల క్రమక్రమంగా మంచం పట్టింది. విక్రమవర్మ పరిచారికల నేర్పాటు చేసి ఎంతో శ్రద్ధగా ఆమెకు పరిచర్యలు చేయించాడు. అహర్నిశలు ఆమె సన్నిధినే కూర్చుండి పరిహాస ప్రసంగాలతో ఉల్లాసంకలిగిస్తూ ఆమెతో బాటు కాలక్షేపం చేసేవాడు.

కాంచనమాలవ్యాధి క్రమక్రమంగా ఎక్కువవటే కనబడిందిగాని, తగ్గే సూచనలేవీ కనిపించలేదు. ఎన్ని వైద్యాలు చేయించినా తాత్కాలికంగానే కొంచెం ఉపశమించి నట్లు కనిపించేది. ఆ వ్యాధి ఏమిటో ఎవరికీ తెలియలేదు.

ఒకనాటిరాత్రి నేను, విక్రమవర్మ కాంచనమాల శయ్యకు సమీపంలోనే కూర్చున్నాము కాంచనమాల పరిస్థితి ఏమీ బాగాలేదు. విక్రమవర్మ ఆమె రుగ్మతఘోరస్థితి చూచి ఉసూరుమని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు :

"కాంచనమాలా! నీ వంట్లో ఎలాగుంది? కన్నెత్తి నాతో మాట్లాడవేమి? అయ్యో! నానాటికీ ఇలాగయిపోతున్నావేమిటి? మీవారందరితోటి పెద్దయుద్ధంచేసి, ఏరికోరి నిన్ను వివాహం చేసుకున్నాను. అదేమి పాపమో గాని ఆనాటినించీ నీవీ విధంగా చిక్కి శల్యమై పోతున్నావు! ఇదంతా నా దురదృష్టమే! నేను పూర్వజన్మంలో చేసుకున్న పుణ్యం ఇంతే!"

ఆ తరువాత కొంచెం గద్గద భారంవల్ల అతని నోటమాట పెగలలేదు.

కాంచనమాల ఒక్కసారి కన్నెత్తి అతనికేసి చూసింది. ఆమె నేత్రాలర్ధనిమేషం వరకు అలాగే నిశ్చలంగా ఉండిపోయాయి తరవాత ఆమె రెండు కనుగొలుకులనుండీ బొట బొటా వేడి కన్నీరు ప్రవహించింది. కాంచనమాల కంఠం గద్గద భారంతో వణికి పోయింది :

"ఆదురదృష్టం మీదికాదు. నాది! నేను మీవంటి వారికి తగను ! ఇల్లా జీవచ్ఛవంలా జీవించడంకంటె మరణించడమే మంచిది. నాకోసం మీరెందు కింత గా(శమపడతారు. ఇక నేనాట్టే కాలం జీవిస్తానని తోచదు."

"కాంచనమాలా! అదేమిటి అలాగంటావు! తప్పు! తప్పు!"

అని విక్రమవర్మ కాంచనమాల ముంగురులు నిమురుతూ ఆమె శయ్యమీద కూర్చున్నాడు.

తరవాత కాంచనమాల లోలోపల దుఃఖం నిలవరించుకోలేక పట్టి పసిపాపలా వెక్కి వెక్కి ఏడ్చింది

ఆమె అలాగ కుమిలి కుమిలి దుఃఖించడానికి కారణమేమో మొట్టమొదట మాకెవరికీ తెలియలేదు రుగ్మతవల ఏర్పడిన శరీర మనోదౌర్బల్యాలే దానికి కారణమై ఉండవచ్చునని అనుకొన్నాము.

ఒకనాటి రాత్రి చాలా పొద్దుపోయేదాకా నేను కాంచనమాల మంచం పక్కనే కూర్చున్నాను. చిక్కిశల్యమై పోయిన కాంచనమాల ముఖం ఆ దీపకాంతిలో నక్షత్రకాంతిలో శుద్ధ పాడ్యమి నాటి చంద్రవంకలా మెరిసింది. చిక్కి శల్యమైనా ఆమె ముఖంలో కళాకాంతులు తగ్గలేదు.

నేనక్కడికి వెళ్లిన చాలా సేపటిదాకా కాంచనమాల నేనున్న సంగతి గుర్తించలేదు కొంత సేపటికి నా ఉనికి గమనించింది. నేనామె దగ్గిరికి జేరి మెల్లిగా అన్నాను.

"కాంచనమాలా! నీ ధోరణి చూస్తే ఏదో వల్లమాలిన మనోవ్యాధితో బాధపడుతున్నట్టున్నావు. అదేమిటో కాస్త నా చెవిని వేస్తే తప్పా!"

కాంచనమాల చాలా సేపటి దాకా దానికేమీ ప్రత్యుత్తరం చెప్పలేదు. తరవాత ఏమాలోచించిందో. మరి మెల్లిగా పెదవి కదిపించింది:

"చెవిలేమాత్రం ఏం లాభం!"

అని ప్రాణంవిడిచినట్టొక దీర్ఘ నిశ్వాసం విడిచింది:

"పోనీ! అదేదో కొంచెం నాచెవిని వేస్తే తప్పా!"

అని ఎంతో ఆప్యాయంగా బ్రతిమాలు కొన్నాను.

చిట్ట చివరికి కాంచనమాల సమాధానం చెప్పింది:

"అపరాజితా! నీవు నాకు చేసేపరిచర్యకేమి చేసినా నీ ఋణం తీర్చుకోలేను. ఇక ఈ ఒక్క ఉపకారం చేస్తినా నీకెంతైనా ఋణపడి ఉంటాను. నేనిక ఆట్టే కాలం జీవిస్తానని తోచదు. ప్రాణాలువిడిచేముందు చంద్రవర్మనొక్కమారు కళ్లారా చూడాలని ఉంది. అంతే! మా వాళ్ళందరు అప్పుడప్పుడు నన్ను చూడడానికి వస్తూనే ఉన్నారు గదా. నాకిక కోరికలేవీ లేవు."

అని ఇక మరి మాట్లాడలేక కళ్ళు వాల్చింది. అంతలో విక్రమవర్మ అక్కడికి వచ్చాడు. ఆమె పరిస్థితి చూచి అతనలాగే దిగాలుపడి పోయాడు. నేను కొంచెం తటపటాయిస్తూ విక్రమవర్మతో అన్నాను:

"కాంచనమాల పరిస్థితిఏమీ బాగాలేదు. ఒక సారి మన వాళ్ళకీ, చంద్రవర్మకీ కబురు పంపిస్తే మంచిదేమో."

వెంటనే విక్రమవర్మ కాంచనమాల తల్లిదండ్రులకు కాపిపయం కబురు పంపించాడు. ప్రత్యేక దూత ద్వారా చంద్రవర్మకుకూడా వర్తమానం పంపించాడు.

—సశేషం.

సమితి ప్రతిష్ఠ కాపా



సమితి ప్రధాన కార్యదర్శి హామర్ షెల్డ్.

ఐక్యరాజ్యసమితికి ఇన్నాళ్ళకు స్వంత సైన్యం ఏర్పడింది. ఈజిప్టుపై ఇస్రేల్, బ్రిటన్, ఫ్రాన్సులు జరిపిన దురాక్రమణ ఫలితంగా ప్రపంచ శాంతికే భంగం కలిగే సూచనలు కనిపించాయి. ఈ పరిస్థితిలో ఈజిప్టు, ఇస్రేల్ సరిహద్దులలో శాంతిని సంరక్షించడానికి అంతర్జాతీయ శాంతి రక్షక సైన్యం అవసరమైంది.

ఈ సైన్య నిర్మాణాన్ని ఆమోదిస్తూ, సమితి సర్వసభ్య ప్రత్యేక సమావేశం నవంబరు 7వ తేదీన తీర్మానం చేసింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 65 దేశాలు ఓటు చేశాయి. ప్రతికూలంగా ఒక్క ఓటుకూడా రాలేదు.


సమితి పదకొండేళ్ళ చరిత్రలో ఇటువంటి అంతర్జాతీయ సైన్యం ఏర్పడడం ఇదే మొదటిసారి. సమితి క్రమంగా దుర్బలమై పోతూ, చివరికి నశించిపోతుందని కూడా అనుమానపడినవారికి ఈ పరిణామం, తిరిగి సమితిలో విశ్వాసాన్ని కలిగించింది.

సమితి ఇలా హఠాత్తుగా లేచి నుంచుని తానింకా సజీవంగా, చైతన్యవంతంగా ఉన్నానని నిరూపించుకోవడానికి ముందు తెరవెనక భాగవతం చాలా జరిగింది. ఈ భాగవతానికి సూత్రధారి అయిన వ్యక్తి డాగ్ హామర్ షెల్డ్; సమితి ప్రధాన కార్యదర్శి.

అక్టోబరు మాసాంతంలో బ్రిటన్, ఫ్రాన్సులు ఈజిప్టుపై దురాక్రమణ ప్రారంభించడం హామర్ షెల్డ్‌కు మర్మాఘాతంవలె తగిలింది. భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం గల రెండు అగ్రరాజ్యాలు ఈవిధంగా బాధ్యతారహితంగా ప్రవర్తించడం ఆయనకు తీవ్ర మనఃఖేదం కలిగించింది. దానికితోడు మండలి చేసిన రెండు యుద్ధ విరమణ ప్రతిపాదనలను బ్రిటన్, ఫ్రాన్సులు వీటో చేయడం మరింత దుస్సహమైనది. వెంటనే ఆయన ఆ రాత్రి రాత్రి అంతా మేలుకుని కూర్చుని ఒక ప్రకటన తయారు చేశారు. తానిక రాజీనామా ఇవ్వడం తప్ప గత్యంతరం లేదని ఆ ప్రకటనలో తెలియజేశారు. "సమితి రాజ్యాంగంలోని అన్ని సూత్రాలను, అన్ని సభ్య దేశాలూ అనుసరిస్తాయనే హామీ ఉంటే తప్ప సమితి ప్రధాన కార్యదర్శి పనిచెయ్యడం కష్టం" అని ఆయన ఖచ్చితంగా చెప్పివేశారు.

హామర్ షెల్డ్ రాజీనామా ఇస్తాననడంతో, మండలి సభ్యులందరూ పరిస్థితి ముదిరిపోతోందని గ్రహించారు. అమెరికా, రష్యా, ఆఖరికి బ్రిటన్, ఫ్రాన్సు ప్రతినిధులుకూడా కార్యదర్శిలో సంపూర్ణ విశ్వాసం వెల్లడించారు. "హామర్ షెల్డ్ నిజాయితీలోను, నిష్పక్షపాతంలోను మాకు పూర్తి విశ్వాసమున్నది," అని బ్రిటిష్ ప్రతినిధి సర్ పియర్సన్ డిక్సన్ ప్రకటించాడు. రాజీనామా నివ్వవద్దని కోరుతూ కైరో నుంచి అధ్యక్షుడు నాసర్ కూడా తంతి పంపించారు.

ఈ విశ్వాసప్రకటనతో హామర్ షెల్డ్‌కు ధైర్యం చేకూరింది. వెంటనే యుగోస్లావ్ ప్రతినిధులను తన ఆఫీసుకు పిలిపించి వారిచేత ఒక తీర్మానం వ్రాయించారు. మండలితో నిమిత్తం లేకుండా సమితి సమావేశం చేతనే పని జరిపించుకోవడానికి ఈ తీర్మానం ఉపయోగపడింది. మండలిలో ఏడుగురు



సమితిలో భారత ప్ర
అమెరికా

ప్రపంచ దేశాలమధ్య తగాదాలు రాకుండా, తగాదాలువస్తే మరి ముదిరిపోకుండా, పదకొండేళ్ళ క్రితం స్థాపించబడింది.

కాని ఇంతకాలమూ సమితి అగ్రరాజ్యాల వాగ్యుద్ధాలకూ, ధర్మపన్నాలకు వేదికగా మాత్ర వచ్చాయనీ, సమితి అవసరం వచ్చినప్పుడు దాన్ని త్రోసిరాజని వ్యవహరించాయనీ అల్పరాజ్యాలు అభిప్ర అగ్రరాజ్యాలు, ఇంకా ఎన్నో అల్పరాజ్యాలు కలిసి, దురాక్రమణను ఖండించి సమితిని నిజమైన సైన్యం ఏర్పాటు చేస్తోంది.

ఆశాజనకమైన ఈ పరిణామానికి తెరవెనక సూత్రధారి ఒకరున్నారు, ఆయనపేరు డాగ్ ఈ వ్యాసంలో చదవండి.

డాగ హామర్ షెల్డ్



సమితిసేనకు సేనాని

ఇ. ఎల్. ఎమ్. బర్న్స

వ భ్యులు తీర్మానాన్ని ఆమోదించారు. వీ టో లేని సర్వసమావేశం జరగడానికి వీలు చిక్కింది.

కెనడా తీర్మానం

సర్వసమావేశంలో హామర్ షెల్డ్ 'కనేడి' యన్ విదేశాంగమంత్రి లెసర్ పియర్సన్ చేత మరొకతీర్మానం ప్రవేశపెట్టించారు. ఐక్యరాజ్యసమితి ఒకసైన్యాన్ని తయారు చేయడం ఆ తీర్మానలక్ష్యం. అసలు ఇటువంటిసైన్యం ఒకటి అవసరమని చాలామంది చాలాకాలంగా చెబుతూవచ్చారు. కాని అది సాధ్యమైనపని అని ఎవ్వరూ కలలో కూడా అనుకోలేదు. అయితే ఈజిప్టుసమస్య క్లిష్టదశలో అడుగు పెట్టడంతో, అసాధ్యమనుకున్నది సాధ్యమై కూరుకుంది.


వీటో; డిటో

సమితి ఇంతకాలమూ డిబేటింగ్ సొసైటీ సా సరదగా వ్యవహరిస్తూ వచ్చింది అయా దేశాలు తాము కేవలం ధర్మంకోసమే పాటు పడుతున్నామని ప్రచారం చేసుకోడానికి, ఒకళ్లమీద ఒకళ్లు దుమ్ము జల్లుకోడానికి, ప్రపంచ ప్రజల కళ్లలో కారం జల్లడానికి వేదికగామాత్రమే సమితి ఉపయోగపడింది. అనేక క్లిష్టసమస్యలు ఉత్పన్నమైనప్పుడు 'వీటో' చేసేరాజ్యాలు ఉండడంమూలంగా భద్రతామండలి, అమెరికాకు డిటో అనేరాజ్యాలు అనేకం ఉండడం మూలంగా సమితి సర్వసమావేశమూ ఎందుకూ కొరగాకుండా పోయాయి. తీర్మానాలను ఆమోదించడమేగాని, తీర్మానాలను ఫలితాలుగా అమలుజేసుకోడానికి తగిన దార్ఢ్యం సమితికి లేకపోయింది. అటువంటిది ఈ సారి సమితి ఈజిప్టులో యుద్ధవిరమణ జరగాలని చేసిన ఆదేశమూ, అంతర్జాతీయ సైన్యం నిర్మించాలని చేసిన తీర్మానమూ ఫలించడం ఆశావహమైన విషయమే.

దీనికి అమెరికా వహించిన పాత్రకూడా తక్కువేమీ కాదు. ఈ తీర్మానాలను అమెరికా బలపరిచింది. కొత్తగా సమితిలో సభ్యత్వం పొందిన ఆసియా, ఆఫ్రికాదేశాలనేకం తమ సంఖ్యాబలంతో తోడ్పాటు చేశాయి. దురాక్రమణకు బాధ్యులైనవారు మినహా అధికసంఖ్యాకులు సమితి తీర్మానాలను బలపరిచారు. దీంతో హామర్ షెల్డు పని సుకరమైంది. ఆయనకు సమితి విశేషాధికారాలివ్వడం చూస్తే ఆయనపై వ్యక్తిగతంగాకూడా సమితికి ఎంత నమ్మకమున్నదీ స్పష్టమైంది.

వ్యక్తిగా హామర్ షెల్డ్

సమితికి మొట్టమొదటి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ట్రిగ్వేలీ రాజీనామా ఇచ్చినప్పటినుంచీ, అనగా 1953 ఏప్రిల్ 10 వ తేదీనుంచి డాగ్ హామర్ షెల్డు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈయన అంతకుపూర్వం స్వీడిష్ ఉప విదేశాంగ మంత్రిగా పనిచేసి, అంతర్జాతీయ రాజకీయాల్లో మంచి అనుభవం గడించారు. 51 ఏళ్లున్నా ఈయన యువకుని వలె కనిపిస్తారు. వీరికుటుంబం స్వీడన్‌లోని గొప్ప కుటుంబాల్లో ఒకటి. హామర్ షెల్డ్ తండ్రి



...నిధి కృష్ణమీనన్,

ప్రతినిధి హెన్రీ కాబట్ లాడ్.

...రాజ్యాలకు అగ్రరాజ్యాల భయం లేకుండా శాంతిరక్షణ చేసే మహదాశయంతో ఐక్యరాజ్యసమితి

...ఉపయోగపడిందని, తమ స్వార్థాలకు అడ్డం రానంతవరకే అగ్రరాజ్యాలు సమితిని బలపరుస్తా...

...వస్తాయి. అయితే ఇటీవల రెండు అగ్రరాజ్యాలు దురాక్రమణ జరిపినప్పుడు మరో రెండు...

...శాంతిరక్షణ సంస్థగా రూపొందించాయి. మధ్యప్రాచ్యంలో శాంతిరక్షణకు సమితిపేరిట అంతర్జాతీయ...

...హామర్ షెల్డ్. సమితి కార్యదర్శిగా ఆయన చేసిన అపూర్వకృషి, సమితి కీర్తి నెలా కాపాడింది...

సమితి ప్రతిష్ఠ కాపాడిన హామర్ షెల్ట్

మొదటి ప్రపంచ సంగ్రామ కాలంలో స్వీడన్ ప్రధానమంత్రిగా ఉండి స్వీడన్‌ను తటస్థరాజ్యంగా రూపొందించాడు. హామర్ షెల్ట్‌కు చిన్నప్పటినుంచి ఏకాంతంగా గడపడమే ఇష్టం. కొండలెక్కడం, సైకిల్ తొక్కడం ఆయన అభిమాన క్రీడలు. అభిరుచి ఎక్కువగా ఆధునికకవిత, ఆధునిక చిత్రకళలవైపు మొగ్గుతుంది. ఎదుటివాణ్ణి దిగ్భ్రాంతి పొందించే నిష్పాక్షిక వైఖరి ఆయన స్వభావంలో ఉన్నది. 31వ ఏటికే ఆయన ఆర్థికశాఖ ఉపకార్యదర్శిగా, 36వ ఏటికల్లా బ్యాంక్ ఆఫ్ స్వీడన్ అధ్యక్షుడుగా నియమించబడడానికి తగినంత ఆర్థిక శాస్త్ర పరిజ్ఞానము, పరిపాలనా దక్షత సంపాదించారు.

ఏ ఆడంబరం, పటాటోపం లేకుండా పని చెయ్యడం ఆయనకి ఇష్టం. "దేశానికి, లేక ప్రపంచానికి స్వార్థరహితంగా సేవచేసే జీవితమే సుఖమైన జీవితం. ఈ సుఖజీవితం కోసం అనేకమైన వ్యక్తిగత సుఖాలను త్యాగం చేయవలసి ఉంటుంది." అని ఆయన ఒకసారి అన్నారు. అనామకంగా ఉండడంలోని సుఖాన్ని కూడా త్యాగం చేస్తేగాని సేవాజీవితం గడపడం సాధ్యంగాదని ఆయన గ్రహించారు.

సమితిలోని అన్ని దేశాల ప్రతినిధుల విశ్వాసాన్ని చూరగొనడానికి హామర్ షెల్ట్ చేసిన కృషి ఫలించింది. ఏ దేశపు ప్రతినిధి ఎటువంటివాడో, అతని అభిప్రాయాలెలాంటివో అన్నీ ఆయన కరతలామలకం చేసుకున్నారు. సమితి భవనంలోని 38వ అంతస్తులో ఉన్న తన ఆఫీసులో కూర్చునే, సమితికి సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని, ప్రతి పెద్ద విషయాన్ని ఆయన ఆకళింపు చేసుకుంటారు. తాను కేవలం సమితి చెప్పింది చెప్పినంతవరకూ, చెప్పిన విధంగా మాత్రమే చేసే ఏజెంటునని ఆయన అనుకోరు. సమితి ఆయనకొక పని అప్పగిస్తే, ఆ పని జయప్రదంగా నెరవేర్చడానికి ఏ విధానం అనుసరించవలసివస్తే ఆ విధానాన్ని స్వయంగా అనుసరిస్తారు. అయితే అవసరానికి, పరిస్థితికి తగినంత అధికారమే తనకివ్వమంటారు తప్ప ఎక్కువ అధికారాలివ్వమని ఆయన కోరరు.

హామర్ షెల్ట్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని నార్వే, పశ్చిమ జర్మనిలనుంచి సూచనలు వచ్చాయి.

"హామర్ షెల్ట్ సమర్థుడని బుజువవడమే కాదు. రాత్రింబగళ్లు, రోజుకు ఒకటి రెండు గంటలు మాత్రమే నిద్రపోతూ, రోజల్లా పనిచేస్తూ, చేసేది బండపని కాకుండా వివేకంతో, దీక్షతో పనిచేస్తూ ఎంత శరీర శ్రమకైనా తాను ఓర్చుకోగలనని ఆయన బుజువు చేశారు. ఆయన శ్రమ సహిష్ణుత ప్రపంచంలో దాదాపు అద్వితీయమైనది," అని అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ దంతటివాడు స్వయంగా ప్రశంసించారు.

యుద్ధమూ, శాంతీ

లెస్టర్ పియర్సన్ తీర్మానాన్ని సమితి ఆమోదించి, 48 గంటలలోగా ఆచరణలో పెట్టడానికి ప్లాను వెయ్యాల్సిందని హామర్ షెల్ట్‌ను ఆదేశించింది. వెంటనే ఆయన ఆ పనికి ఉపక్రమించారు. ఇంతలో యుద్ధ విరమణ చేస్తున్నామని ఇస్రేలీలు వర్తమానం పంపారు. చేస్తున్న పని ఆపేసి హామర్ షెల్ట్ ఈడెన్, మోలేకు యుద్ధ విరమణ చేయవలసిందని విజ్ఞప్తి పంపించారు. ఒక గంట తరవాత భద్రతామండలి సమావేశానికి హాజరై పోలీసుదళం ప్లానును సమితి ఆమోదించగానే యుద్ధం విరమిస్తామని బ్రిటన్, ఫ్రాన్సులు పంపిన సమాధానాన్ని సభ్యులకు తెలియజేశారు. ఆ తరవాత తొమ్మిది గంటల్లో బ్రిటన్, ఫ్రాన్సులు యుద్ధం విరమిస్తున్నట్లు బ్రిటిష్ ప్రతినిధి సర్ పియర్సన్ డిక్సన్ హామర్ షెల్టుతో చెప్పారు.

ఆమర్నాడే హామర్ షెల్ట్ తన సైన్యం సమీకరించ నారంభించారు.

ఒక వారంలో 8 దేశాలనుండి అయిదు వేలమంది సైనికులు సిద్ధమయ్యారు. ఈ దేశాలు కెనడా, కొలంబియా, డెన్మార్కు, ఫిన్‌లెండ్, ఇండియా, నార్వే, స్వీడన్, యుగోస్లావియా.

ఈ సైన్యాన్ని ఈజిప్టు వెళ్ళడానికి ముందు నేపుల్స్‌వద్ద కపాడిచినో విమానాశ్రయంలో దిగనివ్వడానికి హామర్ షెల్ట్ కోరిన మీదట ఇటాలియన్ ప్రభుత్వం అంగీకరించింది. అక్కడినుంచి ఈజిప్టుకు సైనికులను తీసుకువెళ్ళడానికి స్విస్ ప్రభుత్వం తమ విమానాలను సప్లయి చేసేట్లు కూడా ఆయన ఏర్పాటు చేశారు. భారతీయ సైనికులను, డేనిష్, నార్వేజియన్, స్వీడిష్, కొలంబియన్, ఫిన్నిష్ సైనికులను ఆయా దేశాలనుండి ఇటలీకి విమానాలలో చేర్చడానికి అమెరికా ఒప్పుకుంది. అక్కడినుంచి ఈజిప్టుకు వెళ్ళేందుకు తటస్థ రాజ్యమైన స్విట్జర్లెండు విమానాలనే ఉపయోగించడంలో హామర్ షెల్ట్ రాజనీతిజ్ఞత వ్యక్తమవుతుంది.

ఇక ఈ సైన్యానికి యూనిఫారములు, ఆహారం, ఆయుధాలు, వగైరా సప్లయి చేయడం పెద్ద సమస్య. ఈ పనిని హామర్ షెల్ట్ రాల్ఫ్ బంచ్‌కు అప్పగించారు. సైన్యాధిపతిగా కెనెడియన్ జనరల్ బర్న్స్‌ను నియమించారు.

ఈజిప్టుపై యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్సులు 80 వేలమంది సైనికులను ప్రయోగించాయి. ఇస్రేల్ సైన్యం సంగతి చెప్పనక్కరలేదు. ఇంత పెద్ద సైన్యాలను ఈజిప్టు పైకి రాకుండా నిరోధించే కార్యభారం వివిధ దేశాలనుండి సేకరించబడుతున్న ఆరువేలమంది సైనికులమీద పడింది. వీరిలో 700 మంది భారతీయ సైనికులు కూడా ఉంటారు.

సమితి సైన్యం కర్తవ్యం

ఇలాగ ఈజిప్టులో సూయజ్ కాలవ ప్రాంతంవద్ద సమీకరించబడిన సమితి సైన్యం ఏం చేస్తుంది, ఏం చేయాలి అనే విషయం ఇంతవరకూ అసందిగ్ధంగా తేలలేదు.

ప్రపంచ దేశాలలో అత్యధిక భాగం బ్రిటిష్, ఫ్రెంచి, ఇస్రేలీ దురాక్రమణను నిరసించాయి. ముఖ్యంగా అమెరికా బ్రిటిష్, ఫ్రెంచి చర్యలకు తీవ్రమైన వైముఖ్యం కనబరచింది. మధ్యప్రాచ్యం నుండి పెట్రోలు సరఫరా ఆగిపోయిన కారణంగా విషమ పరిస్థితిలో పడిన బ్రిటన్, ఫ్రాన్సులకు పెట్రోలు సహాయం చేయడానికి, ముందు ఆ రెండు దేశాలు తమ సైన్యాలను ఈజిప్టునుండి ఉపసంహరించాలని షరతు పెట్టింది. ఈ కారణంవల్ల బ్రిటన్, ఫ్రాన్సులు లొంగిరాక తప్పలేదు. ముఖ్యంగా బ్రిటన్‌లో రాజకీయంగా అవాంతర పరిస్థితి ఏర్పడింది. సర్ ఆంథొనీ ఈడెన్‌కు శారీరకంగానో, రాజకీయంగానో మొత్తానికి సుస్తీ చేసింది. ఆయన కొన్నాళ్లపాటు జమైకాలో విశ్రాంతి తీసుకునే నిమిత్తం వెళ్ళిపోయారు. ఈలోగా తాత్కాలిక ప్రధానిగా వ్యవహరిస్తున్న బట్లర్, మొదట తమ సైన్యాలను ఉపసంహరించుకోమని ప్రగల్భించినా, చివరకు తమ వైఖరి మార్చుకున్నట్లే కనిపిస్తోంది.

సంహారం; ఉపసంహారం

ఫ్రెంచి విదేశాంగ మంత్రి క్రిస్టియన్ పినో ఇటీవల లండనువెళ్ళి బ్రిటిష్ ప్రభుత్వంతో సంప్రదించారు. ఈ సంప్రదింపుల ఫలితంగా ఉభయ సైన్యాలను క్రమశః ఉపసంహరించడానికి పథకం తయారైనట్లు వార్త వెలువడింది. బ్రిటన్, ఫ్రాన్సు వగైరా

(56 వ పేజీ చూడండి)

మంత్రాలు: నమ్మకాలు

★ మంత్రశాస్త్రవేత్త శ్రీ యనమండ్ర దక్షిణామూర్తి ★

మహా మంత్రవేత్త కీ॥ శే॥ యనమండ్ర దక్షిణామూర్తిశాస్త్రిగారు కొవ్వూరు కాపురస్థులు.

మహా మంత్రానుష్ఠానపరులు. వీరు అయిదారు సంవత్సరములు హిమగిరి పర్వతముల వద్దను, హరిద్వారము వద్దను వుండి జపతపాదులు, గురు శుశ్రూష చేసి 1930 ప్రాంతాలకు స్వగ్రామము కొవ్వూరు చేరారు. వారు 1942 ప్రాంతాలలో జీవన్ముక్తులయ్యారు.

వారి జీవితములో అనేక అద్భుత బాధలు, పాముకాట్లు, వృశ్చికబాధలు, గ్రహబాధలు మంత్రశక్తితో నివారణచేసిరి. దీర్ఘవ్యాధులు విభూతి జలముతో నయము చేసినారు. ముఖ్యముగా మూర్ఛలు, ఫిట్సు, ఔషధములతో ఎంతకాలమునకు నివారణ కాని వ్యాధులు మాన్పిరి.

నేను ఒకసారి తూర్పు గోదావరిజిల్లా డెలా గన్నవరములో మా బంధువుల ఇంటికి శుభకార్య సందర్భములో వెళ్లితిని. మా బంధువు ఇంట్లో గత 2, 3 సంవత్సరముల నుంచి రాత్రుల్లు లేక పగలు ఎవరో విసిరినట్లు 10, 12 కంకరరాళ్లు ధబాధబా పడడము జరుగుచున్నది. మా వాళ్లు దెయ్యాలు, భూతాలు పడేస్తున్నవని గట్టి నమ్మకములో వున్నారు. మా బంధువుల తాలూకు ఒక ఆయన చనిపోయినట్లు, ఆయన తన ఆస్తి తింటూ తనబిడ్డను అన్యాయం చేస్తున్నారని రాళ్లు రువ్వుతున్నట్లు సోదెలోను, ఇతర భూతవైద్యుల వలన తెలుసుకొని అరికట్టలేక పోయారు.

పెళ్లి రెండవరోజున మేము, చుట్టాలు, వారి మిత్రులు గ్రామములో జనము దాదాపు 200 పైన రాత్రి 9 గంటల ప్రాంతాన్ని భోజనాలు చేస్తున్నాము. పందిరినిండా గ్యాసులైట్లు, పెట్రోమాక్సులైట్లు యాభై ఆరు దేదీప్యమానముగా వెలుగుచున్నవి. భోజనముసగములో దభాదభా 10,12 రాళ్లు పందిరి మీదెవరో విసరినట్లు పడ్డవి. అంతా గొల్లుమంటూ లాంతర్లు, కర్రలు పట్టుకొని ఇంటికి అరఫర్లాంగు వెతికాము. ఒక మనిషి కాని, పిట్టగాని కనపడలేదు. ఆరోజు పౌర్ణమి ముందర దశమి కావలసినంత చంద్రకాంతి గ్రామముఅంతా గగ్గోలుఅయినది మరునాడు దైవవశాత్ శ్రీ యనమండ్ర దక్షిణామూర్తి గారు ఏదోపనిమీద రాజోలు వెళుతు గన్నవరం గ్రామంలో ఎరుగున్న మిత్రుని ఇంట ఇంచుక విశ్రాంతికై వచ్చారు. విషయము తెలుసుకొని మిత్రుని ప్రోద్బలమువలన మా బంధువు ఇంటికివచ్చినారు. అన్ని సవిస్తరముగా తెలుసుకొని మరునాడు ఉదయం తెల్లవారుజామున నే స్నానసంధ్యావందనములు, అనుష్ఠానము చేసుకొని ఉదయం సూర్యోదయమునకు గృహమునకు వచ్చారు. వచ్చినది లగాయతు మా భోజనాలు అయే 11½ గంటలవరకు ఒక మూల మౌనముద్రలో జపమాచరించారు. విభూతి, మిరియాలు ఇచ్చి ఇంటిచుట్టు, ఆవరణమంతా ఆ నీళ్లు వారే స్వయముగా జల్లారు. ఆ రాత్రియందు అక్కడనే వున్నారు. రాళ్లు పడలేదు. నేటివరకు మావాళ్ల ఇంటిమీద అట్టిరాళ్లు పడలేదు.

తణుకు ప్రాంతములో ఒక చిన్నగ్రామములో రాత్రి 7 గంటలవేళ ఒకనికి కాలవగట్టుమీద వస్తుండగా త్రాచుపాము కరిచినది. శ్రీ శాస్త్రిగారు ఆ గ్రామములోనే వున్నారు. వెంటనే పాము కరిచిన వ్యక్తి వద్దకు వీరిని తీసుకువెళ్ళారు. వారు మంత్రము ఉచ్చరిస్తూ, ఉప్పు మంత్రించి దూరముగా పడవేసిరి. సుమారు 20 నిముషములలో గోధుమవర్ణముగల ఒక గజమున్నర త్రాచు చుట్టూవున్న జనములో ఎవరి కాలుకు తగలకుండావచ్చి కాటువేసిన స్థలమున కాటువేసి గబగబవెళ్ళి 50 గజాలలో శిరస్సు సర్వేరాయికి బాదుకుని చచ్చినది. మనిషి ఇప్పటికి బాగున్నాడు.

అనపర్తిలో మా స్నేహితు లమ్మాయికి 20 సం॥ వయస్సు పైన వుంటుంది. మూర్ఛలో, ఫిట్సో తెలియదు. విరుచుకుపడిపోయి, కాళ్లు చేతులు నేలను బాది, మాటలేకుండా కదలకుండా 45 గంటలు వుంటుంది. ఎన్నో మందులు వాడారు. గుణము కనపడలేదు. శ్రీ దక్షిణామూర్తి గారిని తీసుకువెళ్లి మూడురోజులు తీర్థము ఇప్పించారు. నయమైనది. ఇప్పుడు అమ్మాయికి 30 సం॥ వయస్సు. ముగ్గురు బిడ్డలతల్లి. సలక్షణముగ కాపరము చేసుకుంటున్నది.

నాకు శ్రీ శాస్త్రిగారి మంత్రశక్తి ప్రభావము నిదర్శనపూర్వకముగా నమ్మకము గలిగించినది.

కాశ్యప, తెనాలి.

* * *

పాము విషం విరిగింది

మా గ్రామంలో అవుకి గడ్డి వేస్తున్న సమయంలో గడ్డిలో నుండి గజం పొడుగు త్రాచుపాము క్రిందపడి లేచి నా చిటికెనవ్రేలు పట్టుకుని కరచింది. నా చెయ్యి నిముష నిముషానికి బరువెక్కడం మొదలెట్టింది - గుండెలు కొంచెం బరువు ఎక్కాయి శ్వాస తీసుకోవడం కొంచెం కష్టమైంది. అప్పటికే మధ్యాహ్నం ఒంటిగంట అవడంవల్ల మా ప్రక్క గ్రామం గోటేరులోనున్న మంత్రగాని వద్దకు బయలుదేరాను. నడిచే వెళ్లాను. చేతిబరువు గుండె బరువు, నిద్రవస్తూన్నప్పుడుండే ఒక విధమైన జోగు ఎక్కువయ్యాయి. నేను భయపడలేదు. ఇంటికెళ్లడం కంటె మంత్రగాని దగ్గరకే వెళ్ళడం మంచిదని వెళ్ళాను. దారిలో కొంతమంది మంత్రగాళ్లు కలిశారు. కానివాళ్లు గోపిశెట్టి సోమన్న దగ్గరకెడదాం, అతనిమంత్రం మంచిదనిచెప్పారు. అక్కడికే వెళ్లాను. వెంటనే మిరియాల గంధం నా రెండు కళ్లలోను పెట్టాడు. నిద్ర మత్తువలె ఉన్నజోగు తగ్గింది. కాని చేతి బరువు, గుండె బరువు తగ్గలేదు. అంటే ఇంకా విషం విరిగిపోలేదు. నాకు స్పృహమాత్రం మొదటినుండి బాగానే ఉంది. వెంటనే మంత్రం వెయ్యడం ప్రారంభించి మధ్యమధ్య "నాగముషిణి చెక్కగంధం" నాకమని ఇస్తూండే వాడు. అది చప్పగా వుండేది. ఏ రుచీ లేదు. గంటన్నరఅయ్యాక చెయ్యి, గుండె బరువుతగ్గింది. అంటే విషం విరిగిపోయింది. ఆతర్వాత మళ్ళీ మరి ఒక

★ మంత్రాలు, నమ్మకాలు ★

హరి నాగముషిణి చెక్క గంధం ఇచ్చాడు. అది నాకి చూస్తును గదా! అమిత చేదుగా ఉంది. మొదటి ఏ రుచీలేని ఆగంధం ఇంత చేదుగా ఎలావుందో నాకర్థం కాలేదు మంత్ర ప్రభావంవల్ల విషం పోయాక గాని దాని రుచి నాకు తెలియలేదన్నమాట. రుచి తెలియగానే మంత్రం మానేసి ఇంటికి వెళ్లమన్నాడు. రాత్రి భోజనం చెయ్యవద్దని, నిద్రపోవద్దని చెప్పాడు. అలాగే చేశాను. తర్వాత మామూలుగానే ఉంటున్నాను. ఇది 1952 నవంబరులో జరిగింది. మంత్రాలకు ప్రభావం లేదంటారా?

తంగిరాల బాలగంగాధర శర్మ
ఇరగవరం. (ప. గో. జిల్లా)

* * *

పాముకాటుకు చెంపపెట్టు

వర్జిపర్తి జోగులు అనే మా గ్రామం చాకలివాని తమ్మునితో కలిసి శలాపావద్ద గులలపాడు అనే గ్రామములో కోళ్లు కట్టూయుండగా వాటిని చూచుటకు వెళ్ళి వాటిని చూస్తూ అలానిల్చొండి పోయేసరిక్కి ఆ ప్రక్క మొగలిపొద ప్రక్కపుట్టలో నుంచిపాము ఒకటి తమ్ముని పాదముపై కాడిచినది.

వెంటనే వాడు స్పృహ తప్పి చొంగలు కారుస్తూ పడిపోయినాడు. అప్పట వారంతా చేరేసరిక్కి అపాము ప్రక్కపొదలోకి వెళ్ళిపోయినది. ఆచాకలివాడి అన్న ఏడుస్తూ ఉండగా అప్పట వారంతా ఆ పొరుగు గ్రామం (నగరంపలి) లో మంత్రిగాడు ఉన్నాడు వెంటనే వెళ్లమని సలహా చెప్పారు. వాడు వెంటనే నగరంపల్లి వెళ్లి ఆ మంత్రిగాని యిల్లు చేరాడు. మంత్రిగాడు కాళ్ళు కడుక్కొని భోజనమునకు వెళ్తున్నాడు. చాకలివాడు గోలుగోలున ఏడుస్తూ తన తమ్మునకు పాముకరచినది అని చెప్పాడు. ఆయన వాడి చెంపపై గట్టిగా ఒకదెబ్బ చరచి "నీవువెళ్ళేసరిక్కి మీతమ్ముడు లేస్తాడు వెళ్లు" మని చెప్పేడు. చాకలివాడు తమ్ముని వద్దకు వచ్చేసరికి వాడులేచి కూర్చొని ఉన్నాడు. ఇది ప్రత్యక్షంగా జరిగిన విషయం. ఇప్పటికి కూడా ఆచాకలివాని పాదము పై పాము కొటుమచ్చ యున్నది. వాడు సురక్షితంగా నేటికికూడా వాడి వృత్తిచేసుకొంటూ యున్నాడు.

ఇలాటి మహాతులు మంత్రాలలో యుండగా నమ్మక పోవడము ఎలాగ?

గరుగు శ్రీరామమూర్తి
—ఆమదాలవలస

మంత్రంవల్ల కాయలుకాదు, పళ్లురాలాయి!

కోనసీమలో విశ్వేశ్వరాగ్రహారం అనే గ్రామం వుంది. ఒక పాములవాడు అడుక్కుంటూ ఒక యింటికివెళ్ళి శేరు బియ్యం పెట్టకపోతే పాముని వదులుతానని యిలాలిని బెదిరించాడు. ఆ యింటాయన మంచి నిష్ఠ గల బ్రాహ్మణుడు. లోపల జపం చేసుకుంటున్నాడు. ఆమె వెళ్ళి భర్తతో యీ సంగతి చెప్పింది. ఆయన వదలమన్నాడు. పాము తిన్నగా లోపలికివచ్చి ఆయన కెదురుగా ఆగిపోయింది. ఎంతకీ పాము తిరిగిరాకపోవటంతో పాములవాడక్కడ వున్న ఒక నూతిదగ్గర నీళ్లతోడి తాగెయ్యటం మొదలుపెట్టాడు. లోపల శాస్త్రిగారికి నీటితో కడుపుబ్బటం మొదలుపెట్టింది. వెంటనే ఆయన భార్యచేత చాకు తెప్పించి వేలుచివర చిన్న గాటు పెట్టుకున్నాడు. అందులోనుంచి పాములవాడు త్రాగిన నీరంతా బయటికి వచ్చేసింది. పాములవాడు, బ్రాహ్మణుడింక చచ్చిపోయివుంటాడని వచ్చేసరికి ఆయనా బైటికి వస్తున్నాడు. పాములవాడు నిర్ఘాంత పోయి కాళ్లమీదపడి క్షమాపణకోరాడు. ఆ వూరు మళ్లీ రాకుండేలా హెచ్చరించి ఆయన వదిలేశాడు.

ఆవూళ్లోనే యింకోకసారి ఒక సన్యాసి ఒక యింటిదగ్గర భిక్ష పెట్టమన్నాడు. ఆ యింటావిడ మడికట్టుకున్నానని, మళ్లీ రమ్మని చెప్పింది. ఒక పొట్లం యిచ్చి అందులో కుంకం చాల పవిత్రమైందని, పెట్టుకోమని ఒక రోలుపై పెట్టి వెళ్ళిపోయాడు. ఇంట్లో మడిపని పూర్తయ్యాక ఆమె వచ్చి చూచేసరికి రోలు గాలిలో తేలుతూవుంది. ఆమె భయపడి చుట్టు ప్రక్కలవాళ్లను పిలచింది. వాళ్ళు కర్రతో ఆ పొట్లం క్రిందికి తోసేసరికి రోలు నేల మీద పడింది. వాళ్లంతా ఆమెకు ధైర్యం చెప్పి ఆ పొట్లం తిసుకొమ్మన్నారు. ఆమె పొట్లం తీసుకుని తిన్నగా స్మశానంకేసి వెడుతోంది. కూడా కర్రలతో చాలామంది వెళ్ళారు. స్మశానంలో సన్యాసి కూర్చుని వున్నాడు. ఆమె అక్కడ ఆగింది. వెంటనే ఆమె చేతిలోని పొట్లం క్రిందపారవేయించి దొంగసన్యాసిని చావగొట్టి పళ్ళన్నీ వూడబీకారు.

శ్రీపాద హనుమద్రామకృష్ణశర్మ
—విశాఖపట్టణం

★

గర్వభంగం

బండి దిగి, "అన్నయ్యా" అంటూ గుమ్మంలో లక్ష్మి అడుగు పెట్టిందో లేదో, "ఎవరూ?" అంటూ లోపల్నుంచీ సుజాత కేక వేసింది. అప్పుడే గుమ్మం, గాలి ఎక్కువగా వీచినందువల్ల కాబోలు, ఒకరి గొంతు మరొకరికి వినిపించలేదు. తలుపులు గట్టిగా తట్టి, మరొకసారి గొంతెత్తి, దీర్ఘంగా, "అన్నయ్యా" అన్న తరువాత గాని సుజాత వచ్చి తలుపులు తీయలేదు. సుజాత ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ, "నీవా? ఎప్పుడొచ్చావ్?" అని ప్రశ్నించింది. ఏకవచన ప్రయోగం, పేరు పెట్టి పిలవకుండా, కొట్టొచ్చినట్టు మాటాడిన సుజాత ప్రవర్తన కొంత అయోమయాన్ని కలిగించింది లక్ష్మికి. అయినా ఇది పట్నవాసం - ఇక్కడ ఇంతే నేమోనని శంకించి, "ఇప్పుడే వదినా, రావడం. అన్నయ్యేడీ?" అని తన మామూలు ధోరణిలో ప్రసంగించింది లక్ష్మి - ఉత్త పల్లెటూరి మనిషి కనుక. "వారు లేరు. ఆఫీసుకు వెళ్లారు" అని ముక్తసరిగా జవాబు చెప్పి లోనికి వెళ్ళింది సుజాత.

లక్ష్మి కొద్దిసేపు నిలబడి, ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంది. తమ్ముడు సామాను సర్దుతున్నాడు. లోనికి వెళ్ళిన సుజాత తిరిగీ హాల్లోనికి రాలేదు ఏదో కొత్తవారింటికి వచ్చినట్టయింది లక్ష్మికి. తమ్ముడు రంగడు ధైర్యంచేసి, లోనికి వెళ్ళి చెంబుతో నీళ్లు తెచ్చాడు. బయట వరండాలో కాళ్లూ, మొహం కడుక్కుందామె. ఆ తరువాత ఆమె తటపటాయిస్తూ, చుట్టూ గోడల వైపూ, కిటికీల వైపూ, కర్టెన్ల వైపూ, ఫోటోల వైపూ చూసుకుంటూ, అడుగులో అడుగు మెల్లగా వేసుకుంటూ లోనికి వెళ్లింది. పడకగదిలో పట్టెమంచంమీద పండుకుని కాళ్లు ఆడించుకుంటూ, నిద్ర పోతున్నట్లు నటిస్తున్న సుజాతను చూసింది. బహుశా పట్నవాసం అలవాటేమో ఇది అని, అనుకుని, మెల్లిగా వంటగదివైపు నడచింది. పొయ్యిలో పిల్లి పండుకుని హాయిగా నిద్రపోతూంది పాత్రలు ఎక్కడివక్కడే అపరిశుభ్రంగా పడిఉన్నాయ్. లక్ష్మికి గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. ఆమె తిరిగీ హాలోకి పరుగెత్తుకుంటూ వచ్చింది. వెంట తెచ్చిన పళ్లు తిని, నీళ్లు త్రాగి, హాల్లోనే చుట్టూరా పరికిస్తూ కూర్చుని, తమ్మునితో కాలక్షేపం చేసిందామె.

"ఎప్పుడొచ్చావ్ చెల్లాయ్? ఏమిటి విశేషాలు? నాన్న బాగున్నాడా?" అంటూ అయిదుగంటలప్పుడు రామారావు గుమ్మంలో అడుగు పెట్టిన తరువాతగాని లక్ష్మికి ఆ ఇల్లు తన అన్నగారి దనిపించలేదు. కుశల ప్రశ్నలయిన తరువాత "భోం చేశావేమే?" అనడిగాడు రామారావు. "ఆఁ... భోం చేశా నన్నయ్యా. సుజాత వదిన చాల మంచిది. ఇక్కడే భోంచేశాను" అని పూర్తిగా బొంకిందామె.

* * *

చెల్లెలు వచ్చిందన్న సంతోషంకొద్దీ ఆ వేళ సినిమాప్రోగ్రాం వేశాడు రామారావు.

హెచ్. ప్రకాశం

కొత్త పిక్చరు రావడం ఆరోజు మరీ విశేషం. కాని, ప్రతిసారీ కొత్త పిక్చరు వచ్చిన మొదటిరోజే వెళ్లి చూడాలనే పట్టుదల ఉన్న సుజాత ఈసారి ఆసక్తి చూపలేదు, సరికదా, పిక్చరు బాగాలేదనో, తనకు తల నొప్పుతూందనో, ఏవో అడ్డుసాకులు చెప్ప సాగింది ఆమెను పిక్చరుకు వెళ్లేందుకు ఒప్పించేసరికి 'తల ప్రాణం తోకకు వచ్చి' నట్టయింది రామారావుకు కొత్త ఫాషను గాజులూ, రిబ్బన్లూ వగైరా కొని ఇచ్చాడు తన చెల్లెలికి. తమ్మునికి కొత్త బట్టల్ని కొన్నాడు.

ఇదంతా కోపాన్ని రగుల్కొలిపి. ఉద్రిక్తురాల్ని చేసింది సుజాతను. పళ్లు పటపట కొరికి, తల్లోని ఘుమఘుమ సువాసన నిస్తున్న మొగలి పూలను విసిరి బయట పారేసింది సినిమాలో. ఇది ఒక్క లక్ష్మి తప్ప మరెవరూ చూడలేదు. మొగుడు ఉన్నప్పుడు ఏదో ముక్తసరిగా మాటాడ్డం తప్ప, విశేషించి లక్ష్మితో ఎక్కువ మాటాడనే లేదు సుజాత. ఒకటి, రెండుసార్లు తనే పలకరించి చూసింది లక్ష్మి. కాని, ఏదో ఒక సాకు పెటి తప్పించుకుని, మాటాడ్డం మానేసింది సుజాత.

సినిమా చూచి, వచ్చిన తరువాత భోంచేసి చెయ్యి కడుక్కునేందుకని వెడుతూండగా లక్ష్మి కాలు పొరబాటున నీళ్ళు త్రాగే గాజు కప్పుకు తగిలి, ముక్కలయింది. "పల్లెటూరి మొరటు వాళ్లకేం తెలుసు, నాజూకు పనులు?" అని సుజాత దెప్పి పొడిచింది లక్ష్మిని. లక్ష్మి ఏమీ సమాధానం చెప్పలేదు- మనసు నొచ్చుకుంది. "సుజా, చాల్లే, ఊరుకో" అని రామారావు అడ్డుపడడంతో ఆమె ఊరుకుంది.

తనువచ్చి అన్నగారింట ఉండడం సుజాత కిష్టం లేదని గ్రహించడానికి ఎక్కువ కాలం పట్టలేదు లక్ష్మికి - పల్లెటూరి మనిషయినా. మూడోరోజే స్వగ్రామానికి బయలు దేరింది. "అదేమిటి చెల్లాయ్? వచ్చిన మూడోరోజే వెడతానంటున్నావ్? వీల్లేదు" అని రామారావు అడ్డుతగిలాడు. "నాకేం అన్నయ్యా, ఇక్కడ సుఖంగా ఉంటున్నా, వదిన చాల మంచిది. కాని, అక్కడ నాన్నను సరిగా చూసేవాళ్ళు లేరు. ఒక్క అమ్మ ఎంతకని చూస్తుంది? కావలిస్తే రంగడు ఇక్కడే ఉంటాడు" అని లక్ష్మి అన్న మాటలు విని సుజాత చాలా ఆశ్చర్యపోయింది. కాని, మొరటు మనిషికి తెలివితేట లెక్కడివని తనకు తాను సర్దుకుంది. రంగడు ససేమిరా ఒక్క క్షణంకూడా ఆ ఇంట ఉండనన్నాడు.

* * *

ఎవరి అవసరమూ లేకుండా రోజులు జరిగిపోవడం అసంభవం. ఒకరోజు మధ్యాహ్నం సుజాత నిల్చున్నదల్లా మూర్ఛవచ్చి కిందపడి పోయింది అప్పటి నుంచీ ఆమెకు కీళ్లనొప్పులు ఆరంభమైనాయి ఎంతమంది డాక్టర్లకు చూపించినా ఆ నొప్పులు తగ్గలేదు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టాడు రామరావు. కాని, లాభంలేక పోయింది. పెద్దపెద్ద హాస్పిటల్సులో నెలల తరబడి భార్యకు ట్రీట్‌మెంట్ ఇప్పించాడు. ప్రయోజనం శూన్యం కాగా, నొప్పులు ఎక్కువ కాసాగాయి. రామారావుకు దిక్కు తోచలేదు. ఎందరెందరినో సంప్రదించాడు. చివరకు నాటువైద్యులు - ప్రవీణత పొందిన వారి వల్ల వ్యాధి నయంకావచ్చని ఒక పెద్ద మనిషి అతనికి సలహా ఇచ్చాడు.

పదేళ్ల తరువాత స్వగ్రామంలో భార్యా సమేతంగా అడుగుపెట్టాడు రామరావు. ఆ ఊరిలో అతని కేవిధమైన మార్పూ కను

గర్వ భంగం

పించలేదు. మునుపటిలాగే ఎవరి వృత్తుల్ని వారు నిర్వహిస్తున్నారు. కొద్దిగా ఇళ్లు పెరిగాయి. మనుష్యుల్లో వారి ప్రవర్తనల్లో, నిత్యజీవితాలలో - ఏది చూసినా ఎప్పటిలాగే ఉంది. రామారావుకు చాలా ఆశ్చర్యం వేసింది. కాదూమరి? క్షణక్షణానికీ మారిపోతూన్న ప్రపంచ పరిస్థితులు (పేపర్లలో!) పల్లెల్ని ఆ గ్రామ జీవితాన్ని కించిత్తు గూడ మార్చలేదు. ఎంత విచిత్రం!


తను పటణానికి వెళ్లి, జీవితం మార్చుకుని వచ్చాడే గాని, పల్లెటూరయిన తన స్వగ్రామం ఎలా మారుతుంది? ఈ విషయం తెలుసుకుని సిగ్గుతో తలవంచుకున్నాడు రామారావు.

* * *

సుజాతకు 'మొరటు వాళ్ళు' కాపురమున్న పల్లెటూరికి రావడం చాలా అవమానకరంగా తోచింది. "ఛీ, ఇదేం కొంప, పేడకంపూ, ఈగలమోత ఇక్కడెలా ఉండగలనూ?" అని అసహ్యంచుకుందామె. కాని, ఏం చేయగలదు? పరిస్థితులకు తల వొగ్గక తప్పలేదామె. తానిప్పుడు లక్ష్మి చేతుల్లో కీలుబొమ్మ. ఏం చేసి, తనను అవమానపరుస్తుందోనని ఒళ్ళంతా భయంతో కంపింప సాగిందామెకు.

కాని, ఆమె అనుకున్నదానికి భిన్నంగా, విరుద్ధంగా జరిగింది. లక్ష్మి ఎంతో ఆప్యాయంగా, ఆదరంగా గౌరవించి, సుజాతకు కావలసిన పరిచర్యలన్నింటినీ ఆమే స్వయంగా చేసింది. పుట్టింలో అడుగుపెట్టినప్పటినుంచీ కంటికి రెప్పలా ఆమెను చూసుకుంటూ వచ్చింది. సుజాత తనను తానే నమ్మలేకపోయింది. ఏ హాస్పిటలులోనూ తను ఇంత సుఖంగా చికిత్స పొందలేదనిపించిందామెకు. ప్రత్యేకమైన గదిలో, చలని వేపచెట్టుగాలి వీస్తూంటే, చిక్కటి పాలు, వెన్న, జున్ను వగైరా సేవించి, నాటువైద్యంతో కీళ్ళనొప్పులన్నీ పోగొట్టుకుంది సుజాత, కొద్ది రోజులకే.

మూడు నెలల కాలం మూడు నిముషాలపాటు గడిచినట్టయింది సుజాతకు. ఆమెకు ఆలోచించిన కొద్దీ లక్ష్మి దేవతలా అగుపించింది. తను అహంభావంతో ఎంత అంధకారంలో, అజ్ఞానంలో ఉన్నదీ తెలిసి రాసాగింది. తిరిగి వచ్చేరోజున. "వదినా, మేం మొరటువాళ్ళం, మాపరిచర్యలు మీకు తృప్తికరంగా లేవనుకుంటాను." అని లక్ష్మి అన్న మాటలు విని, లోలోపల కుమిలిపోయింది సుజాత. ★



బాల తెలివి

రైలుబండి ఆట ఆడ
'బాల' తలచెను!
పీటలన్ని వరుసగాను
పేర్చివేసెను!
మొదటనున్న పెద్దపీట
మీద కూర్చొని
కాళ్ళతోటి నడుప, రైలు
కదలె వెనుకకు!

'బాల' మనసలోన యెన్నొ
తలపులూరెను!
పొగలు గ్రక్కుకొనుచు రైలు
పోవుచుండెను!
ఇంతలోనె ప్రక్కయింటి
'శాంత' వచ్చెను
మంచి చెడ్డ అమ్మతోటి
మాటలాడగ!

రైలుబండి ఆటకొరకు
'బాల' పేర్చిన
వరుసలోని పీటమీద
కూరుచుండెను!

'బాల' మనసు, లేతమనసు
కలతజెందెను!
పానకమున పుడకని లో
లోన తలచెను!

ఎంతసేపు చూచినమరి
'శాంత' లేవదు!
ఆత్రపడెను 'బాల' మనసు
ఆట లాడగ!

పీటమీద శాంతను ఏ
విధమునైనను
లేపవలెను! లేపవలెను!!
లేపవలయును!!!

అందుచేత 'బాల' యిటుల
అన్నదంతట,
"ఏవండీ! మా రైలిది!
లేవవలయును!"

'శాంత' అంత ఇచ్చెనిటుల
సమాధానము!
"అయితే, నే ప్రయాణంబు
చేయనెంచితి!"

అందుపైన 'బాల' వేగ
అడిగెనిట్టుల,
"ఏ ఊరుకు వెళ్ళవలెనో
ఇపుడె చెప్పుడు!"

'శాంత' చెప్పెనప్పుడిటుల
సమాధానము,
"వెళ్ళవలెను నే నిప్పుడు
విజయనగరము!"

"అచ్ఛా! యిదె విజయనగర
మొచ్చివేసెను!
దిగిపొండీ రైలుబండి
వేగమీరలు!"

అని, పలికెను 'బాల' ఎంతో
వినయముగాను!
'శాంత' 'బాల' తెలివికెంతో
సంతసించెను!!

అలపర్తి
వెంకటసుబ్బారావు

★

పిల్లల నాటిక:

వామనుడు

కనుపర్తి వరలక్ష్మమ్మ

పాత్రలు

వామనుడు
బలిచక్రవర్తి
శుక్రాచార్యులు
వింధ్యావళి

[బలిచక్రవర్తి యజ్ఞము చేయుచుండగా వామనుడు ప్రవేశించును]

వామనుడు

రాజా! జయము. జయము.

బలిచక్రవర్తి

(లేచి ఎదురుగాపోయి) వడుగా! నీ వెవ్వరవు? నీవారెవ్వరు?

వామనుడు

నేనెవ్వరిని గాను. నా కెవ్వరు లేరు. ఒంటరివాడను.

బలి

అయిన ఎందుకొఱకు వచ్చితివి?

వామనుడు

మీరు గొప్ప దాతలని వచ్చితిని.

బలి

నిజమే నీకేమి కావలయును?

వామనుడు

నాకు మూడడుగుల నేలకావలయును.

బలి

అయ్యో! చిన్నవాడా నీకు అడుగుటే చేతకాలేదే! ఇంతగొప్ప దాతవద్దకు వచ్చి నీ వడుగవలసినది మూడడుగుల నేలయేనా?

వామనుడు

చక్రవర్తీ! నాకు ఆశలేదు. నేను అడిగిన కొంచెము కాదనక యిచ్చిన నాకదే పదివేలు

బలి

వింధ్యావళీ! బంగారు కలశముతో జలంబు తెమ్ము? ఈ బ్రహ్మచారి కోరిన భూమిదానము చేయుదము.

[ఇంతలో శుక్రాచార్యులు ఆతురతతో ప్రవేశించి చక్రవర్తి వద్దకుపోయి]

శుక్రాచార్యుడు

చక్రవర్తీ! పొరపాటుబడుచున్నావు! పొరపాటుపడుచున్నావు!! ఇతడు నిజముగా బ్రాహ్మణ బాలకుడు కాడు. నిన్ను వంచించి, నీ త్రైలోక్యరాజ్యమును హరించి దేవతలకిచ్చుటకు వచ్చిన శ్రీ మహావిష్ణువు. ఈ కపట వటువుమాట నమ్మకుము. వీనికి భూమిదానము చేయకుము.

బలి

ఆచార్యా! మొదట ఇచ్చెదనని మాటయిచ్చి మరల ఇవ్వకున్న అసత్య దోషము రాదా! నేను ఆడినమాట తప్పజాలను. ఇతనికి భూమిదాన మిత్తును.

వామనుడు

చక్రవర్తీ! నిజము. నిజము. ఆడినమాట తప్పరాదు. నాకిచ్చెదనన్న భూమిని వెంటనే ఇమ్ము.

శుక్రాచార్యుడు

తాను చేసిన దానమువలన తనకే కీడు రానున్నప్పుడు, ఆ దానము చేయకపోయిన దోషము లేదు. అనృత దోషము రాదు.

బలి

ఆచార్యా! తాము నా మేలు గోరి చెప్పిన హితమునకు కృతజ్ఞుడను. కాని దైవనిర్ణయ మేమిటో కాని నాకు అబద్ధమాడుటకు మనసొప్పుటలేదు పూర్వము భూదేవి ఎట్టి హీనునైనను భరించెదను కాని సత్యహీనుని మోవంగజాలనని చెప్పియుండెనుగదా? కావున ఆడి తప్పి భూదేవికి భారము కాజాలను నరకమునకు పోజాలను ఈ వడుగునకు మూడడుగులు భూదానము చేసెదను

శుక్రాచార్యుడు

మహారాజా! నీ మేలుగోరి చెప్పిన మాట వినకున్న నేనేమి చేయుదును? చెడుకాలము దాపురించినవారు తమక్షేమము కోరువారి మాటలను ఆలించరుగదా! నీకు చెడుకాలము వచ్చినది. అనుభవించుము.

బలి

ఆచార్యా! తాము నా మేలు

గోరి చెప్పుచున్నది నిజమే అయినను, అబద్ధమాడుటకు నా మనస్సు అంగీకరించుటలేదు. నేను మాట ఇచ్చిన ప్రకారము ఈ వటువునకు భూమిదానము చేసెదను. నన్ను క్షమించుడు.

శుక్రాచార్యుడు

రాజా! నా మాటను తిరస్కరించితివి కావున, అనతికాలములో రాజపదమును కోల్పోయి భ్రష్టుడ వయ్యెదవు.

[ఆచార్యుడు వెళ్లిపోవును]

బలి

వింధ్యావళీ! స్వర్ణకలశంబుతో జలంబు తెమ్ము!

వింధ్యావళి

అటులనే తెచ్చెదను.

[అని లోనికిపోయి వింధ్యావళి జలంబు తెచ్చును.]

బలి

వటూత్తమా! ఈ ఆసనంబుపై ఆసీనుడవై నీ పాదపద్మములను ఈ పసిడిపళ్లెరమున ఉంచుము.

[పసిడిపళ్లెరమును వామనుని పాదములవద్ద పెట్టును. వామనుడు ఆసనంబుపై కూర్చుండి తన పాదములను పళ్లెరములో వుంచును. వింధ్యావళి జలంబులు పోయుచుండ, బలిచక్రవర్తి పళ్లెరములో వామనుని పాదములు కడిగి, ఆ జలమును తనశిరస్సుపై చల్లుకుని, వింధ్యావళి శిరస్సున చల్లును. పిమ్మట వామనుడు దోసిలి పట్టగా కలశములోని నీరు అతని దోసిలిలో పోయుచు, మూడడుగుల నేల దానము చేయబోవును. కలశములోనుంచి నీరు పడదు.]

బలి

(ఆశ్చర్యముతో) ఏమిది! దానధార పడకున్నదే!

వామనుడు

రాజా! మీ కులగురువైన శుక్రాచార్యులు సూక్ష్మరూపమున ఈ కలశరంధ్రమున కడ్డుపడి, దానధార నిరోధించుచున్నాడు!

★ వామనుడు ★

బలి

గురుదేవునకు నాపై ఎంత వాత్సల్యము! అయినను మాట తప్పలేను. వటూత్తమా నీకు దానము చేయుట మానజాలను.

వామనుడు

రాజా నీ సత్యనిరతికి సంతసించితిని. ఇదిగో, ఈ కుశాగ్రముచే నాతని తొలగించుచున్నాను.

బలి

అయ్యో! నా గురుస్వామికి శ్రేయఃకామికి హాని!

వామనుడు

భయము లేదు. (అని దర్భపుడకతో కలశరంధ్రమును పొడిచి) ఆచార్యుడు ఒక్కకంటిని మాత్రమే కోల్పోయినాడు. అది అతని శిష్యవాత్సల్యమునకు రాజభక్తికి గురుతు. ఇక దానము చేయుము. (అని దోసిలి పట్టును.)

బలి

మూడడుగుల నేలను నీకు ధార పోయుచున్నాను.

[అని దోసిలిలో నీరుపోయును.]

[తెరలో]

జయా! జయా! దానదాత, బలి చక్రవర్తికి జయా! దానప్రతిగ్రహీత వామనమూర్తికి జయా!

బలి

ఏమి ఆశ్చర్యము! ఏమి ఆశ్చర్యము! మహాత్మా! నీ వామనరూప మేమైనది? విశ్వమంతటను నీవే కనిపించుచున్నావే! ఏదైనా ఇంద్రజాలము కాదుగదా!

వామనుడు

బలిరాజేంద్రా! నీ దానమహిమచే నా విశ్వరూపమును చూడగల దివ్యనేత్రములు నీకు కలిగినవి. రాజా చూచుచుంటివిగదా నీవు నాకు దానమొనర్చిన స్వర్గమర్త్య లోకములు రెండును రెండడుగులైనవి. మూడవ అడుగునకు స్థలము కనిపించలేదు. మూడవ అడుగు ఇవ్వక అసత్యదోషమునకు పాల్పడితివి, కనుక నిన్ను ఈ వారుణ పాశముచే బంధించెదను. (అని బలిచక్రవర్తిని పాశముతో కట్టివేయును)

వింధ్యావళి

(కన్నీళ్లతో చేతులు జోడించి)

త్రివిక్రమా! నా భర్త తనకున్న దంతయు నీకు దానము చేసెనుగదా. ఆయనను కట్టివేయుట ధర్మమా? న్యాయమా? నా భర్తను రక్షించి నాకు 'పతిభిక్ష' పెట్టుము. "పతిభిక్షాంమమ దేహి కోమలమతే..."

[అని పమిటచెంగు పట్టుకొని పతిభిక్ష నడుగుచు వామనుని వద్దకు వెళ్లును]

బలి

త్రివిక్రమా! నేను అబద్ధమాడను. నీకు మూడడుగుల నేల ఇచ్చుటకు వాగ్దానము చేసినది సత్యము. నానోట అసత్యము రాదు. నీ మూడవ అడుగును నా శిరస్సుపై పెట్టి నన్ను కృతార్థుని జేయుము.

[అని తలవంచును.]

జయ! జయా! దానవీరుడైన బలి చక్రవర్తికి జయ! జయా!

[అని అందరూ జయ నినాదములు చేయుదురు.]


వామనుడు

బలి సార్వభౌమా! అడిగినప్పక నేను కోరినది ఇచ్చితివి. నీ దానశీలతకు సంతుష్టుడనైతిని. కాన నీవు పాతాళలోక చక్రవర్తివై అచట సుఖముగా ఉండుము. నేను చక్రధారినై నిన్ను రక్షించెదను.

బలి

చిత్తము. [భార్యాభర్తలు వామనునికి నమస్కరింతురు.]

[తెర]



32
కడపటి ఘట్టం

జలాంతర్గామి సుడిగుండం మధ్య భాగంలో ప్రవేశించింది ఆ సమయంలో జలాంతర్గామి, జలాంతర్గామి యంత్రాలు తాకిడికి సుడిగుండం తట్టుకోలేక గజగజ వణికిపోయాయి! మా చుట్టూరా సుడిగుండం ధ్వని మహా భయంకరంగా వినిపించింది. సుడిగుండంలో ఆ కెరటాల రొద వింటూంటే మా అందరి చెవులు గళ్ళు పడిపోయాయి. ఆ సుడిగుండంలో పడిన పెద్దపెద్ద ఓడలు కూడా పిప్పి పిప్పి అయిపోయాయి. నార్వేలో ఆ సుడిగుండాన్ని గురించిన వింత వింత కథలెన్నో చెప్పుకుంటారు.

ఆ భయంకర పరిస్థితిలో కూడా చాలాసేపటి వరకు జలాంతర్గామి చెక్కుచెదరకుండా నిలబడింది.

అంతలో నెడ్‌లాండ్ మళ్ళీ తిరిగి నావదగ్గరికి వచ్చాడు.

"మనం మళ్ళీ మరమేకులు బిగించి జలాంతర్గామినే అంటిపెట్టుకుని ఉండాలి. ఈ పరిస్థితులలో మనం ఇక చెయ్యగలిగినదేమీ లేదు." అన్నాడు.

మేము ముగ్గురము అలాగే ఆ చిన్న నావనే అంటిపెట్టుకుని కూర్చున్నాము.

అంతలో ఏదో పెద్ద చప్పుడైంది! మా నావ జలాంతర్గామినించి విడిపోయి సుడిగుండం అంచులో గిరగిరా తిరగడం మొదలుపెట్టింది. ఆ సమయంలో నాతల రప్పీమని నావ కమ్మికి తగిలింది. నా కంతవరకు మాత్రమే జ్ఞాపకం ఉంది. ఆ తరవాత పూర్తిగా స్పృహతప్పి పోయింది!

అనువాదం: "వినాయక"

మా అందరి సాగర గర్భ సాహస యాత్ర చివరికావిధంగా హఠాత్తుగా సమాప్తమైపోయింది.

ఆ తరవాత ఆ అర్ధరాత్రి వేళలో ఏమిజరిగిందో నాకు గాని, నెడ్‌లాండుకు గాని కౌన్సెలుకు గాని ఏమీ తెలియలేదు. మేము సుడిగుండంలోనించి ఎలాగ తప్పించుకుని ఇవతల పడ్డామో కూడా ఎవరికీ తిన్నగా తెలియలేదు.

కాని నాకు తెలివి వచ్చి కళ్ళు తెరిచి చూసేసరికి నేను లాఫోడెన్ ద్వీపంలో ఒక జాలరి గుడిసెలో పడుకుని ఉన్నాను. నెడ్ లాండ్, కౌన్సెలు లిద్దరు నా పక్కనే కూర్చుని ఎంతో ఆత్రంగా ఆప్యాయంగా నావైపు చూస్తున్నారు. మేమంతా పట్టరాని సంతోషంతో కరచాలనాలు చేసుకున్నాము.

ఆ క్షణంలో వెంటనే ఫ్రాన్సు దేశానికి వెళ్ళిపోవాలని మా కెవరికీ తట్టలేదు. దాని కొక కారణం



చూడండి!
సన్‌లైట్
సగంబిళ్ల మాత్రమే
ఈ బట్టలన్నిటిని ఉతికింది!
అట్లు చేసినట్టిది దాని అధికమైన నురగ!
SUNLIGHT SOAP
సన్‌లైట్
సబ్బు
బట్టలను తెల్లగాను, కాంతివంతముగాను ఉతుకును
S 242-X52 TL
భారతదేశంలో
తయారుచేయబడినది

జరిగిన కథ :—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సెల్ తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగుకనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్లవర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కాన్సెల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్ఠుగా భోజనం పెడతారు. కెప్టెన్‌నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరు బైటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతర్గామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. కెప్టన్ నీమో జలాంతర్గామి నడిపించేపద్ధతి అంతా ప్రొఫెసర్ అరోనాకు తెలియజేస్తాడు. పిమ్మట జలాంతర్గామి కిరువైపులా తెరుచుకున్న అద్దాలలోనించి అద్భుతమైన సాగరగర్భ జలచరాలు కనిపిస్తాయి. ఆ తరవాత జలాంతర్గామి సాగరగర్భంలోని క్రెస్పో ద్వీపానికి బయలుదేరుతుంది. జలాంతర్గామి వానికారో ద్వీపంమీదుగావెళ్లి గిల్బోవాద్వీపానికి సమీపంలో నిలబడుతుంది. అరోనా అనుచరులతో కలిసి ఆ ద్వీపంలో ప్రవేశిస్తాడు. ముగ్గురు గిల్బోవా ద్వీపంలో వేటముగించుకొనివస్తూండగా హఠాత్తుగా ఒకరాయి వారిదగ్గర పడుతుంది. పిమ్మట కెప్టెన్ నీమో వజ్రాయుధంతో ఆటవికుల నందరినీ పారదోలగొట్టివేస్తాడు. క్రమంగా జలాంతర్గామి పగడాలదీవి జేరుకుంటుంది. చనిపోయిన నావికుని శవానికి అక్కడ సమాధి ఏర్పాటుచేస్తారు. కెప్టెన్ నీమో మన్నారు సింధుశాఖలో ఒక పెద్దముత్యం సంపాదిస్తాడు. పిమ్మట ఎంతో చాకచక్యంతో ఒక బెస్తవాని ప్రాణాలు సంరక్షిస్తాడు. పిమ్మట జలాంతర్గామి మధ్యధరాసముద్రందాటి అట్లాంటిక్ మహాసముద్రంలో ప్రవేశిసుంది. తరవాత జలాంతర్గామి నావికులు విగో అఖాతంలో మునిగి వెండిబంగారాలపోగులుసేకరిస్తారు. కెప్టెన్‌నీమో ప్రొఫెసర్ అరోనాకుఅట్లాంటిస్‌ఖండం చూపిస్తాడు. జలాంతర్గామి సముద్రం అట్టడుగున ఉన్న బొగ్గుగనులలోనించి బొగ్గు నింపుకుంటుంది. క్రమంగా దుర్భేద్యమైన మంచుకొండ అడుగునించి ప్రయాణంచేసి దక్షిణధ్రువం సమీపిస్తుంది తరవాత కెప్టెన్ నీమో దక్షిణధ్రువం కనిపెట్టి అక్కడ తన జండా ఎగరవేస్తాడు. జలాంతర్గామి దక్షిణధ్రువం దగ్గిరినించి మళ్ళీ తిరుగుప్రయాణం సాగిస్తుంది. అష్టపాద జంతువులతో చేసిన పోరాటంలో జలాంతర్గామి నావికు డొకడు మరణిస్తాడు. తరవాత జలాంతర్గామి గల్ఫ్‌స్ట్రీమ్‌లో ప్రయాణం సాగిస్తుంది. పిమ్మట జలాంతర్గామి నావికులు శత్రునౌక ముంచివేస్తారు తరవాత జలాంతర్గామి నార్వేతీరంలో సుడిగుండంలో చిక్కుకుంటుంది.

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

ఉంది. నార్వే ఉత్తర తీరానికి, ఫ్రాన్సు దేశానికీ రాకపోకలంతగా అనుకూలంగా లేవు. ఒకే ఒక స్టీమరు, ఫ్రాన్సు దేశానికీ నార్వే ఉత్తర తీరానికీ మధ్య రాకపోకలు సాగిస్తూంది. అది నెలకు రెండు సారులే ఆ తీరానికి వస్తూంటుంది. అందుచేత మా కందరికీ అక్కడ ఒక పదిహేనురోజులపాటు ఉండక తప్పలేదు.

నే నక్కడ ఉన్న రోజుల్లో ఇంతకు పూర్వం రాసిన 'సాహస యాత్ర' అంతా చక్కగా సరిదిద్దాను.

నేను దీనిలో కొత్తగా చేర్చినది ఏమీ లేదు. అంతా అతు రాలా నిజం! వాస్తవ విషయాలేవీ మార్చ లేదు. ఒక్క అతిశయోక్తి కూడా చేర్చలేదు. ఇంతవరకూ కనీవినీ ఎరగని ఆ అత్యద్భుతమైన ఆ జలాంతర్గామిలో నా అనుచరులు నేనుకలిసి సుఖంగా ప్రయాణం సాగించాము. ముందు ముం దెవరైనా ఇలాంటి జలాంతర్గామి కనిపెడితే కనిపెట్ట వచ్చును. కాని అంతవరకు నేను రాసినదంతా కేవలం అభూతకల్పన లాగే కనిపించవచ్చును.

నేను రాసినదంతా నిజమేనని పాఠకులు నమ్ముతారో నమ్మరో నని నాకు కొంచెం అనుమానంగా నే ఉంది. అయితే అంతమాత్రంచేత నాకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. నే నంతా నా కళ్ళారా చూచిందే! అదంతా ఉన్నది ఉన్నట్టుగా రాశాను.

ఇంచుమించుగా పది మాసాల పాటు నేనా జలాంతర్గామిలో ఉండి అత్యద్భుతమైన ఆ విచిత్రాలన్నీ నా కళ్ళారా సందర్శించాను. మేమంతా కలిసి సముద్రగర్భంలో సుమారు అరవైవేలమైళ్ల దూరం దాకా ప్రయాణం సాగించాము. చాలావరకు ప్రపంచంలోఉన్న సముద్రాలన్నీ మేము సందర్శించడం జరిగింది. మా 'సాగరగర్భ సాహస యాత్ర'లో ఎన్నెన్ని చిత్ర విచిత్రాలు సందర్శించాము!


ఇంతకీ ఆ జలాంతర్గామి ఏమైపోయింది? అది ఆ సుడిగుండం దాటి జాగ్రత్తగా బయటపడిందా?

ఆ సుడి గుండంలో పడి ఎన్నెన్నో గొప్ప నౌకలు నామ రూపాలైనా లేకుండా నశించి ఉండవచ్చును. కాని నాటిలస్ జలాంతర్గామి ఆ సుడిగుండంలో నించి బైటపడి ఉంటుందనే అనుకుంటాను. అదే నిజమయితే కెప్టెన్ నీమో ఇంకా ఆ జలాంతర్గామిలో తన నిరంతర సాగరయాత్ర సాగిస్తూనే ఉన్నాడన్నమాట! అతడింకా తన

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

కెప్టెన్ నీమో ఇంకా జీవించే ఉన్నాడా? తన అనంతసాగర గర్భయాత్ర ఇంకా అలాగే సాగిస్తున్నాడా? ఇంకా తన శత్రు నౌకలనలాగే ముంచివేస్తున్నాడా? కెప్టెన్ నీమో జలాంతర్గామి రహస్యాలన్నీ రాసిన ప్రతి ఏమి చేశాడు? ఎప్పటికైనా ఆ వ్రాత ప్రతి బయట పడుతుందా? ఇంతా చేసి అతని పేరు కెప్టెన్ నీమో యేనా? ఇంతకీ అతడే దేశస్థుడో! ఎవరైనా నిర్ధారణ చేసి చెప్పగలరా?

బహుశః ఈ ప్రశ్నల కన్నిటికీ ఎప్పటికో అప్పటికి తగిన సమాధానాలు దొరుకుతాయనే ఆశిస్తున్నాను.



జలాంతర్గామి సుడిగుండం మధ్యభాగంలో ప్రవేశించింది.

శత్రువులమీద పగసాధిస్తూనే ఉన్నాడన్నమాట! సముద్రంలో అన్ని అత్యద్భుతాలు సందర్శించి అంతటి అనుభవం గడించిన వ్యక్తి కంతటి దీర్ఘక్రోధం ఉండడం న్యాయంకాదు. క్రమ క్రమంగా అతని హృదయంలోని క్రోధజ్వాల చల్లారిపోగలదనే ఆశిస్తున్నాను.

అతడింకా సాగరగర్భ పరిశోధనలు సాగిస్తూనే ఉంటాడని అనుకుంటున్నాను.

నిజంగా అతని పరిశోధన అత్యద్భుతమైనది! ఉన్న కొద్దికాలంలోను నాకది అంత అత్యాశ్చర్యకరంగా కనిపించడంలో ఆశ్చర్యం ఏమి ఉంది?

ఏదైనా ఇన్ని అత్యద్భుత విషయాలు గ్రహించి స్వయంగా సందర్శించిన మా ఇద్దరిగురించీ భావికాలం వారే తగిన నిర్ణయం చెయ్యగలరు? భవిష్యత్తులో కంటా చొచ్చుకుపోగలిగిన అత్యద్భుతాలు సృష్టించి, ఇంకా ఎన్నో అద్భుతాలు సందర్శించిన మహామహుడు కెప్టెన్ నీమో! అతని చర్యలన్నీ కళ్ళారా చూచి, ఆనందించి, వాటి అంతరాంతరాలవగాహన చేసుకున్నవాణ్ణి నేను!

—అయిపోయింది.

వనితా లోకం

కొండలు కరిగిపోతూ ఉంటే అండలు కూలాయని బెంగ

ఆంధ్రపత్రిక, అక్టోబరు 10 వ తేదీ సంచికలో శ్రీమతి అన్నపూర్ణా రామారావు వ్రాసిన 'పొదుపు' వ్యాసానికి "శ్రీమతి పరంజ్యోతి" గారి విమర్శ చదివాను. పరంజ్యోతి గారు అన్నపూర్ణా రామారావు గార్ని సరిగా అర్థం చేసుకోనట్లు కనబడుతుంది.

వెనకటికి ఒకావిడ పిండీ, బెల్లం పోతుంటే పిడకల గూటికెడ్చిందట. సరిగ్గా ఇలాగే చేస్తుంది మా అత్తగారు బజారు నుంచి వచ్చిన ఏవస్తువైనా సరే పొట్లాలు కట్టి వసాయి. ఆ దారాలన్నీ ఎంతో పొదుపుగా జాగ్రత్త చేస్తుంది. కావాలంటే పదేళ్ల నాటి దారాలు కూడా దొరుకుతవి. ఇంతకీ అసలు ఆపొట్లాలలో వస్తువు లేం చేస్తారనుకొన్నారు? ఒక మూలగదిలో పడుంటవి. ఎలుకలూ, చీమలూ విందులు చేసుకొంటూ ఉంటవి. ఇలాగే కొందరు వ్యక్తులు అసల్ని అలక్ష్యం చేసి కొసరు కోసం గొడవ చేస్తారు. కొండలు కొండలుకరగి పోతున్నా అండలు రాలుతున్నాయని అలమటిస్తారు.

ఇదే కోవకు చెందేవారు చాలామంది కనబడతారు. అలాంటి వాళ్ళ చేతిలోనుంచి అణా రాలాలంటే అర్ధసంవత్సరం తపస్సు చేయాలి అయితే వీళ్ళగణవని గుణించేవాళ్లు గట్టిగా అరవైలూ, డబ్బైలూ ఖర్చు పెడుతున్నా తవదిగానట్లే ఊరుకుంటారు మళ్ళా.

శ్రీమతి అన్నపూర్ణా రామారావుగారు కొందరిని ఇదే జాబితాలో జమకట్టి వప్పుతూ ఉండవచ్చు. అంతేగాని. అగ్గి

వంకినేని జానకిదేవి

పుల్లల్ని అలక్ష్యం చేయమనీ, అనవసరంగా అంటించి వేయమనీ, అన్నపూర్ణా రామారావు గారి అభిప్రాయం అయివుండదు.

ఇంతేగాదు ఇంకొ రకం కొల పొదుపరులున్నారు. వాళ్ళని చూస్తే నవ్వూ, కోపం రెండూ వస్తాయి మా బాబాయి ఒకాయన ఉన్నాడు. 25 ఎకరాల పల్లపు పొలం ఉంది. దానిని ఎప్పుడేం చేయాలో అది చేయడు. కొన్నాళు పాలేళ్ళను పెడితే ఖర్చనుకొని, వారినీ, వీరినీ బండీ, నాగలీ, పాలేళ్ళను అడిగి తీసుకొని గాని దున్నేవాడు కాదు. తనుపనులవకుండా ఇతరులకిచ్చేటంతసహృదయులు ఎవరుంటారు చెప్పండి! అక్కడికి ఎవరైనా మొహమాటానికి ఇస్తేపబ్బం గడిచేది.

పాపం! ఆ పొలంకూడా పొదుపుగానే పండి ఊరుకొనేది.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, కొంతమందిలో ఈపొదుపుకి అంతంటూ కనపడదు. అన్నం దగ్గరా కూరదగ్గరా అన్నింటి దగ్గరా పొదుపు పేరిట ప్రాణంమీదకు తెచ్చుకొనే దౌర్భాగ్యులుకూడా ఉన్నారు.

చాలామంది ఇల్లాళ్ళు మొన్న మిగిలిన మజ్జిగా, నిన్న మిగిలిన కూరా కూడా "వృథా చేయకుండా" పిల్లలకు పెడ్తూ ఉంటారు. దానివల్ల వచ్చే అనర్థాలు వాళ్ళకు తెలియవు పాపం. ఫలితం పిల్లల్నెప్పుడు చూసినా రేపోమాపో అన్నట్లుంటారు మందుబుడ్లకనీ, టానిక్కులకనీ మగవాడిచేత ఖర్చు పెట్టించేది ఇంతా అంతా కాదు ఇదెంతా పొదుపే నంటారా?

అంతేగాదు; పెద్దవాళ్ళ అతి పొదుపుతో పిల్లలెంత నష్టపోతారు చూడండి మాకు తెలిసిన ఒకయింట్లో ఒక వంట మనిషుండి. పాపం తనెలాగ తిన్నా గాని, ఇతరులకు వడ్డించేటప్పుడు చాలాపొదుపుగా వడ్డించటం అలవాటు చేసేరు. ఆవిడ తను వడ్డించిన కూరలే గాని మళ్ళీ అడిగితే కూరగిన్నెలు తీసుకొచ్చి చూపెడుతుంది. ఇంతే ఉన్నయ్యి పొదుపుగా, తినాలి అని ఆవిడ ఉద్దేశం రామరామ. ఆకలిమంటలు అప్పుడప్పుడైతే భరించగలంగాని నిత్యం ఈ ఏకాదశులు ఎవరు చేయగలరు చెప్పండి?

ఇంతకీ పొదుపంటే, నిత్య జీవితంలో మనకేవి అవసరమో, ఏవి అనవసరమో చక్కగా యోచించి అనవసరమైన వాటికి అర్థాన్ని వ్యర్థం చేయకుండా రాబడి ననుసరించి ఖర్చు పెట్టటమే. ★

ఎప్పుడూ ఇంతే

ఎహా పక్క వాటాలో ఉన్న రామచిలక, రంగనాథం తగవులాడుతున్నారు.

"మీ రెప్పుడూ ఇంతే. ఒకనాడైనా అన్న వేళకి వచ్చారు గనకనా" అంది రామచిలక.

"నువ్వెప్పుడూ ఇంతే. నీవు సంవత్సరంలో 364 రోజులూ అన్న టైముకొచ్చినా, ఆఖరి రోజున అర నిమిషం లేటయితే చాలు. మీ రెప్పుడూ ఇంతే అనేస్తావు చటుక్కుని. చూస్తున్నానుగా. ఎప్పుడూ అలాగే అభాండం వేసేస్తావు. ఎప్పుడూ ఇంతే" అన్నాడు ఆమె భర్త రంగనాథరావు.

సి. ఏ. విజయలక్ష్మి

ఇంతకీ వారిద్దరూ ఆరోజు సాయంత్రం సినిమాకి వెళ్దామని ప్రొద్దుట అనుకున్నారు. సాయంత్రం పెందరాళే రండిసుమండీ అని, అతన్ని ఆఫీసుకి పంపినప్పుడు ఆ అమ్మాయి మరీ మరీ చెప్పింది. ఆతరవాత నాతో చెప్పింది ఇలా సినిమాకి వెళ్తున్నాం సుమండీ అని

తీరా చూసి, ఆయన సాయంత్రం ఆరున్నరకి వచ్చాడు పద పద అంటూ. అయితే ఆ పిల్లకి ఉక్రోషం వచ్చేసి రానని వేసింది. ఆతర్వాత, మామూలుగానే నువ్వెప్పుడూ ఇంతే, అంటే నువ్వెప్పుడూ ఇంతే అని వాదించుకుని అన్నాల దగ్గిర్నించి అర్ధాకలితో లేచిపోయారు.

కాని, నిజం చెప్పాలంటే యీ మొగాళ్ళతో యెప్పుడూ యింతే. ఇంట్లో ఎన్ని కబుర్లు చెప్పినా, వీధులోకి వెళ్ళేక అన్నీ ఇట్టే మర్చిపోతారు.

గొప్పో యేమిటో నాకు తెలీదు గాని, నిజం చెప్పాలంటే, పురుషులు "ఈ గుణాల పుట్టలు." ఒక్క మర్చిపోవడమే కాదు, పరాకు నటించడం, తప్పు చేసి దొరికిపోయినప్పుడు "ఆ ఏదో ఏడాదికోసారి పొరపాటు" అని కొట్టిపారెయ్యడం వందసార్లు చెప్పినా వినిపించుకోకపోవడం — ఇవన్నీ కొంచెం రోజులు తమాషాగా ఉంటాయి కాని, ఒక్కోసారి ఒళ్లు మండిపోతుంది.

వంటయింది భోజనానికి లెమ్మని పిలుస్తామా, కొంతసేపు ఆలోచించినట్టు ఆగి, ఆ అంటారు. మళ్లా రెండుసార్లు చెప్పాక, వడ్డించు వస్తున్నా అంటారు.

తీరా వడ్డించేస్తే ఆకొన్నించి, చల్లారిపోతోందని హెచ్చరికలు చెయ్యాలి.

కొంతసేపటికి ఎలాగో తెమిలి వస్తారు.



కలువ చెలువము

—ఫొటో: ఎస్. రామకృష్ణ.

ఎప్పుడూ ఇంతే

ఎల్లాగా ఆలస్యం చేస్తారు, చల్లారిపోతుందిగదా అని వడ్డించకుండా, తొందర చేసి పిలిచామనుకోండి

నువ్వెప్పుడూ ఇంతే, ఆకయినా వెయ్యకుండానే, అన్నం చల్లారిపోతోందని కేకలు పెడతావు అని తెలివిగా హేళన చేసేస్తారు. కొంచెం కోపిష్టులైతే, విసుక్కుంటారు.

పెంకితనం అనుకున్నాసరే, పట్టుదలకే అనుకున్నాసరే, నేను మా వూళ్ళో నాకు తెలిసిన చాలామందిని చూడగా, స్థూలంగా, మొగాళ్ళలో చిరాకుపడేవారు, పరాకుగా ఉండేవారూ అనే రెండు విధాల పురుషులే అధికంగా ఉన్నట్టు తేలింది.

ఈ పరధ్యాన్నం జాతీయుల చేష్టలు నవ్వూ చిరాకూ కూడా కలిగిస్తాయి. అత్తుణానికి గమనించవలసినది కాక, ఇంకేదో ఒకదాన్ని గురించి వీళ్ళు శ్రద్ధగా ఆలోచిస్తారు. రెండోసారి కాఫీ స్వయంగా తాగబోయి, తాగేసి, మూడోసారి సంగతి మర్చిపోయి ఫాస్కు మూతని అలా వదిలిపెట్టేస్తారు. పోస్టుచెయ్యమని చేతికిచ్చిన ఉత్తరాన్ని మర్చిపోవడం అనే దాన్ని తప్పకుండా మర్చిపోరాదు. మా బాబాయిలాగ కోట్లు తొడుక్కునే వాళ్ళ జేబుల్లో ఇలాటి పోస్టు చెయ్యని ఉత్తరాలు, ఏడాది క్రితం రెండోవాణ్ణి బళ్ళో వేసినపుడు కట్టిన జీతం రసీదు, సినిమా పేపరు, బస్సు టిక్కట్టూ, ఖాళీ అగ్గిపెట్టెలో, వాడబడిన పోస్టుకవర్లు (వాటిలో ఉత్తరాలు మాత్రం ఉండవు) ఆ జేబుల్లో దొరుకుతాయనిపిస్తుంది. పనికొచ్చే కాయితం ముక్క ఒక్కటీ ఉండదు.

ఇంక, చిరాకేశ్వరులకి ముక్కుమీద కోపం ఉంటుంది. వాళ్ళతో ఏం చెప్పకూడదు. సరదాగా మాట్లాడ్డానికి అవకాశం, టైమూ ఉండవు. అన్నం తిన్నప్పుడు కూడా. ఏదేనాసరే అడక్కపోతే పరాకు, అడిగితే చిరాకూను. తలుపుకి ఈ రంగు కర్టెన్ బాగుంటుందా అనో ఈ కథ చాలా తమాషాగా ఉందనో, సరదాగా కబుర్లు చెప్పబోతే, "నన్ను చిరాకుపెట్టకు ఊరికే ఏదోవొకటి చెయ్యి" అనేస్తారు గబుక్కుని. అవతల మనిషి మనసు చివుక్కుమంటుంది. ఇంక స్త్రీకి సమానత్వం అని కబుర్లెందుకుట చెప్పడం? ఏదేనా ఓ కొత్త విషయం, అడగాలన్నా చెప్పాలన్నా, చిన్నపిల్లకి మల్లేభయపడుతూ, అగ్గగ్గలాడుతూ నెమ్మదిగా కదపవలసి రావటం చాలా ఇళ్ళల్లో పరిస్థితి ఇలాటిది చూసే పిల్లలికి ఏ మాత్రం గౌరవం ఉంటుందట ఆ తల్లిమీదకి ఆ తల్లి మాత్రం తను పెద్దదాన్ననిపించుకొంత మనిషి

వదినా మరదళ్ల గోష్ఠి

తీరిక సమయాలలో గృహ పరిశ్రమలు

"వెలగపండ్ల జామ్"

కొన్ని కొన్ని కాయలు అచ్చంగా కూర వండుకొని తినటానికే ఉపయోగిస్తాయి. ఇంకా కొన్నిరకాలు ఆహార పదార్థాలుగానేకాక అనేకవిధాలుగా ఉపయోగపడుతూవున్నాయి. ఊహించుకునే తెలివి తేటలుండాలిగాని ప్రతిపండును అనేక విధాల ఉపయోగించుకోవచ్చు. ఉసిరి కాయల్ని మనం అచ్చంగా ఊరగాయ నిమిత్తమే వాడుకుంటున్నాం. వైద్యులు మందుల్లో వాడుకున్నారనుకో. కొన్ని వాటితోనే "జాం" తయారుచేశాం ఎంతో రుచిగావుంది. ఏమంటావు?

నిజమే వదినా! నేనూ తయారుచేశాను చాలాబాగుందన్నారు మా ఇంట్లో. ఈపూట కూడ అటువంటిదేదో తయారుచేసేపద్ధతి చెపుతావు కదూ!

తప్పకుండాను. బజారునుంచి వెలగ పళ్లు వచ్చాయని తీసుకొని వచ్చారు మీ అన్నయ్య. మామూలుగా ఇంట్లో పచ్చడికి ఒకటో రెండో తెప్పిస్తుంటాం. కాని, ఆయనమాత్రం పల్లె నుంచి మంచివనగా వున్నాయని చెప్పి డజను కాయలు తెచ్చారు. ఈ పూట రెండు కాయలు వాడాను మిగిలినవి నిలవవుంచితే చెడిపోతాయని ఏదైనా తయారుచేద్దామనుకుంటున్నాను. ఏం చేద్దామో చెప్పు!

ఎ. మాణిక్యాంబ

కాయలన్నీ పగలగొట్టి గుజ్జుతీసి కొద్దిగా ఉప్పుకలిపి బిళ్ళలుచేసి ఎండబెట్టు. అవసరం వచ్చినప్పుడు కొంచెం వేడినీళ్లలో ఒకటో రెండో వేసి నానబెట్టి పచ్చడి చేసుకోవచ్చు. ఏడాదిపొడుగునా వాడుకోవచ్చు.

ఇంకేం మార్గం లేదంటావు. నీకూ తెలుసుకోవాలి. కాయలు ఆ ఇంట్లో వున్నాయి తెచ్చి పగలగొట్టి గుజ్జుతీయ్యి. ఈలోపల నేను మిగతా పనిచేస్తాను

కాయలుకొట్టి, గుజ్జుతీసి, మెత్తగా పిసికి, ఉప్పుకలిపి సిద్ధంచేస్తే వదినగారు "అంతా అమర్చిపెట్టితే అత్తగారు వచ్చి ఏదో చేసిందన్న"ట్లుగా బిళ్ళలు చేస్తారన్న మాట.

ఇంక నాకు చేసేటందుకు పనేలేదంటావు అయినా చూస్తూవుండు నే చేసేపని.

ఊఁ. కాయలు కొట్టి గుజ్జుతీశాను. ఉప్పు ఎంత కలపమన్నావు?

ఉప్పు ఎంత కలపాలో చెపుతానుగాని, ముందుగా అక్కడవున్న పల్చనిగుడ్డ ఇలా తీసుకురా.

దేనికి? ముందీపని పూర్తిఅయినాక ఇంకోపని మొదలుపెడదాం.

అట్లాగే కాని! గుజ్జును ఈ ఎనామెలు గిన్నెలో వేసి కొద్దిగా నీళ్లుపోసి కొంచెం పల్చగా వుండేటట్లుగా కలుపు.

నీళ్లుపోసి కలిపితే బిళ్ళలు బూజుపట్టి చెడిపోతాయి తెలుసా?

తెలుసుగాని ముందు నేను చెప్పినట్లుగా చెయ్యి కలపడం పూర్తి అయిందా?

అయింది. దీన్నేం చెయ్యాలి?

ఈ గుడ్డని ఆ రెండు మూలలూ నువ్వు గట్టిగా పట్టుకో. ఇతరరెండు మూలలూ నేను పట్టుకుంటాను. గరిటతో గుజ్జును కొద్దికొద్దిగా గుడ్డలో వేస్తూవుండు. నేను చేతో గుజ్జును వస్త్రఘాళితం చేసినట్లుగా గుడ్డమీద రాస్తూవుంటాను. అప్పుడు గుజ్జు గుడ్డ అడుగునుంచి ఈ గిన్నెలోపడి గింజలు మాత్రం గుడ్డపైన నిలిచిపోతాయి.

గింజలు పనికిరావా?

గింజలు కలిసితే చేదుగా వుంటాయి. అందువలన వాటిని తీసిపారవేసేటందుకు ఇదేమార్గం.

ఇంత శ్రమపడుతున్నాంగాని వదినా! పచ్చడి అన్నంలో కలుపుకుంటే ఈ గింజలు పంటికింద పడుతుండా తిన్నంచుకుపోతాయి గదా! దేనికి ఈపనియంతా?

అదూ నిజమే. కాని తీసిపారేసినందువల్ల నష్టమేదీలేదుగా. ఇద్దరం కలిసి కాసేపు శ్రమపడతాం. ఏమంటావు? చూడు ఎన్ని గింజలు వచ్చాయో. ఇవన్నీ లోపలికిపోయేవేగా!

నిజమే వదినా! గింజలు మింగితే కడుపులో చెట్లు మొలుస్తాయంటారు. నిజమే.

చిన్నపిల్లలకి చెపుతూ వుంటాంగదూ! ఈ గుజ్జు ఇప్పుడు చూడు ఎంత బాగుందో!

మరి ఇంక దీనిలో ఉప్పుమాత్రం కలుపుదామా?

తొందరపడతావేం? కొంచెం ఆగు. ఈ స్టెయిన్‌లెస్ స్టీలు గిన్నెను త్రాసులో పెట్టి ఎంత బరువుందో తూచు. తరువాత ఈ గుజ్జును ఆగిన్నెలో వేసి మళ్లీ తూచు. అప్పుడు గుజ్జు ఎంత బరువుందో తెలుస్తుంది.

తూచటం దేనికి? ఇదంతా చూస్తే బిళ్ళలు చేసి ఎండబెట్టేటందుకు కాదల్లేవుంది. ఆ మాట ఇందాకనే చెపితే ఈ పాటికి తయారుచేసి వుంచేదాన్నిగా!

ఇప్పుడు చెయ్యరాదు? మించిపోయిందేమీ లేదుగా. ఇంతవరకూ చేసినపని మన ఇద్దరి పద్ధతికి సమానమేగా. తూచావుగదూ? డబ్బాలో పంచదారవుంది. గుజ్జు తూకానికి సరిపడే పంచదార తూచి ఈ గిన్నెలో వేసి కొద్దిగా నీళ్ళు పొయ్యి. నేను కుంపటిలో నిప్పు వేస్తాను గిన్నెను కుంపటిమీద వుంచి గరిటతో కలుపుతూవుండు.

ఎప్పుడూ ఇంతే

పనీ ఎలా అనుకోగలరు?

ఇంకోరకం వాళ్లున్నారు. అంతా వింటున్నట్లే నటించి, చాలా సేపయ్యాక [illegible] అంటారు. ఇంతవరకూ ఉత్సాహంగా మాట్లాడుతున్న జీవిత భాగస్వామిని, పనిపిల్లకన్న కనికష్టం అయిపోయినట్లుగా.

వీటన్నిటినీ సమర్థించడానికి, "మొగాడు పొద్దున్నగా పోయి సాయంత్రం వరకూ ఆఫీసులో పనిచేసి వస్తాడా ప్రాణం హైరానా పడి చిరాగ్గా ఉంటాడు మరి" అని చెప్తారు.

కాను మరి ఆడదానికి ఏంపని ఉంటుంది. వంటా వార్పూ చేసుకుని, పిల్లలకి నీళ్లుపోసి అన్నం పెట్టి బడికి పంపడం, మధ్యాన్నంచి, ఇల్లు చక్కబెట్టుకోవడం, కావలసిన వస్తువులూ అవీ సమకూర్చుకోవడం, పిల్లలకి గుడ్డలు ఉతికి ఆరవెయ్యడం ఇల్లూ వాకిలీ ఊడ్చుకోవడం, అప్పులవాళ్ళకి జవాబులు చెప్పుకోవడం (ఆయన చిన్న విషయాలు పట్టించుకోరుగా) ఇవేగా పనులు! ★

"వెలగపండ్ల జామ్"

ఎంతసేపు కలపాలి?

పంచదార నీటిలో కరిగి పోయే వరకూ కలిపి తరవాత ఈ గుజ్జును కూడా దానిలో వేసి బాగా కలుపు.

పాకం వస్తావుంది. చూచి దింపుదామా?

కొంచెం ఆగు! త్రాసుతో ఈ నిమ్మ ఉప్పునుకూడ తూచి పొడి చేసి ఆ పాకంలో కలుపు.

నిమ్మ ఉప్పు ఎంత కలపాలి? దేనికి?

వంద తులముల గుజ్జుకు అరతులం నిమ్మ ఉప్పు కలపాలి. గుజ్జు అంత బాగా పుల్లగా వుండదు. పైగా గుజ్జుకు సరిపడ పంచదార కూడా కలుపుతున్నాంగదా! తీపి ఎక్కువై అంత రుచిగా వుండదు. అందుచేత కొద్దిగా నిమ్మఉప్పు కూడ కలిపితే ఎంతో రుచిగా వుంటుంది చూడు! ఈ కొయ్య గరిట పాకంలో ముంచి పైకితీసి రెండు నిముషాలు చల్లారనిచ్చి క్రిందకు వంచు. పాకం వచ్చి వుంటే గరిట వెంబడి చిక్కగా ముద్దలు ముద్దలుగా పడుతుంది. లేక ఒకే తీగలాగా పడుతుంది పాకం రాకపోతే ధారగా కింద పడుతుంది.

పాకం వచ్చింది దింపనా?

దింపు. వేడి కొంచెం చల్లారిన తరువాత ఈ సీసాలలో పోద్దాం.

వేడి పూర్తిగా చల్లారాలా?

కాదు. కొంచెం వేడితగ్గితే చాలు. సీసాల్లో పల్చగా వుండగానే పొయ్యాలి. చల్లారితే చిక్కబడిపోతుంది.

ఈ సీసాల్ని ఇంత బాగా కడిగావు ఎప్పుడు? నాతో చెప్పితే నేను కడిగే దాన్నిగా.

వీటిని స్టెరిలైజ్ చేశాను. అంటే ఏం చెయ్యాలో తెలుసా? ఒక గిన్నెలో నీళ్లు పోసి పొయిమీద వుంచి దానిలో సీసాలను మూతలను కూడ వుంచి సలసల కాచాలి. కొంత సేపైన తర్వాత గిన్నెనుదించి సీసాలను ఆరనిచ్చి సిద్ధంగా వుంచుకోవాలి. స్టెరిలైజ్ చేసే పద్ధతి ఇది. తయారైనపాకం అంగులో పోసి పూర్తిగా చల్లారే వరకు మూతపెట్టకుండా వుంచి తర్వాత కొద్దిగా పారాఫిన్ మైనం కరిగించి సీసాలో గట్టి పడిన పాకంమీద పోసి, కొంచెం సేపు ఆగాక చూస్తే మైనం గట్టిపడి వుంటుంది. తర్వాత రబ్బరు రింగుగల మూతని వుంచి గట్టి గామరబిగించి అందమైన లేబిలు అంటించి ప్యాక్ చెయ్యాలి వాడుకునే ముందు చాకుతో మైనం ఒక మూలనుంచి ఎత్తితే బిళ్ళలాగ వచ్చేస్తుంది. దానిని ఎత్తివేసి జామ్‌ను వాడుకోవాలి. దీని పేరు ఏమిటో తెలుసా? వెలగపండ్ల జామ్. ★

సినిమా

"స్టార్ సిస్టం" అనబడే బాక్సాఫీస్ తారలమోజు మళ్లా పుంజుకుంది. దాంతో పాటే గిరాకీకూడా పెరిగింది. ఈ అగ్రశ్రేణి నటీనటుల 'రుసుము'లు రోజు రోజుకీ రాజుకుంటున్నాయి. నిర్మాతలు చేతులారా తెచ్చిపెట్టుకున్న ఈ పరిస్థితులకి తట్టుకోలేక సతమతమవుతున్నారు.

గత మూడేళ్ల తారాబలాన్ని పరిశీలిస్తే, కొత్త ముఖాలు మూడే కనిపిస్తాయి. వారు మాలాసిన్హా, జబీన్, వహీదా రెహమాన్. ఈ ముగురిలోనూ మొదటి ఇద్దరూ అప్పుడే ద్వితీయ శ్రేణికి దిగజారిపోయారు. ఒక వహీదాకే రోజులు మున్ముందు చాలా బాగుంటే అవకాశాలున్నాయి. ఇక, మద్రాసునుండి, ఇలా కొత్త తారలను ఇంకా తీసుకురావడానికి ప్రయత్నాలు జరిగాయి కాని, తద్వారా అయ్యే ఖర్చుకి నిర్మాతలు తట్టుకోలేకపోతున్నారు. ఒక నాట్యతార

బొంబాయి సినిమాలేఖ

(ఆంధ్రపత్రిక విలేఖరి)

బొంబాయి చిత్రంలో నటించడానికి వస్తే, సకుటుంబ పరివార సమేతంగా వస్తుంది. ఈ యావన్మందికీ 'ఎ' క్లాసు హోటలులో బస ఏర్పాటు చేయాలి ఈ భోజనాదికాలుకాక, సోడాలవంటి చిల్లర మల్లర ఖర్చుల పేరిట రోజుకి ఐదువందలు మాత్రమే సరిపోతోందట. అందువల్ల, ఇక్కడి నిర్మాతలు మద్రాసునుంచి కళాకారులను తీసుకురావడం అంటే, అహోఘంగా బోలెడు ఉబలాటపడటం మానేశారు.

కొత్తరకం కవిత

మానేసినా, పరిస్థితులు చక్కబడలేదు. అలాటి అవకాశాలూ కనుచూపు మేరలో ఆవటంలేదు ఎందుకంటే, ఉన్న హైక్లాసు హీరోలలో నలుగురు, ఒక్కొక్క చిత్రానికి లక్షకి తగ్గకుండా, లక్షా డబ్భై అయిదు వేలకి మించకుండా తీసుకుంటున్నారు. బొంబాయి నటీమణులలో అగ్రశ్రేణి వారి రుసుములు కూడా దాదాపు ఇంతే. ఇది, మామూలు నిర్మాణ వ్యయం తట్టుకోడానికి సిద్ధపడ్డా, ఇందులో పెద్ద చిక్కు పద్దుల దగ్గిర వస్తోంది. ఎందుకంటే, నటీనటులకు ఇచ్చే మొత్తంలో కొంతభాగం "బ్లాక్ మనీ" రూపేణా ముట్టచెప్పవలసి వస్తోంది. మొత్తంమీద ఒక్కొక్క చిత్రానికి ఈ రకం "బ్లాక్ మనీ" లక్షా యాభైవేల రూపాయలవరకూ ఉంటుంది. నిర్మాణ వ్యయానికి పద్దులు వేసినపుడు నిర్మాత ఈ చిన్నారి మొత్తానికి ఎంతో కష్టపడి "ఖర్చు కవిత" అల్లవలసివస్తోంది.


మదత పేచీ

భారతప్రభుత్వం, నిర్మాతలకు సహాయపడాలన్న సత్సంకల్పంతో "ఫిలిం ఫైనాన్స్ కార్పొరేషన్" పేరిట పెట్టుబడిసంస్థనొకటి నెలకొల్పబోతోంది. అయితే ఈ సహాయాన్ని నిర్మాతలకు అందచేయడానికి రూపొందించిన పద్ధతులూ, షరత్తులూ చూస్తే, పరిస్థితులు మెరుగయేలాకన్పించటంలేదు.

ఈ షరత్తులలో ఒకటి ప్రముఖ, (లేక, బాక్సాఫీస్) నటీనటులను బుక్ చేయడం.



నవభారత్ వారి "బందీ"లో మాలాసిన్హా



భాస్కర్ వారి "రేపు నీదే"లో రంగారావు, జగ్గయ్య.

★ బొంబాయి సినిమా లేఖ ★


మరొకటి, పేరుమోసిన డిస్ట్రిబ్యూషన్ సంస్థ మద్దతు సంపాదించుకోవడం.

ఈ వరాలు రెండూ సాధిస్తే తప్ప, పెట్టుబడి కార్పొరేషన్ వారు దమ్మిడీ కదపరు.

'తృణం; పణం'

నిర్మాత ఇందుకు పూనుకొన్నాడను కుందాం. ముందర డిస్ట్రిబ్యూటర్ దగ్గరకు వెళ్తే 'బాక్సాఫీస్ స్టార్' సంతకాలున్న కాంట్రాక్టులు ఎన్ని ఉన్నాయని అడుగుతాడు. పరేవని, వారి దగ్గరకు వె[illegible] బ్లాక్ మనీ షరతు లేందే మాట్లాడరు. మాట్లాడుకున మొత్తం ధనములో తృణం కాంట్రాక్టు మీదా, మిగతా "పణం" కాంట్రాక్టు ప్రమేయం లేకుండా ఇవ్వమంటారు.

ఆ స్టార్ కావాలీ అనుకుంటే, ఈ షరతు తప్పదు. నిర్మాత ఈ పరిస్థితిలో, పెట్టుబడి కార్పొరేషన్‌కి ఈ "బ్లాక్ మనీ" గురించి ఏం సంజాయిషీ ఇస్తాడు "ఏదో ఖర్చు అయిందిలెండి దానికి నేను పద్దు వేసి చూపిస్తాగా" అనాలా గుంభనగా? అప్పుడు సాక్షాత్తు సర్కారువారు నెలకొల్పిన పెట్టుబడి కార్పొరేషన్ వారు, గంభీరంగా మందహాసం చేసి ఊరుకోవాలా?



నారాయణన్ కంపెనీవారి "దేవత"లో అంజలి, జెమినీగణేశన్.

బజార్‌లో బజార్

ఈ దృష్ట్యా ఆలోచిస్తే, సహాయం ఇవ్వడంమాట అలా ఉంచెగా, అప్పుకావాలని అడగడానికి వచ్చే నిర్మాతలు అట్టేమంది ఉండరనిపిస్తోంది.

అందువల్ల, కేంద్రమంత్రి డా|| బి. వి. కేస్కర్, ఈ పెట్టుబడి కార్పొరేషన్ స్థాపనకు సంబంధించిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేముందు, ఒకసారి ఈ ఫిలిం బజారులోని మాయాబజార్‌లోని చీకటి బజార్‌లోకి ఒక్కసారి తొంగిచూచి అనుసరణయోగ్యమైన పద్ధతులూ, షరతులూ, రూపొందించుకోవడం అవసరం.

డాక్టర్ రాజ్‌కపూర్!

శ్రీ 420, మరికొన్ని చిత్రాలూ విడుదల చేసినసందర్భంలో ఈమధ్య ఇరాన్ వెళ్లిన రాజ్ కపూర్ ఆదేశంలో, ఘనసన్మానాలూ, "డాక్టర్ ఆఫ్ సినిమాటోగ్రఫీ" అనే బిరుదూ అందుకున్నాడు. అక్కడివారు బిరుదునిచ్చినా, ఈయన ఎలా స్వీకరించాడో బోధపడదు.

"శ్రీ 420" చిత్రానికి ఛాయాగ్రహణం నిర్వహించినవాడు రాధూ కర్మాకర్. ఇదేకాదు, రాజ్ కపూర్, ఇంతవరకూ ఏ చిత్రానికీ ఛాయాగ్రహణం నిర్వహించిన సందర్భం సెర్చిలైటు వేసి వెతికినా ఎక్కడా కానరాదు. అయినా తాను చేయనిపనికి బిరుదునందుకోవడం ఆశ్చర్యకరంగా ఉంది.

రాజ్ కపూర్‌కి బిరుదులకొరత ఏమీ లేదు. అతని అభిమానులు పెట్టిన పేర్లలో కొన్ని: ఆవారా కపూర్, 420 కపూర్, రణ్‌వీర్

★ సినిమా వార్తలు ★

"అమర సందేశం నిర్మించిన సాహిణీ వారి కొత్త చిత్రం "పెంకి పెళ్లాం" ఈ నెల 6 న విడుదల అయింది. శ్రీ కమలాకర కామేశ్వరరావు ఈ చిత్రానికి దర్శకత్వం నిర్వహించారు. ఎన్. టి. రామారావు, రేలంగి, రాజసులోచన, శ్రీ రంజని, రమణారెడ్డి మొదలగువారు నటించారు.

రాణీ (ఇది అతని అసలు పేరు), రాజా, చెంబూర్ చాప్లిన్, కేవమన్, కంజా. ఇన్ని బిరుదులిచ్చిన ఇంతమంది అభిమానులలోను ఏ ఒక్కరికీ "డాక్టర్ ఆఫ్ సినిమాటోగ్రఫీ" అనేది తట్టనేలేదు మరి!

* * *

ఓ. పి. నయ్యర్ పాటలలో 'బాక్సాఫీస్ హిట్' అని చెప్పతగ్గ "యే హై బంబై మేరిజాన్" (సి. ఐ. డి. చిత్రంలోది) అనే పాటలో ఈమాటలు నాలుగింటితోనూ ఒక కొత్త చిత్రానికి పేరు పెట్టారు. ఈ పేరుతో జయా ఫిలింస్ నిర్మిస్తున్న చిత్రంలో శ్యామ, భగవాన్, అన్వర్, డెయిసీ, ఇరానీ, గులాబ్, మారుతి నటిస్తున్నారు.

'స్కారమాచ్' అనే ప్రఖ్యాత హాలీవుడ్ చిత్రాన్ని ఆధారం చేసుకుని, హిందీలో ఒక చిత్రం నిర్మించడానికి జూపిటర్ పిక్చర్స్ వారు సన్నాహాలు చేస్తున్నారు. హాలీవుడ్ చిత్రంలో స్టివర్ట్ గ్రేంజర్ నిర్వహించిన భూమికను, అజిత్ కు ఒప్పగిస్తారట. దర్శకత్వం, పి. పి. (నయా ఆద్మీ) దీక్షిత్ నిర్వహించవచ్చునని తెలుస్తోంది.

టాల్ స్టాయ్ నవల "వార్ అండ్ పీస్" చదివి, ఆ ఉత్సాహంతో, దర్శకనిర్మాత డి. డి. కాశ్యప్ దాన్ని భారతీయం చేసి, హిందీలో తీయడానికి పడికట్టారని తెలుస్తోంది. ఆ చిత్రం పేరే "ఆన్ బాన్" ట. ఈ "ఇండియనైజేషన్" కార్యక్రమ ఫలితంగా, "వార్ అండ్ పీస్"ను రాజపుత్ర స్థానానికి అంటగట్టడం జరిగింది. రాజపుత్ర చరిత్రలో ఉజ్వల వీరగాథలకు కొరవలేదు. యుద్ధాలకోసం కూడా వెతుక్కోనక్కరలేదు. పేరు ఎరువు తెచ్చుకోనక్కరలేదు...

ఆ చిత్రంలో, అంటే—'ఆన్ బాన్'లో నటించే జయవంత్, ఉషాకిరణ్, అజిత్, మహీపాల్, ఉల్హాస్, నిరంజనశర్మ మొదలగువారు పాల్గొంటున్నారు. సంగీతం హుసన్ లాల్ భగత్ రాం. ★

కె. కే. నాగారావు పాల్గొన్న ఆఖరు చిత్రం ఇదే.

మాటలు పాటలూ ఆత్రేయ వ్రాశారు. శ్రీ ప్రసాదరావు సంగీతం సమకూర్చారు. నిర్మాతలు శ్రీ భావనారాయణ, శ్రీ డి. బి. నారాయణ.

* * *

నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావు, ఎస్. వి. రంగారావు, అంజలీదేవి, సావిత్రి, జానకి మొదలగువారు పాల్గొన్న చిత్రం లలితా ఫిలింస్ వారి "చరణదాసి" ఈ నెల 18 న విడుదల అవుతోంది. ఈ ఏడాది విడుదలయిన చిత్రాలలో ఇంతమంది అగ్రశ్రేణి నటీనటులున్న చిత్రం ఇదే నననచ్చు. ఈ చిత్రం నిర్మాత శ్రీ శంకరరెడ్డి. శ్రీ సదాశివబ్రహ్మం సంభాషణలూ, సముద్రాల, సదాశివబ్రహ్మం, కొసరాజు రాఘవయ్య పి. బి. ఎల్. ఆచార్య పాటలు వ్రాశారు. సంగీతం సాలూరి రాజేశ్వరరావు, దర్శకుడు శ్రీ తాతినేని ప్రకాశరావు.

* * *

విక్రం ప్రొడక్షన్స్ వారి "భక్త మార్కండేయ" చిత్రం కూడా ఈ నెలలోనే విడుదల కాగలదని తెలుస్తోంది. ఇందులో నాగయ్య, పుష్పవల్లి, మాస్టర్ బాబ్జీ, ఆర్. నాగేంద్రరావు నటిస్తున్నారు. రచన సముద్రాల, దర్శకత్వం బి. ఎస్. రంగా.

* * *

భగసాయి ఫిలింస్ వారి 'బతేదార్' చిత్ర నిర్మాణం పూర్తి కావచ్చింది. త్వరలోనే విడుదల చేయాలని నిర్మాత శ్రీ టి. రంగయ్య సంకల్పం. శ్రీ రజనీకాంత్ దర్శకత్వాన రూపొందుతున్న ఈ చిత్రంలో జగ్గయ్య, రేలంగి, సుమ్మడి, సి. ఎస్. ఆర్. జానకి, గిరిజ, మొదలగువారు పాల్గొంటున్నారు.

కొండముది గోపాలరాయశర్మ మాటలూ, అనిశెట్టి సుబ్బారావు పాటలూ వ్రాశారు. సంగీత దర్శకుడు సుసర్ల దక్షిణామూర్తి. ఛాయాగ్రహణం సి. నాగేశ్వరరావు, కళ మూరన్న.



వహీద్ లతీఫ్ చిత్రం "లల్లారూఖ్"లో శ్యామ



పారమౌంట్ వారి విస్టావిజన్ చిత్రం "వేగబాండ్ కింగ్"లో
గాయని కేత్రిన్ గ్రేసన్

న్నారు. ఈ చిత్రాన్ని ఉగాది నాటికి ఆంధ్ర ప్రదేశ్ లో విడుదల చేయాలని నాగయ్య గారి సంకల్పం.

కళ్యాణీ పిక్చర్స్ వారి "అక్కా చెల్లెళ్లు" అమర్ నాథ్, సి. యస్. ఆర్, రాజనాల, రమణా రెడ్డి, శంకర, పెరుమాళ్ళు శ్రీరంజని, జమున, సూర్యకాంతం మొదలగు వారు నటిస్తున్నారు. రచన శ్రీ శ్రీ. సంగీతం పెండ్యాల. దర్శకత్వం సార్య శ్యామ, అమానుల్లా.

భరణీ వారు తాము నిర్మిస్తున్న చిత్రానికి ఇంత వరకూ ఉంటున్న "అక్కా చెల్లెలు" అనే పేరును మార్చి "భలే అమ్మాయిలు" అని కొత్త పేరు పెట్టినట్లు ప్రకటించారు. మరొక కంపెనీ నిర్మిస్తున్న చిత్రానికి ఇదే కాకపోయినా ఇటువంటి పేరే ప్రచారంలో ఉండడమే ఈ మార్పుకి కారణం కావచ్చు. అయినా కాకపోయినా, దాదాపు ఒకటే అనిపించే పేరుతో రెండు చిత్రాలు విడుదల కావడం ఈవిధంగా నివారించబడడం సంతోషించ తగ్గ విషయం. ఇప్పుడు భరణీవారి చిత్రం "భలే అమ్మాయిలు"లో భలే అమ్మాయి లిద్దరూ "భలే రాముడు" చిత్రంలో పాల్గొన్న భలే అమ్మాయిలే. వీరు తమిళ తెలుగు వర్షన్లు రెండింటిలోను కనబడతారు. పోతే తెలుగు చిత్రాలలో రామారావు, జగ్గయ్య, రేలంగి, సి. యస్. ఆర్, సీత పాల్గొంటున్నారు. దర్శకుడు వేదాంతం రాఘవయ్య. సంగీతం రాజేశ్వరరావు.

* * *

నారాయణన్ అండ్ కంపెనీ వారి హిందీ చిత్రం "దేవత" నవంబరు 30 న ఆంధ్రలో విడుదల అయింది. ఇందులో అంజలి, వైజయంతిమాల, జెమినీ గణేశన్, నంబియార్ నటించారు. సి. రామచంద్ర సంగీతం సమకూర్చారు. దర్శకుడు పట్టణ్ణ. ★


★ సినిమా వార్తలు ★

అన్నపూర్ణా పిక్చర్స్ వారి "తోడి కోడళ్లు" చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేస్తున్నారు. శరత్ నవల నిష్కృతి ఆధారంగా తయారౌతున్న ఈ చిత్రానికి ఆత్రేయ మాటలూ పాటలూ వ్రాశారు. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు. నాగేశ్వరరావు, రేలంగి, రంగారావు, జగ్గయ్య, సావిత్రి, సూర్యకాంతం, కన్నాంబ, మొదలగు వారు నటిస్తున్నారు.

* * *

నిర్మాణంలో ఉన్న ఇతర చిత్రాలు

వి. యస్. ఫిలింస్ వారి "రామదాసు." నాగయ్య, లింగమూర్తి, ఎ. వి. సుబ్బారావు, వసల సూర్యచంద్రరావు, సూర్యకుమారి, కన్నాంబ, ఋష్యేంద్రమణి మొదలగు వారు నటిస్తున్నారు. రచన యడవల్లి లక్ష్మీనారాయణ. పర్యవేక్షణ సముద్రాల సీనియర్. దర్శకుడు నాగయ్య. ఇప్పటికి 6 రీళ్ళు పూర్తి అయ్యాయి. మరో సెట్ పై వీనస్ లో త్వరలో నే పని ప్రారంభిస్తు



డా॥ గోవిందరాజు సుబ్బారావు షష్టిపూర్తి

డా॥ గోవిందరాజు సుబ్బారావుగారి షష్టిపూర్తి ఉత్సవం నవంబరు 25 న జరిగింది. ఈ అరవయ్యో పుట్టినరోజున బంధుమిత్రులూ, ఆప్తులూ, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శుభాకాంక్షలు అందచేశారు. చలనచిత్ర పరిశ్రమలో ఆయన మిత్రులు, సహచరులూ అయిన శ్రీయుతులు బి. ఎన్. రెడ్డి, కె. వి. రెడ్డి, చక్రపాణి, నాగయ్య, లింగమూర్తి, రేలంగి వెంకటరామయ్య ప్రభృతులు గౌరవాభిమానాలు తెలియచేస్తూ పుష్పహారాలు వేశారు.

స్టేజిమీద సుబ్బారావుగారిని చూచిన వారికి, ఆయన యుగంధరుడు, బుస్సీ, గిరీశం మొదలైన భూమికలు చిరస్మరణీయాలు.

అలాగే వెండితెరమీద 'మాలపిల్ల'లో సుందరరామశాస్త్రి, 'బాలనాగమ్మ'లో మాయలఫకీరు, 'గుణసుందరి'లో మహారాజు, కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధానులు ఆబాలగోపాలానికీ అభిమానపాత్రములైన పాత్రలు.

సుబ్బారావుగారు తెనాలిలో అగ్రశ్రేణి వైద్యుడుగా (అల్లోపతి, హోమియోలు రెండింటిలోనూ) పేరుగడించారు. స్వర్గీయ గూడవల్లి రామబ్రహ్మంగారి ప్రోత్సాహంమీద తొలిసారిగా చలనచిత్రాలలో ప్రవేశించారు. తొలిచిత్రం "మాలపిల్ల". తరువాత కథ అందరూ వెండితెరమీద చూచినదే.

ఇటీవల కొన్ని సంవత్సరాలుగా ఆయన అణుశాస్త్రంమీద శ్రద్ధవహించి, అందులో కృషిచేస్తున్నారు. రెండేళ్లక్రితం "ఇనార్గానిక్ ఇవల్యూషన్" అనే గ్రంథం ఒకటి వ్రాశారు.

★ హిరోషిమా ★

"యూకి వారినూ" అనే జపాన్ చిత్రం వచ్చింది. అది హిందీలో "భాగ్యవాన్" అయి తెలుగులో "మా గోపి"గా మారి తమిళంలో "జయగోపి" గా తర్జుమా అయింది. అన్ని ప్రాంతాల్లోను ఆదరణ పొందింది.

రచయిత:

డైరెక్టర్ జగన్నాధ్

ఇటీవల "హిరోషిమా" అనే జపాను చిత్రం ఒకటి అమెరికా, యూరప్ దేశాల్లో ప్రదర్శించబడి, ప్రపంచంలో మంచి చిత్రాల్లో ఒకటిగా పరిగణింపబడింది.

రెండవ ప్రపంచసంగ్రామం అవసాన దశలో, అమెరికను విమానాలు, "హిరోషిమా," "నాగసాకి" పట్టణాలమీద అటంబాంబులు ప్రయోగించినదగ్గిర మొదలుపెడుతుంది. నిజంగా అటంబాంబు వేసినప్పుడు తీసిన డాక్యుమెంటరీ పార్ట్సు విరివిగా ఉపయోగించారు. ఈ మహాస్త్రంలోని రాక్షస పరిణామము చాలా వివరంగా ప్రదర్శించారు.

యుద్ధం అయిపోతుంది. శాంతి సంరక్షణ క్రింద జపానులో 'మెకార్థర్' యుగం ప్రారంభమవుతుంది. హిరోషిమావిధ్వంసంలోంచి బ్రతికి బయటపడిన అల్ప సంఖ్యా



రాజ్ కపూర్ చిత్రం "అబ్ దిల్లీ దూర్ నహీఁ"లో మోతీలాల్, సులోచన.



మినర్వావారి 'సారంగధర'లో ఎన్. టి. రామారావు

అర్థ నిర్వచనాలు

అలారం టైంపీస్:-పిల్లలు లేని వారిని నిద్రనుండి మేల్కొల్పడానికి కొంతవరకూ ఉపయోగించే ఒకానొక యంత్రము.

సమయస్ఫూర్తి: ఎదటివాడెవడో వచ్చి నోరు మూసేలోగా మనంతట మనమే సకాలంలో ఆ పని చేయగలగడం.

హిరోషిమా

కులలో ఒక కాలు తెగిపోయి అందవిహీనుడెయిన ఒక వ్యక్తి ఈ కథకు నాయకుడు.

ఇతనికి బ్రతుకు తెరువు కావాలి. ఎలాగో కొంతకాలానికి మళ్లీ క్రొత్తగా జపానులో ఆరంభిస్తూ ఉన్న ఫాక్టరీలో పని దొరుకుతుంది. సాంఘిక జీవనోపకరణాలయిన వస్తువులను ఎక్కువగా నిర్మించటంలో ఈ ఫాక్టరీ రాత్రిం బగళ్లు పనిచేస్తూంటుంది. మెల్లమెల్లగా, ప్రజలు ద్వేషము మరచిపోయి, ప్రశాంతంగా దైనికజీవనంలో మెరుగులు పెట్టుకోవటానికి సౌఖ్యం వృద్ధిచేసుకోవటానికి తంటాలు పడుతూంటారు. అంగహీనుడయినా, అందవిహీనుడైనా పెళ్ళి చేసుకుని కుటుంబీకుడవాలనే సంకల్పం కలుగుతుంది. అతనికి ఆ సహాయం చేసే అమ్మాయి కుదురుతుంది. ఈ నవజీవనప్రభాతంలో కొరియాయుద్ధం ఆరంభమవుతుంది. అమెరికను ప్రభుత్వం హటాత్తుగా యుద్ధపరికరాలను సత్వరంగా సరఫరా చేయవలసి వస్తుంది. జపానుదేశం ఇంకా ఆర్థికంగానూ, రాజకీయంగానూ అమెరికా చెప్పుచేతల్లోనే ఉంటూండబట్టి జపానులో వున్న ఫాక్టరీలు యావత్తూ తక్షణమే యుద్ధ పరికరాలు తయారుచేయాలనే శాసనం వస్తుంది.

యుద్ధముయొక్క పరిపూర్ణ బీభత్సాన్ని భరించిన జపాను ప్రజకి, యిక యెప్పటికీ యుద్ధపరికరాలు చేయకూడదనే సంకల్పం కలుగుతుంది. అమెరికను శాసనాన్ని -తిరస్కరించి, మేం ఈ ఫాక్టరీలలో యుద్ధపరికరాలు చేయమని సమ్మెచేస్తారు. వారిలో అగ్రగణ్యుడు-కథానాయకుడు. యుద్ధం ప్రపంచంలో ఏ మూల బయలుదేరినా సరే మన కాయకష్టంలా ప్రతిఘటించాలేకాని,-ప్రాణాలు పోయినా యుద్ధాన్ని విజృంభింపచేసే పనులు చేయమని, పెద్ద ఉపన్యాసం చెబుతాడు.-ప్రజలు అతన్తో ఆమోదిస్తారు.

శాంతిస్థాపన కంకితంగా, యీ చిత్రం వచ్చింది జపానునుంచి.

భాష అర్థం కాకపోయినా, జపానువారి సంగీతం, వైఖరి, ముఖకవళికలు, మిగిలిన దేశాలవారికి కొంత విడ్డూరంగా ఉన్నా, ఈ చిత్రానికి అన్నిదేశాలవారూ బ్రహ్మరథం పట్టారు.

హిందూదేశంలో ప్రదర్శించటానికి ఈ చిత్రాన్ని బొంబాయి కంపెనీ ఒకటి ఏర్పాట్లు చేస్తూన్నదని లోగడ విన్నాం.

ఆంధ్రదేశం తప్పకుండా ఆదరించే చిత్రం అని అనిపిస్తుంది. ★

★ ఆయువు పట్టు ★

(12వ పేజీ తరువాయి)

త్థామ అన్నాడు. వాలికప్పుడే విపరీతమైన బాధ గలుగుతోంది! ఓ చుట్టముక్కల కేసుతో తన డిటెక్టివ్ జీవితం అంతాన్ని తొచ్చేస్తున్నది. తలకిపోయాడు. వాలిగారి వైఖరికి మిస్. సురేఖ నవ్వాపాలని గట్టి ప్రయత్నం చేస్తున్నది.

కతిలా దూసుకొచ్చాడు కళ్యాణవీధి డిటెక్టివు చాణుక్య.

"వస్తూనే ఆశ్చర్యంగా నాకబునేశాడు వాలిగార్ని గురించి."

సంగతంతా అశ్వత్థామ మొదలుపెట్టాడు చెప్పటానికి...మధ్యలో అందుకుని పూర్తి చేసింది మిస్ సురేఖ సహాయాన్ని అర్థించాడు "అసహాయశూరుడు"గా గతంలో వ్యవహరించిన వాలి!

షాకు (shock) తగిలినవాడిలా తల కిందులయ్యాడు చాణుక్య. తడబడుతూ చెప్పాడు తన మోటారుసైకిలు చవర్ లెట్ కొత్త కనపడటంలేదని. అది లేకపోతే, అతిడసలు అపరాధ పరిశోధన కివర్లు డట.

అంతా విచిత్రంగా వుంది.

అప్పటికల్లా అర్ధరోజు గడిచిపోయింది. డిటెక్టివ్ లోకంలో బయలుదేరిన ఈ తుఫాను పట్టణం నలుమూలలా కొవురు కమ్మింది. రేడియోలు ఎలుగెత్తాయి. తాజా వార్తలు తమాషాగా తయారయినయ్. విలేఖరులు వింతగా చెప్పారు.

శ్రీ వాలిగారింట్లో డిటెక్టివు లందరూ గుమిగూడి గుసగుసలు ప్రారంభించిన వారే! అంతా ప్రఖ్యాత డిటెక్టివు వాలిగారికి సహాయం చేయాలని కుతూహలం కలవారే! కానిలాభం కే.... ప్రఖ్యాతి గాంచిన వారందరు వారివారి పరికరాలను, సాధను కాని, ఆలోచనా సామగ్రి దూరమైనవారే!

డిటెక్టివు భీమసింగ్ పిపర్ పోయిందంటే, శ్రీ! శర్మ చొంతాడుకోసం(ప్రాకీది)బాధపడు తున్నాడు. డి. యంగంఫర్, అసిస్టెంటు రాజాకోసం రంగలు వేస్తుంటే, వకీలు నరదానందం తన నల్లకోటు కోసం గాభో తున్నాడు.

గొడవ గొడవగా వుంది డిటెక్టివు లోకం. రాత్రి అయ్యేసరికి వారందరు రాలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాలి చుట్ట పీకల కేసు కనిపించకపోయినా, అశ్వత్థామ గారి అసిస్టెంటు కళ్ళు బాగుపడకపోయినా, చాణుక్యగారి చవర్లెట్ చేతికందకపోయినా దితర తరహాలు మారకపోయినా, వారం పేర్లు డిటెక్టివు లోకంనుండి. సాయంత్రం 6 గంటల తరువాత పర్దుకోవాల్సిందే! ఆమహా నగరం చిన్నపోయి, చితికిపోవాల్సిందే! ప్రపంచ చరిత్రలో రాలని, రాల బోని నక్షత్రాలు రాలిపోవాల్సిందే!

అంతా అంధకార బంధురంగా మారుతుంది "దోపిడీలు...హత్యలు...నల్లబజారు అవినీతి...అన్యాయం ... ఆడవాళ్ళ అఘాయిత్యాలు అన్నీ విజృంభించి ... సర్వనాశనం అవ్వాలిసిందే!

"తోకచుక్క పుట్టింది, అని శాస్త్రజ్ఞులు చెపుతుంటే విన్నాం కాని... ఇంత అనర్థకం సంభవిస్తుందని కలకన్నామా?" కళ్ళు తుడుచుకుంటూ ప్రకటించాడు... పరశురామ్.

"కలియుగాంతంలో... ఇలాంటి దౌర్భాగ్యపు పనులు జరుగుతవని... ఏనాడో వ్రాశాడు," విరాళను వ్యక్తం చేయాలని వుద్దేశ్యంతో వ్రాక్కుచ్చాడు, డింభాసుర రావు...

2

దారినపోయే దానయ్యకు,ప్రక్కనపోయే పమిడయ్య చెప్పాడు, "విశేషాలన్నీ" చాల విసురుగా.

"అలాగా?" అన్న దానయ్యకు "అదేనోయ్, అలాచూడు అట్టుడికి పోతున్నట్లు వుడికిపోతోంది," అంటూ పరిగెత్తి పోయాడు పమిడయ్య.

దరి, పరితోచని దానయ్యకు తలకుమించిన ఆలోచన తట్టింది. మరేంలేదు. తనూ ఓడిటెక్టివు నవుదామని.

తటాలున ఆటోరిక్షా ఎక్కి క్షణం వాలి ఇలు చేరాడు.

సాయంత్రం, నాలుగు గంటలు కొట్టాలనుకొంటోంది.

వాలిగారి ఇల్లు వానవెలిసిన దావిలా ప్రశాంతంగా వుంది. మనుషులున్న అలికిడి లేదు. దానయ్య ధన్మని ఆగి, తొంగి చూచాడు.....అంతా వున్నారు.....ఎవరి స్థానాల్లో వారు.

వాలిగారు చాణుక్యగారి చుట్ట పొగకేసి ఆశగా చూస్తున్నారు. అశ్వత్థామ మిస్. సురేఖ ఎడం కంటిలోకి ఏదోగా చూస్తున్నారు. చాణుక్యగారు భీమసింగు మోటారుకేసి మొహమాటంగా ... ఇలాగే, డి.శర్మ, రమేష్, పరుశురామ్....వకీలు నరదానందం ... ఏవేవో ఒకే పనిగా వాచినట్లు చూస్తున్నారు.

దానయ్య తరుణం మంచికే వన్నట్లు తరంగంలా వచ్చిపట్టాడు. డిటెక్టివు మండలి ముఖ్యకు.

అందరికి నమస్కరించాడు.

"ఎవరు నీవు?" ఆశగా ప్రశ్నించాడు, అశ్వత్థామ. "షెర్లాక్ హోముగారి ఏకలవ్య శిష్యుడ్ని...డిటెక్టివు దర్యాప్తీగారికి దగ్గరివాణ్ణి; అపరాధ పరిశోధన అంటే అమితమైన ప్రేమకలవాణ్ణి. కొద్ది ప్రవేశం కూడా కలవాణ్ణి. ఇక మీరు దయదలిస్తే, మీకు ప్రత్యక్ష మిత్రుణ్ని అవ్వాలని కుతూహలం వుంది," అంటూ కొద్దిగా సిగ్గుపడిపోయాడు దానయ్య.

యువకుణ్ని......విశాలభావాలు కొల్లలుగా కలవాణ్ని స్వార్థంఅంటే స్వప్నంలో కూడ అసహ్యించుకొనేవాణ్ని. పేరు, ప్రతిష్ఠ ఇంతవరకు క్రెడిట్ లో లేనివాణ్ణి... నాగురించి అంతగా చెప్పకోవటం బాగుండదనుకోండి ... అయినా కాలం ... డిటెక్టివుగా మారాలని వచ్చాను.

"నాకూ ఈవృత్తిలోకి రావటానికి అడ్డంకు లేవిలేవు. వ్యాపారంలో దివాలాతీశాను... పంచాయితీ ఎన్నికల్లో పరాజయం పొందాను...పరీక్షలు పాసవ్వాలనే ప్రమేయాన్ని పాతిపెట్టాను.

కాబట్టి అవకాశం ఇస్తే మీకీనాడు వాటిల్లిన అవాంతరాన్ని ఆపుచేసి, చరిత్రకు వన్నె సాధించాలని వచ్చాను," అని మరీ సిగ్గుపడిపోయాడు దానయ్య...

అంతా పరీక్షించి నకిలించారు. దానయ్యను తమ దైవమన్నారు కొందరు. మరికొందరు తమ పాలిటి ప్రాణదాత అన్నారు.

వాలిగారు దీవించారు. అశ్వత్థామ జబ్బ చరిచాడు. సురేఖ కరస్పర్శ చేసింది. వకీలు నరదానందం గాఢాలింగనం చేసికొన్నాడు. మరికొందరు సాష్టాంగ నమస్కారాలు చేస్తూ "కరయుగములు చరణంబులు..." అంటూ గొణుక్కుంటున్నారు.

దానయ్య, కొన్ని క్షణాలక్రితం దారినపోయే దానయ్య, దరిద్రపు దానయ్య... దౌర్భాగ్యపు దానయ్య...దమ్మిడి చేయని దానయ్య... కాని యిప్పుడో "దర్జా దానయ్య"అయి కూర్చున్నాడు.

అచ్చే కూర్చోలే. అందరి ఆశీర్వాదాలు పొంది అపరాధ పరిశోధన ప్రారంభించటానికి బయలుదేరి వెళ్ళాడు.

3

దానయ్య వెళ్ళి గంటసేపయింది. తిరిగి రాలేదు. 6½ గంటలు కూడా అయింది. దానయ్య ఆమాకీలేదు.

మరో అరగంటలో అందరి జాతకాలు మారిపోతయ్...

వాలి నీరసంగా మూల్గాడు...చాణుక్య తల్లడిల్లుతున్నాడు...

ఆయువుపట్టు

6 గంట లవుతుండగానే, అంతరిక్షం నుండి వూడిపడ్డట్లు వచ్చి పడ్డాడు దానయ్య. చాణుక్యగారి చెవర్లెట్ మీద నిలక "రాజా సెక్కించుకొని"—

అంతా హర్షధ్వానాలు చేశారు.

దానయ్య ఆనందంపట్టలేక, ఆనంద పడటం అప్పుడప్పుడ తిప్రమాదకరమని ఆనందించటం మాని, అందించాడు అందరి వస్తువులు...

మిగిలింది చివరి ఘట్టం...దానయ్య అందర్నీ ఆనందపరుస్తూ, ఆశ్చర్యపరుస్తూ చెప్పుతున్నాడు తన అనుభవాలను.

"చాణుక్యగారి మోటారు ఎక్కడా" అని ఆలోచించాను ఎక్కడుంటుంది... బహుశా ఆయన షెడ్డులో బదులు మరెక్కడైనా పెట్టారేమో అని వెతికాను...నా అనుమానం. అందరి డిటెక్టివుల - అనుమాల్లా గానే నిజమైంది. ఆయన "మోటారుసైకిలు" వాళ్ళ మెట్ల గదిలో దొరికింది.

అది తీసికొని మిస్. సురేఖగారింటికి వెళ్ళాను."వాళ్ళ చెల్లాయి చెప్పింది, రాత్రి వాళు గోరంటాకు పెట్టకొన్నట్లు. అప్పుడే అనుమానించాను ఆమె కళ్లలో గోరంటాకు పడి వుంటుంది అనుకొని. కటులిప్పితే కన్ను బాగానే వుండవచ్చు యిప్పటికల్లా."

ఇహ హనుమంతంగారి భూతఅద్దం... అది ఆయన Meals tabe మీద దొరికింది. బహుశా ఆయన రాత్రి దాంతో అన్నంలో వలకల్ని చూచి వుంటేవచ్చు.

అలాగే అందరి వస్తువులు దొరికాయి. డిం శర్మగారి చాంతాడు (పైకి ప్రాకేది) బక్కెటుకు కట్టబడివుంది. వకీలు వరదానందం గారి నల్లకోటు"భారత్ వాషింగుహౌస్"లో మురికి బట్టల కటలో వుంది.

అలా దారినే వస్తూవుంటే "యుగంధరు గారి అసిస్టెంటు "రాజా" కనిపించాడు... రాత్రి అతను అత్తవారింటికి వెళ్ళాడట.

ఇవన్నీ చాల తేలికగానే తేలిపోయాయి. కాని నన్ను చాల బాధపెటింది. చాల ఆలోచించాను. కాఫీ, టీ, కోకో...వరసగా త్రాగి మరీ ఆలోచించాను...చివరికి మూర్ మార్కెట్లో దొరికింది...అక్కడికెలా వెళ్లిందో మొదట అసలరంకాలేదు.... చివరికిలా నిశ్చయించాను. బహుశా! వాలిగారు దాన్ని పొరపాటున ఏ పాండిబజారు లోనో జారవిడచివుంటారు...దాన్ని ఏ లాయడ్రోడ్డు రౌడీయో మూరుమార్కెట్టులో అమ్మివుంటాడు... ఏమైతేనేం మన వస్తువు దొరికింది. ఇక దుష్టశిక్షణం టారు... తరువాత చూచుకోవచ్చుని దారినే పడివొచ్చాను.

దానయ్య కంఠసీమ దండలతో నిండిపోయింది. అంతా ఆశ్చర్యపు పోజునుండి. ఈలో స్థిమితపడి పోవటం ప్రారంభించారు.

ఇంతలో అదరాబాదరా ఇన్స్పెక్టరు జాకబ్ అక్కడికొచ్చాడు.

"వాలిగారు తృప్తిగా కొల్పుతూ" ఏమోయ్ జాకబ్ హంతకుడు దొరికాడా అన్నారు...

"లేదుసార్... వెంబడిస్తున్నాము... ఇప్పుడే యిలా వచ్చాడని మా కానిస్టేబులు కనకం చెప్పాడు"

అరె వీడేసార్...అంటూ దానయ్యను దబాయించి పట్టుకొన్నాడు.

దానయ్య బిక్కమొహం వేశాడు.

దానయ్యలాంటి పెద్దమనిషిని, ప్రజ్ఞావంతుణ్ణి అలా అందరిలో అంత అమర్యాదగా పట్టుకొన్నందుకు డిటెక్టివ్ లోకం మొత్తం మహా తీవ్రంగా ప్రజ్జరిల్లింది.

జాకబు గుండెలు పగిలేంత పనైయింది. చేసిన తప్పు దటుక్కున తెలుసుకొని, చొక్కా వదలి కాళ్లు పట్టుకొన్నాడు.

"క్షమించండి, పొరపాటైయింది. ఆ మాసిన గడ్డం చినిగిన చొక్కా చూచి హంతకుడని పొరపాటు పడ్డాను" అని అతి దీనంగా దానయ్యను వేడుకున్నాడు.


అంతా విని అమాంతంగా అదిరిపడి మరి కొంత క్షమాభిక్షకోసం చేయి చాచాడు.

అంతా "అహా! నిన్ను క్షమించటానికి వీలులేదు అన్నారు. జాకబ్ గుండె పగిలి పోవటానికి సూదనగా ఆగిపోయింది.

దానయ్య దయతలిచాడు...

కాళ్లమీద పడివున్న జాకబ్ను తట్టి లేపి...తల నిమిరాడు...

డిటెక్టివ్ లోకం అంతా దానయ్య సహృద సౌశీల్యాలకు సంతోషించిపొంగిపోయింది. ★



(30వ పేజీ తరువాయి)

దేశాలకు పెట్రోలు సరఫరా చేయడానికి అమెరికా సంసిద్ధతను ప్రకటించింది.

పోర్టుసయిద్ ను ధ్వంసంచేసి అనేక అమాయక పౌరుల సంహారానికి కారణమైన బ్రిటిష్, ఫ్రెంచి సైన్యాలు ఈజిప్టు భూభాగంనుంచి వెడలగడానికి ఇష్టపడిన ప్పటికి మరికొంత కాలం దాకా పూర్తి ఉపసంహారణ జరగక పోవచ్చు. అయినా ఇప్పటికే సమితి సైన్యాలు ఈజిప్టు సైనిక శ్రేణికి, బ్రిటిష్ ఫ్రెంచి సైనిక శ్రేణికి మధ్య స్థావరాలేర్పరచుకొని ఉన్నాయి.

కోటిడాలర్ల ఖర్చు

ఈ సమితిసేనకు అయేఖర్చు ఎవరు భరించాలీఅనేవిషయమై సమితి సర్వసభ్యసమావేశంలో పేచీవచ్చింది. సమితి సేనకయ్యే ఖర్చుకు ప్రత్యేకంగా ఒక చిఠా ఏర్పాటు చెయ్యాలని, మామూలుగా సమితి బడ్జెట్కు ఏదేశం ఎంతసొమ్ము ఇస్తోందో అదేనిష్పత్తిలో సమితిసేన నిధికి కూడా ఇవ్వాలని ఆయన ఒక తీర్మానం ప్రతిపాదించారు. ప్రస్తుతానికి కోటిడాలర్ల ఖర్చును మంజూరు చేయవలసిందిగా ఆయన సమితిని కోరారు. దీనికి సమితిలో 52 దేశాలు అనుకూలంగాను 9 దేశాలు ప్రతికూలంగాను ఓటుచేశాయి. 18 దేశాలు తటస్థంగా వున్నాయి. సమితి సేన ఖర్చును దురాక్రమణచేసినదేశాలే భరించాలని రష్యా, దాని అనుచరదేశాలు వాదించినప్పటికీ హామర్ షెల్డు తీర్మానమే నెగ్గింది. సూయజ్ కాలువ మరమ్మతు పనికూడా త్వరగా జరిపించమనీ, అందుకవసరమైన చర్యలన్నీ తీసుకోవలసిందని సమితి హామర్ షెల్డుకు అధికారాలిచ్చింది. అయితే దీని కొన్ని చిక్కులున్నాయి.

బ్రిటిష్, ఫ్రెంచి సైన్యాల ఉపసంహారణ జరిగితే గాని సూయజ్ కాలువ మరమ్మతు ప్రారంభం కావడానికి వీలేదని ఈజిప్టు పట్టుబటింది. దీనికి హామర్ షెల్డ్ కూడా అంగీకరించారు. కాలువ మరమ్మతు సాధ్యమైనంత త్వరగా జరగడం ప్రపంచ దేశాలన్నిటికీ అవసరమే. యుద్ధ విరమణ సాధించడంలో అమిత కృషిచేసి విజయం పొందిన సమితి కార్యదర్శి, దురాక్రమణదారుల ఉపసంహారణను, కాలువ మరమ్మతునుకూడా జయప్రదంగా సాధించగలరనడంలో సందేహంలేదు.

సమితి కార్యదర్శికి నిజానికి పెద్ద అధికారాలేమీ లేవు. అయినా ఆ ఉన్న అధికారాలనే వివేకంతో ఉపయోగించుకుని, డాగ్ హామర్షెల్డ్ వ్యక్తిగతంగా తన సమర్థతను ఋజువు చేసుకోవడమే కాక, ఐక్యరాజ్య సమితి పేరు ప్రతిష్ఠలను కూడా కాపాడారు. సమితి విచ్ఛిన్నమై పోతుందని అంతా భయపడిన తరుణంలో అసమాన రాజకీయ దక్షత కనబరచి సమితిలో అనేక విషయాల మీద ఐకమత్యాన్ని సాధించారు. ప్రపంచ సమస్యలన్నీ సమితి ద్వారా పూర్తిగా పరిష్కారమవుతాయనే ఆశ్యకళ ఆయన ఎప్పుడూ పోలేదు. "కాని పరిష్కారాలను క్రమబద్ధంగా, నెమ్మది ... సాధించవచ్చునని నేను విశ్వసిస్తాను. ఈ విశ్వాసమే నాకు ధైర్యం కలిగిస్తుంది," అని హామర్ షెల్డ్ ఒకసారి అన్నారు.

అసలు ఇప్పుడు సమితి ఏర్పాటును బట్టే ఇంతకంటె ఎక్కువ ఆశలు పెట్టుకోవడం కూడా సమంజసం కాదేమో.

Printeo and Publishec for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.

Regd. No. M. 4479. Andhra Patrika Illustrated Weekly



సినీమా తారలకు—సౌందర్యమునిచ్చు సబ్బు

LTS. 494-X52 TL